అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 03 -01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 5 సంచిక : 6 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50



తొలిసారి ఇద్దరు మహిళలు

శబరిమలలోకి అడుగుపెట్టిన భక్తులు

- హిందూత్వ బంధనాలు తెంచుకొని లోపలికి

తిరువనంతపురం : సమానత్వ హక్కుల కోసం కేరళలో చారిత్రాత్మక 620 కిలోమీటర్ల పొడవునా 'వనితా మాథిల్' జరిగిన కొద్ది గంటల తర్వాత.. ఇద్దరు మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించారు. బుధవారం తెల్లవారుజామున 3.45 గంటల ప్రాంతంలో కోజికోడ్ జిల్లాకు చెందిన బిందు(42), కనకదుర్గ(44) అనే ఇద్దరు ఆలయంలోకి వెళ్ళి.. అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలోకి వెళ్ళేందుకు అన్నివయస్సుల మహిళలనూ అనుమతిస్తూ గతేడాది సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించిన మహిళలను హిందూత్వశక్తులు అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. 'మంగళవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో మేం పంబ చేరుకున్నాం. అక్కడి నుంచి ఎలాంటి పోలీసు భద్రత లేకుండానే సన్నిధానానికి వచ్చాం. సాంప్రదాయ నల్ల దుస్తులను ధరించి లోపలికి వెళ్ళాం. అయ్యప్ప దర్శనం చేసుకున్నాం. భద్రతాకారణాల రీత్యా 18 మెట్లను ఎక్కలేదు. ఆ సమయంలో కొందరు భక్తులు అక్కడ ఉన్నారు.. కానీ ...9లో



రాఫెల్ మంటలు

జేపీసీకి ప్రతిపక్షాల డిమాండ్... మోడీ సర్కారు నో

- అంబానీ పేరును ప్రస్తావించిన రాహుల్
- అభ్యంతరం వ్యక్తం చేసిన స్పీకర్ మహాజన్
- సర్కారు వైఖరితో సభలో గందరగోళం
- పార్లమెంట్ గదిలోనే ప్రధాని మోడీ
- అర్థాంతరంగా ముగిసిన చర్చ
- 26 మంది అన్నాడీఎంకే ఎంపీల సస్పెన్షన్
- బీజేపీ తీరుపై శివసేన ఆగ్రహం



నవతెలంగాణ - న్యూఢిల్లీబ్యూరో

రాఫెల్ చర్చతో లోక్‌సభ మరోసారి అగ్గిరాజేసింది. అధికార పార్టీపై ప్రతిపక్ష, వామపక్ష పార్టీలు ఆరోపణల వర్షం గుప్పించాయి. అనిల్ అంబానీ పేరును కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ప్రస్తావించడంతో స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం, రాఫెల్ డీల్‌ను నిశితంగా అధ్యయనం చేసేందుకు జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలని సీపీఐ(ఎం), తదితర పార్టీలు పట్టుబట్టాయి. అందుకు మోడీ సర్కారు నిరాకరించడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొన్నది. రాఫెల్‌పై జేపీసీ అవసరం లేదని వాదిస్తున్న బీజేపీకి తన మిత్రపక్షమైన శివసేన కూడా గట్టి సమాధానమిచ్చింది. ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పక్షంగా ఉన్న ఆ పార్టీ ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌కు మద్దతు తెలిపింది. దీంతో మోడీ ప్రభుత్వం ఇరకాటంలో పడినట్టుగా కనిపించటం విశేషం. కేంద్ర ప్రభుత్వంపై శివసేన పెద్ద ఎత్తున విమర్శలతో దాడికి దిగింది. బుధవారం పార్లమెంట్‌లో 193 నిబంధన ప్రకారం రాఫెల్ ఒప్పందంపై చర్చ జరిగింది. ముందుగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చర్చను ప్రారంభించారు. రాఫెల్ డీల్‌లో జరిగిన అవకతవకలపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సభలో ఇంత పెద్ద చర్చ జరుగుతున్నా... సమాధానం ఇచ్చేందుకు ప్రధాని మోడీకి ధైర్యం ...9లో


మాట్లాడుతున్న సీపీఐ(ఎం) ఎంపీ సలీం


మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

రాజీపడ్డారు

రాఫెల్‌పై రక్షణ శాఖ చేసిన శ్రమ వృధా

- పీఎంఓ జోక్యంతో అంతా తారుమారు

వివరాలు 10లో

పనులు వేగవంతం చేయండి

మార్చి 31 నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేయాలి : సీఎం కేసీఆర్


ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

వివరాలు 9లో


అభివాదం చేస్తున్న చుక్క రాములు

ఎంఆర్ఎఫ్ ఎన్నికల్లో సీఐటీయూ-కేపీఎస్ ఘన విజయం

321 ఓట్ల తేడాతో బీఎంఎస్‌పై జయకేతనం

నవతెలంగాణ-సదాశివపేట రూరల్

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో బుధవారం జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ-కేపీఎస్ (కార్మిక పోరాట సమితి) కూటమి ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో ...9లో

ఏందిరా మీ కులం?

అంబేద్కర్ భవన్ ఎట్ల కడతారు బే..

- ఆర్మూర్‌లో సాంఘిక బహిష్కరణ
- 80 మాల కుటుంబాల వెలి
- బాధితుల నుంచి రూ.50 వేలు వసూలు
- నిజామాబాద్ జిల్లాలో గ్రామాభివృద్ధి కమిటీ ఆగడాలు



నవతెలంగాణ- నిజామాబాద్ ప్రతినిధి, ఆర్మూర్ టౌన్

'మీ కులం ఏందిరా? మా అనుమతి లేకుండా అంబేద్కర్ భవన్ ఎలా కడతారు బే..? మీ సంగతి చూస్తాం' అంటూ నిజామాబాద్ జిల్లాలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అసభ్య పదజాలంతో మాల సామాజిక తరగతి వారిని దూషించారు. 80 మందిని సాంఘిక బహిష్కరణ చేశారు. డిసెంబర్ 24న జరిగిన ఈ బహిష్కరణ బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. బహిష్కరణ అంశాన్ని బయటకు చెపితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించడంతో దళితులు నోరు మెదిపేందుకు సాహసించలేదు. 80 ...9లో

ఓట్ల గల్లంతుతో తగ్గిన మెజార్టీ

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ-బేగంపేట

అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు గల్లంతు కావడంతో టీఆర్ఎస్ అభ్యర్థుల మెజార్టీ తగ్గిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో సనత్‌నగర్ నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ ...9లో



బీసీలకు టీఆర్ఎస్ ద్రోహం

నిరంకుశ ఆర్డినెన్స్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలి

- 34 శాతం రిజర్వేషన్లకు పార్లమెంటులో చట్టం చేయాలి
- సెలవు రోజున నోటిఫికేషన్ జారీ దుర్మార్గం : నిరాహారదీక్షలో పలువురు వక్తలు


మాట్లాడుతున్న ప్రొ.మురళీ మనోహర్

3లో

భూమి కబ్జా చేశారని..

కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ- మంకమ్మతోట

తన భూమిని కబ్జా చేశారనీ, తనకు న్యాయం చేయాలనీ ఓ రైతు కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించాడు. స్థానికులు అడ్డుకుని '108'కు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి వచ్చిన డీఆర్ఓ విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితుని భార్య సరోజన తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలం బొమ్మకల్ అనుబంధ గ్రామం గుంటూరుపల్లికి చెందిన లక్ష్మయ్యకు 20గుంటల భూమి ఉంది. అది కొందరు 10ఏండ్ల కిందట కబ్జా చేశారు. దీంతో ...9లో






ఏం చేయబోతున్నారు?

తొలగించిన ఓట్లపై ఈసీకి హైకోర్టు ప్రశ్న

నవతెలంగాణ - హైదరాబాద్



తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చేందుకు తీసుకునే చర్యలను వివరించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఓట్ల తొలగింపుకు ముందు అభ్యంతరాలు తీసుకోకుండా తొలగించిన ఓట్ల విషయంలో ఏం చేయబోతున్నారో తెలియజేయాలని న్యాయమూర్తులు జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ కేశవరావులతో కూడిన డివిజన్ బెంచ్ ఎన్నికల కమిషన్‌కు నోటీసు ఇచ్చింది. చెప్పా పెట్టకుండా తొలగించేసిన ఓట్లను తిరిగి జాబితాలో ఉంచాలని ఓటర్లు కోరేందుకు ప్రత్యేక అవకాశం ఇవ్వాలని, ఇందుకు ప్రత్యేక దరఖాస్తు ఉండేలా ఈసీ కి ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థిస్తూ హైదరాబాద్‌లోని గోషామహల్ నియోజకవర్గానికి ...9లో

పిడికిలి బిగించి..

చారిత్రాత్మక సమ్మెకు కార్మిక లోకం సన్నద్ధం

- 8,9న దేశవ్యాప్త సమ్మె..
- కార్మిక సంఘాలన్నీ మద్దతు




(ఫైల్)

న్యూఢిల్లీ : మరో ఐదు రోజుల్లో దేశవ్యాప్తంగా ప్రారంభమయ్యే రెండు రోజుల కార్మికుల సమ్మెకు కార్మిక లోకం సన్నద్ధమౌతున్నది. కేంద్రంలోని మోడీ సర్కారు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశంలో ఉన్న సంఘటిత, అసంఘటిత కార్మికులు ఈ నెల 8,9న సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగంలో ఉన్న ఉద్యోగులు కూడా దీనిలో పాల్గొననున్నారు. సమ్మెకు 10 కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలతో పాటు వ్యవసాయ, అనుబంధ సంఘాలు మద్దతు ప్రకటించాయి. కాగా, 12 అంశాలతో కూడిన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటు వ్యక్తులకు, సంస్థలకు తెగనమ్ముతున్న మోడీ సర్కారు తీరు పట్ల దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా మోడీ అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచే కార్మిక లోకం వరుస ఆందోళనలు చేపడుతోంది. ఈ క్రమంలోనే మరో చారిత్రాత్మక సమ్మెకు సన్నద్ధమయ్యారు.

కార్మికుల డిమాండ్లు..

కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని, అడ్డూ అదుపు లేకుండా ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేయడంతో పాటు మరో 8 డిమాండ్లను కార్మికులు మోడీ సర్కారు ముందుంచారు. వారికి సామాజిక భద్రత, కొత్త ఉద్యోగాల కల్పన, అందరికీ రూ.6 వేల పింఛను, ప్రభుత్వ రంగ సంస్థలను ...9లో

దిగ్గజ బ్యాంక్‌గా బీవోబీ

కనుమరుగవనున్న విజయ, దేనా బ్యాంకులు

- మూడు బ్యాంకుల విలీనానికి క్యాబినెట్ సమ్మతి

వివరాలు 10లో

గోరక్షకుల దాడికి ఏఐకేఎస్ ఖండన

న్యూఢిల్లీ: రాజస్థాన్‌లోని అల్వార్‌లో సాఫిర్ ఖాన్, మరో ఇద్దరిపై గోరక్షకుల దాడిని ఆలిండియా కిసాన్‌సభ(ఏఐకేఎస్) ఖండించింది. ఈ ఘటనకు కారణమైన నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాజస్థాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ ఘటనలో దుండగులపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా 'గో అక్రమ రవాణా' పేరుతో బాధితుడిని అరెస్ట్ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. రైతులపై, పశువుల వ్యాపారం చేసేవారిపై గత కొన్నేండ్లుగా ఇక్కడ ఇలాంటి దాడులు అనేకం జరుతున్నాయి. మేవాట్ ప్రాంతంలో పశువులను పెంచుతూ వ్యాపారం చేసే ముస్లింలను సంఘ్‌పరివార్ నేరస్థులుగా చిత్రీకరించి సమాజాన్ని మతం పేరుతో రెండుగా విభజిస్తోందని ఏఐకేఎస్ ఆరోపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం సంఘ్‌పరివార్ దారిలో నడవకూడదని సూచించింది. అదేవిధంగా రాష్ట్రంలో గోరక్ష పోలీసు ఔట్ పోస్టులను తొలగించాలని ఏఐకేఎస్ డిమాండ్ చేసింది. ఇవి గోరక్షకులకు అనుబంధంగా పనిచేస్తూ దోపిడీ కేంద్రాలుగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది.

రాముడిని అవమానించాడని..

కన్నడ రచయిత భగవాన్‌పై కేసు

బెంగళూరు: ప్రముఖ కన్నడ రచయిత కెఎస్ భగవాన్ తాను రాసిన పుస్తకంలో రాముడు, మహాత్మా గాంధీలను అవమానించారని అందిన ఫిర్యాదుతో ఆయనపై కేసు నమోదు చేసినట్టు బెంగళూరు పోలీసులు మంగళవారం వెల్లడించారు. భగవాన్ రాసిన 'రామాలయం ఎందుకు వద్దు' అనే పుస్తకంలో రాముడిని, మహాత్మాగాంధీని అవమానకరంగా చిత్రీకరించారని హిందూత్వ నాయకులు కొందరు బెంగళూరులో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఇదే విషయమై హిందూ జాగరణ్ వేదిక మైసూరు జిల్లా అధ్యక్షుడు కె జగదీశ్ హెబ్బార్.. పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. భగవాన్‌పై చర్యలు తీసుకోకుండా కుమారస్వామి ప్రభుత్వం మౌనం వహిస్తున్నదని బీజేపీ కర్నాటక యూనిట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు... తనపై వస్తున్న విమర్శలను భగవాన్ తిప్పికొట్టారు. వాల్మీకి రామాయణ కథ ఆధారంగానే తాను పుస్తకం రాసినట్టు వివరణ ఇచ్చారు.

పైసా వాపసీ..

నిన్న ఉల్లి.. నేడు ఆలూ..

- పంటకు వచ్చిన రూ.490.. మోడీకి మనీ ఆర్డర్
- బంగాళాదుంప రైతు నిరసన




ఆగ్రా: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన ఒక రైతు తాను పండించిన 19 టన్నుల బంగాళాదుంపను అమ్మగా కేవలం రూ. 490 మాత్రమే పొందాడు. దీంతో తన కష్టానికి తగిన ఫలితం లభించలేదని బరౌలీ గ్రామానికి చెందిన ప్రదీప్ శర్మ నిరసన వ్యక్తం చేస్తూ.. తాను ఆర్జించిన మొత్తం రూ. 490ను ప్రధాని మోడీకి మనీ ఆర్డర్ చేశాడు. శర్మ మాట్లాడుతూ.. మోడీని అగౌరవపరిచేందుకు కాదు.. రైతు బాధల గురించి వారు ఆలోచించాలనే ఈ పని చేశారని వివరించారు. తాను ఆర్జించిన రూ. 490.. మోడీ ఎందుకు ఎన్నుకోబడ్డారో ఆయనకు గుర్తుచేస్తుందని అన్నారు. తాను ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతించాలని ప్రధాని, రాష్ట్రపతి కోవింద్‌కు చాలా లేఖలు రాశారని గుర్తుచేశారు. ఆర్థికంగా బలపడేందుకు సహాయపడాలని యూపీ ఉపముఖ్యమంత్రి దినేశ్ శర్మ సహా పలువురిని కలిశారని, తన ప్రయత్నాలన్నీ నిష్ఫలమయ్యాయని అన్నారు. కాగా, గతనెలలో మహారాష్ట్ర రైతు 750 కిలోల ఉల్లిగడ్డలు అమ్మగా రూ. 1064 పొందడంతో నిరసనగా ఆ మొత్తాన్ని ప్రధానికి మనీ ఆర్డర్ చేసిన విషయం తెలిసిందే.

చౌకీదార్ ఏం చేస్తున్నారు?

బ్యాంకుల్ని ముంచి పారిపోయిన బడా కార్పొరేట్లు 36 మంది

- వీరు ఎగవేసిన సొమ్ము లక్షకోట్లకుపైనే
- మోడీ పాలనలో ప్రతీ ఏటా పెరిగిన బ్యాంకు మోసాలు
- ఆర్‌బీఐ తాజా నివేదికే ఇందుకు సాక్ష్యం



"నన్ను ప్రధానిగా ఎన్నుకుంటే, ప్రభుత్వ ఖజానాకు కాపలాదారుగా ఉంటాను. ఖజానాకు ఎవరైనా కన్నం వేయాలనుకుంటే నేను అడ్డుకుంటాను". 2014 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ నియోజికవర్గంలో నరేంద్రమోడీ ప్రధానికాకముందు చెప్పిన మాటలివి. కానీ ఇప్పుడేమైంది? మోడీ పాలనలో బ్యాంకు రుణ ఎగవేతలు, ఆర్థిక మోసాలు రూ.లక్షకోట్లు దాటిందని ఆర్‌బీఐ తాజా నివేదిక కుండబద్దలు కొట్టింది.

న్యూఢిల్లీ : 2014 ఎన్నికల సమయంలో ఎంతో ఆర్భాటం, దేశవ్యాప్తంగా ప్రధాన మీడియా పెద్ద ఎత్తున అనుకూల ప్రచారం...ఇదంతా గుజరాత్ సీఎం మోడీని...ప్రధాని మోడీని చేసింది. 'చౌకీదార్'(కాపలాదారు)గా ఉంటానన్న మాటల్ని ప్రజలు నమ్మారు. కానీ ప్రజల నమ్మకం వమ్మైంది. ఒకటికాదు...రెండు కాదు...లక్ష కోట్ల రూపాయలు బ్యాంకులను ఎగనామం పెట్టి మోసగాళ్లు దేశవిదేశాలకు పారిపోతుంటే మన 'చౌకీదార్' ఏమీ చేయలేకపోయారు. జరుగుతున్న ఆర్థిక మోసాల్ని చూస్తూ పోయారు. ఆర్థికమోసాల్ని అరికట్టడంలో 'చౌకీదార్' దారుణంగా వైఫల్యం చెందారన్నది తేలిపోయింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) విడుదల చేసిన నివేదిక ఈ విమర్శలు నిజమని రూఢీ చేస్తున్నాయి.

డిసెంబరు 28, 2018న ఆర్‌బీఐ ఈ నివేదికను విడుదల చేసింది. ఇందులో ఏముందంటే, మోడీ ప్రధానిగా ఉన్న ఈ నాలుగున్నరేండ్ల కాలంలో బ్యాంకులకు జరిగిన ఆర్థిక మోసాలు, రుణ ఎగవేతలు రూ.1,03,255 కోట్లు. ప్రతీ ఏటా బ్యాంకు రుణ ఎగవేతలు, ఆర్థిక మోసాలు పెరుగుతూ వస్తున్నాయి. 2014-15లో రూ.19,455కోట్లు, ఆ తర్వాత 2015-16లో రూ.41,167కోట్లు...ఇలా ఆర్థిక మోసాలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రభుత్వ బ్యాంకుల నుంచి పెద్ద ఎత్తున రుణాలు తీసుకున్న బడా కార్పొరేట్లు అంతా దేశం నుంచి ఎంచక్కా పారిపోయారు. మన డబ్బు దేశం దాటి పోయింది.

విజయ్‌మాల్యా, నీరవ్ మోడీ, చోక్సీ...తదితర 36 మంది బడా రుణ ఎగవేతదారులు దేశం దాటి వెళ్లిపోయారని కేంద్రమే స్వయంగా పార్లమెంట్‌కు తెలిపింది. ఈ 36మంది బడా పెట్టుబడిదారులు బ్యాంకులకు ఎగవేసిన సొమ్ము రూ.40 వేలకోట్లు పైమాటే. విజయ్‌మాల్యా రూ.9వేల కోట్లు, నీరవ్‌మోడీ, అతని భార్య ఎమీ మోడీ, సోదరుడు నీశల్ మోడీ, అతడి మామ మేహుల్ చోక్సీ...వీరంతా ఎగవేసింది రూ.13,700కోట్లు. చేతన్ జయంతీలాల్ సందేశరా, నితిన్ జయంతీలాల్ సందేశరా రూ.5వేల కోట్లు, ఆశిష్, ప్రీతీ జోబాన్‌పుత్ర రూ.770కోట్లు, రితేజ్ జైన్ రూ.1500కోట్లు, సభ్యా సేత్ రూ.390కోట్లు, సంజయ్ భండారీ రూ.150కోట్లు బ్యాంకుల్ని ముంచారు.

ఇవన్నీ మోడీ ప్రధానిగా ఉన్న సమయంలోనే జరిగాయి. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వంపై అనేక విమర్శలు, ఆరోపణలు చేసిన మోడీని ప్రజలు నమ్మి అధికారం కట్టబెట్టారు. మరి అలాంటప్పుడు గత యూపీఏలో జరిగినట్టుగానే ఇప్పుడూ అవే ఆర్థిక మోసాలు చోటుచేసుకున్నాయంటే మన 'చౌకీదార్' నిద్రపోయాడా?అన్న ప్రశ్న తలెత్తుతోంది. యూపీఏకు, ఎన్డీయేకు తేడా ఏమీ లేదన్న విషయం రూఢీ అయ్యింది.

- బ్యాంకులకు మొండి బకాయిలు పెరిగాయంటే 'బడా పెట్టుబడుదారుల' రుణ ఎగవేతలే కారణం.
- మోడీ అధికారం చేపట్టేనాటికి దేశంలో మొత్తం ఎన్‌పీఏలు రూ.2.6లక్షల కోట్లు.
- ఈ మొండి బకాయిలు (ఎన్‌పీఏ)రూ.10.4లక్షల కోట్లకు (మార్చి 31, 2018నాటికి) చేరుకున్నాయి.
- 21 ప్రభుత్వ బ్యాంకుల్లో బడా పెట్టుబడిదారులు తీసుకున్న రూ.2.72 లక్షల కోట్ల రుణాల్ని మోడీ సర్కార్ మాఫీ(రైట్ ఆఫ్) చేసింది.
- అభివృద్ధి కార్యక్రమాలు, పేదరిక నిర్మూలన, ఉపాధి పెంపు...వంటివాటికి రూ.2.72కోట్లు ఖర్చుచేసి ఉంటే ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు? కానీ అలా జరగలేదు.
- భారతదేశ చరిత్రలో ఇంతకుముందెన్నడూ ఏ ప్రధాని కూడా రూ.2.72లక్షల కోట్ల కార్పొరేట్ రుణాల్ని మాఫీ చేయలేదు. దీనిని బట్టి ప్రభుత్వ ఖజానాకు 'చౌకీదార్'గా ఉంటానని ప్రధాని ఎలా చెప్పుకుంటారు?
- బడా కార్పొరేట్ల ఆస్తులకు పరిరక్షకుడిగా, వారి వ్యాపార సామ్రాజ్యానికి రక్షకుడిగా ప్రధాని ఉన్నారన్న దాంట్లో అబద్ధం ఏముంది?

'ఆధార్' నిబంధనలు ఉల్లంఘిస్తే కొరడా!

ఉల్లంఘించిన కంపెనీలకు కోటి రూపాయల జరిమానా

న్యూఢిల్లీ: ఆధార్ చట్టం నిబంధనలను ఉల్లంఘించినవారిపై కొరడా ఝుళిపించేందుకు సర్కారు సిద్ధమవుతోంది. నిబంధనలు ఉల్లంఘించిన కంపెనీలపై ఒక కోటి రూపాయల జరిమానా విధించేందుకు కేంద్రం ప్రతిపాదించింది. ఉల్లంఘనలకు పాల్పడిన ప్రతి రోజుకూ రూ. 10 లక్షల వరకు అదనంగా జరిమానా వేసే అంశాన్నీ ఇందులో పేర్కొంది. ఆధార్‌తో గోప్యతకు భంగం కలుగుతుందనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆధార్ చట్టానికి సవరణలు తీసుకువచ్చి ఆధార్ విశిష్ట ప్రాధికార సంస్థ ఉడాయ్(యూఐడీఏఐ)ను పటిష్టం చేసేందుకు సర్కారు సమాయత్తమవుతున్నది. నిబంధనలను ఉల్లంఘించిన కంపెనీలపై చర్యలు తీసుకునే అధికారం ఆధార్ చట్టం కింద ప్రస్తుతం ఉడాయ్‌కు లేదు. ఆధార్ చట్టానికి సవరణలు చేసి ఉడాయ్‌ను ఒక రెగ్యులేటర్ తరహా ఏర్పాటు చేసే అంశాన్నీ అందులో పేర్కొంది. 18 ఏండ్లలోపువారికి 'ఆధార్' లేదని సేవలు నిరాకరించరాదని, బ్యాంకింగ్, మొబైల్ సిమ్‌లాంటి సేవలకు ఆధార్ తప్పనిసరి కాదనే అంశాలూ ఈ సవరణల్లో ఉన్నాయి. ఆధార్ చట్టం 2016ను సవరణ చేసే ఆధార్ బిల్లు 2018ను కేంద్ర మంత్రి రవిశంకర్ బుధవారంనాడు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రయివేటు కంపెనీలు సేవలందించేందుకు ఆధార్ కార్డు నెంబర్‌ను డిమాండ్ చేయరాదని గతేడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. కాగా, ప్రయివేటు కంపెనీలు పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేందుకు అనుగుణంగా సర్కారు ప్రవేశపెట్టే బిల్లు ఉన్నదని, అది సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించే బిల్లు అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

యూపీలో 'గో రక్ష' సెస్

వీధి ఆవుల పేరుతో ఎక్సైజ్ వస్తువులపై 0.5 శాతం విధింపు

- మరింత పెరగనున్న మద్యం, టోల్ ట్యాక్స్
- ప్రభుత్వ తీరును తప్పు పడుతున్న ప్రజాసంఘాలు



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో వీధి ఆవుల సంరక్షణ కోసం 'గోరక్ష' సెస్‌ను ప్రవేశపెడుతూ యోగి ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకున్నది. ఇటీవల వీధి ఆవులను గోవధశాలలకు తరలించి విచ్చలవిడిగా చంపేస్తున్నారనీ, వాటిని ఆపాలంటే ఆవులకు గోశాలలు నిర్మించాలనీ సర్కార్ యోచిస్తోంది. ఆ షెడ్‌ల నిర్మాణం కోసం కావాల్సిన డబ్బును సమకూర్చుకోవడానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దాని కోసం మద్యం, టోల్ ట్యాక్స్ వంటి ఎక్సైజ్ వస్తువులపై అదనంగా 0.5 శాతం అదనంగా పన్ను విధించనున్నట్టు అధికారులు తెలిపారు. సెస్ పరిధిలోకి ఏయే వస్తువులను తీసుకురావాలన్న దానిపై స్పష్టత రాలేదనీ తెలిపారు. ఈ వారం నుంచి కొత్త సెస్‌ను విధించనున్నట్టు వెల్లడించారు. ఈసెస్ వల్ల గో సంరక్షణ కోసం ఏర్పడిన మండీపరిషత్ ఆదాయం ఒక శాతం నుంచి రెండు శాతానికి పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సెస్ నుంచి వచ్చే ఆదాయం ద్వారా వీధి ఆవులకు తాత్కాలిక షెడ్‌లను ఏర్పాటు చేస్తారని తెలిపారు. వీటికోసం ఎమ్మెల్యే, ఎంపీ నిధులను ఉపయోగించుకోనున్నట్టు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. కాగా అధనపు సెస్‌ను విధించడం వల్ల మద్యం, టోల్ ట్యాక్స్ , ఇతర పన్నులు పెరుగుతాయనీ ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. గోశాలల నిర్మాణం కోసం ప్రజల నెత్తిన భారం మోపడం సరికాదని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



మంచు బొమ్మలతో సెల్ఫీల సందడి..

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా చైనాలో మంచుతో తయారు చేసిన ఈ బొమ్మలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హీలాంగ్ జియాంగ్ ప్రావిన్స్‌లో హర్బిన్‌లోని సొంఘువా నదీ పరివాహంలో కొలువుదీరిన ఈ చూడముచ్చటైన బొమ్మలతో పర్యాటకులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు.

అమెరికాతో శాంతియుత సంబంధాలు కొనసాగించేందుకు సిద్ధం : క్యూబా




శాంటియాగో డి క్యూబా: అమెరికాతో గౌరవప్రదమైన శాంతియుత సంబంధాలను కొనసాగించేందుకు క్యూబా ఇప్పటికీ సిద్ధంగా ఉన్నదని ఆ దేశ మాజీ అధ్యక్షుడు రావుల్ కాస్ట్రో పునరుద్ఘాటించారు. క్యూబన్ విప్లవ 60వ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమెరికాతో పరస్పర గౌరవంతో కూడిన శాంతియుత సహజీవనాన్ని తాము కోరుకుంటున్నామన్నారు.

అమెరికాతో ఘర్షణ వాతావరణాన్ని తాము కోరుకోవటం లేదని, అదే అనివార్యమైతే దానిని ఎదుర్కొనేందుకు కూడా క్యూబా సిద్ధంగా వుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ప్రభుత్వం సమతుల్యతతో కూడిన ధోరణితో వ్యవహరించి ఈ పరిస్థితిని నివారిస్తుందని తాము ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. అమెరికా తమ దేశంపై దాదాపు ఆరు దశాబ్దాలుగా వాణిజ్య, ఆర్థిక దిగ్బంధాన్ని కొనసాగిస్తోందని ఆయన గుర్తు చేశారు. దీంతోపాటు క్యూబా విప్లవం సాధించిన విజయాలను కూడా ఆయన ప్రస్తావించారు.

తైవాన్ వ్యవహారాల్లో 'అనుచితజోక్యం'

అమెరికాపై చైనా ఆగ్రహం



బీజింగ్: తైవాన్ వ్యవహారాల్లో అమెరికా అనుచిత జోక్యంపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం అమెరికా అధ్యక్షుడు ఆసియా రీ అస్యూరెన్స్ ఇనీషియేటివ్ యాక్ట్ 2018పై సంతకం చేసిన కొద్దిసేపటికే తీవ్రంగా స్పందించిన చైనా.. అమెరికా చర్యపై విమర్శలు గుప్పించింది. అమెరికా ఈ చట్టం తేవటంపై చైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి లూకాంగ్ మీడియాకు చెప్పారు. ఈ చట్టాన్ని అమలులోకి తేవటం ద్వారా తాము అనుసరిస్తున్న వన్‌చైనా విధానాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఆయన విమర్శించారు. ఈ చట్టాన్ని అమలు చేయవద్దని అమెరికాకు విజ్ఞప్తి చేసిన ఆయన దీనిపై తాము లాంఛనపూర్వక నిరసనలను అమెరికాకు తెలియచేశామని చెప్పారు. ఇదిలా ఉండగా బుధవారం జరిగిన మరో కార్యక్రమంలో చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ మాట్లాడుతూ తైవాన్ సంబంధించిన ప్రశ్న తమ అంతర్గత వ్యవహారమని, దీనిపై బయటి జోక్యాన్ని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. తైవాన్ పునరేకీకరణ విషయంలో అవసరమైతే సైనిక బల ప్రయోగం అవకాశాన్ని తాము వదులుకోబోమని తేల్చిచెప్పారు. తైవాన్ పునరేకీకరణ 40వ వార్షికోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తైవాన్ ఎప్పటికైనా చైనా ప్రధాన భూభాగంతో మమేకం కావల్సిందేనన్నారు. చైనాతో తైవాన్ శాంతియుత పునరేకీకరణలో బయటి వ్యక్తుల జోక్యాన్ని, తైవాన్ వేర్పాటువాద శక్తులను తిప్పికొట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకునే అవకాశాన్ని చైనా ప్రభుత్వం తన వద్దే ఉంచుకున్నదని ఆయన చెప్పారు. చైనాతో తైవాన్ ఏకీకరణ 'ఒక దేశం, రెండు వ్యవస్థల' విధానంలో భాగమేనని, ఇది తైవాన్ దేశభక్తుల యోగక్షేమాలను పరిరక్షిస్తుందని ఆయన అన్నారు.

1949లో చైనా ప్రధాన భూభాగంపై పోరాటానికి తెరపడిన తరువాత ఇరు ప్రాంతాలు వేర్వేరుగా పాలింపబడినప్పటికీ, తైవాన్‌ను తాము ఇప్పటికీ తమ దేశంలో అంతర్భాగంగానే చూస్తున్నామని సీ జిన్‌పింగ్ తన ప్రసంగంలో వివరించారు. సొంత కరెన్సీ, రాజకీయ, న్యాయవ్యవస్థలతో తైవాన్ తనను తాను సార్వభౌమత్వ ప్రాంతంగా పరిగణిస్తున్నప్పటికీ ప్రధాన భూభాగం నుంచి ఎప్పుడూ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోకపోవటం గమనార్హం.

మెక్సికో సరిహద్దుల్లో

వలసవాసులపై అమెరికా టియర్‌గ్యాస్



మెక్సికో: మెక్సికో సరిహద్దుల నుంచి దేశంలోకి వెల్లువెత్తుతున్న వలసవాసులను అడ్డుకునేందుకు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ దళాలు వారిపైకి బాష్పవాయుగోళాలను ప్రయోగించాయి. కొత్త సంవత్సరం ఆరంభమైన కొద్ది గంటల్లోనే దాదాపు 150 మంది వలసవాసులు మెక్సికో సరిహద్దుల్లోని టిజువానా వద్ద ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించి అమెరికాలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారని, వారిని అడ్డుకునేందుకు తాము బాష్పవాయు గోళాలను ప్రయోగించామని కస్టమ్స్ బోర్డర్ ప్రొటెక్షన్ ఫోర్స్ మంగళవారం ఒక ప్రకటనలో వివరించింది.

అయితే ఈ బాష్పవాయు గోళాల ప్రభావం సరిహద్దు ఫెన్సింగ్ వద్ద ఉన్న వలసవాసులు, చిన్నారులపై ఏ మాత్రం ప్రభావం లేదని, భద్రతా దళాలు తమపై రాళ్లు రువ్వుతున్న వారిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని ఈ బాష్పవాయు గోళాలను ప్రయోగించాయని ఆ ప్రకటనలో వివరించారు. టిజువానా పట్టణం వద్ద మెక్సికో వైపు ప్రయోగించిన బాష్పవాయుగోళాలతో పలువురు మహిళలు చిన్నారులతో సహా అనేక మంది వలస వాసులు, జర్నలిస్టులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని మీడియా ప్రతినిధులు తమ వార్తా కథనాలలో వెల్లడించారు.

అమెరికా ఏజెంట్లు బాష్పవాయువు ప్రయోగించిన తరువాతే వలసవాసులు వారిపైకి రాళ్లు రువ్వారని మరో మీడియా సంస్థ ప్రతినిధి వెల్లడించారు. దీనికి స్పందించిన భద్రతా సిబ్బంది పొగబాంబులు, పెప్పర్ స్ప్రే, టీయర్‌గ్యాస్ ప్రయోగాలకు పాల్పడ్డారని ఆయన వివరించారు. ఈ సమయంలో అమెరికా ఏజెంట్లు 25 మంది వలసవాసులను అరెస్ట్ చేయటంతో మిగిలిన వారు వెనక్కి తగ్గారని ఆయన తెలిపారు.

పెంటగాన్ ప్రతినిధి రాజీనామా

వాషింగ్టన్: అమెరికా రక్షణశాఖ పెంటగాన్ ఉన్నత స్థాయి అధికార ప్రతినిధి డానా డబ్ల్యు వైట్ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. రక్షణ మంత్రి జిమ్ మాటిస్ తన పదవికి రాజీనామా చేసిన కొద్ది గంటల్లోనే వైట్ కూడా తన రాజీనామాను ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. జిమ్ మాటిస్‌తో కలిసి దేశానికి సేవలందించే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి తాను కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, తనకు సహకరించిన సహచరులందరికీ కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని ఆమె తన ట్వీట్‌లో పేర్కొన్నారు. వీరిరువురు రాజీనామా చేశారని రక్షణ మంత్రిత్వశాఖ ప్రతినిధి మంగళవారం ధృవీకరించారు. ఆమె స్థానంలో ఛార్లెస్ ఇ సమ్మర్స్ (జూ) పెంటగాన్ ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించారని ఆయన వివరించారు. బోయింగ్ విమాన తయారీ సంస్థ మాజీ ఉపాధ్యక్షుడు పాట్రిక్ షనాహన్ మాటిస్ స్థానంలో అమెరికా కొత్త రక్షణ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.



ఉగ్రదాడిగా భావిస్తున్నాం!

- మాంచెస్టర్ స్టేషన్‌లో ముగ్గురిపై కత్తితో దాడి
- నిందితుడ్ని అరెస్టు చేసిన పోలీసులు



లండన్ : మాంచెస్టర్‌లోని విక్టోరియా రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం ముగ్గురిపై జరిగిన దాడిని ఉగ్రదాడిగా భావిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆ ముగ్గురిని కత్తితో గాయపరిచిన వ్యక్తిని అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నట్టు చెప్పారు. ఈ దాడిలో ఒక వ్యక్తికి, ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయని, వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని గ్రేటర్ మాంచెస్టర్ పోలీసు అధికారి ఇయాన్ హాప్‌కిన్స్ తెలిపారు.

ఆ ఇద్దరికి పొట్టలో గాయాలయ్యాయని, మహిళకు ముఖంపైన కూడా గాయాలయ్యాయని ఆయన చెప్పారు. మరో పోలీసు సార్జెంట్‌కు భుజాలపై గాయమైందని, అతనికి ప్రాథమిక చికిత్స జరిపి పంపినట్టు ఆయన తెలిపారు.

మాంచెస్టర్ ఏరెనాకు పక్కనే ఉన్న విక్టోరియా స్టేషన్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. విక్టోరియా స్టేషన్ వద్ద ముగ్గురిపై దాడి జరిపిన నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు దాడి జరుపుతున్న సమయంలో ఇస్లాంకు సంబంధించిన నినాదాలు చేశాడని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. ఏరెనా గ్రాండ్‌లో 2017లో ఒక సంగీత కచేరి జరుగుతుండగా ఆత్మాహుతి బాంబరు జరిపిన దాడిలో 22 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే.

‘బీసీలకు టీఆర్ఎస్ ద్రోహం’

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని పలువురు వక్తలు విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏకపక్షంగా, నిరంకుశంగా తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లను కొనసాగించాల్సిందేనని కోరారు. 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు పార్లమెంటులో చట్టం చేయాలనీ, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలనీ సూచించారు. జనవరి 1న రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించిందనీ, అదేరోజు పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గమనీ విమర్శించారు. బీసీలకు పంచాయతీ ఎన్నికల్లో 34 శాతం కొనసాగించాలనీ, ఎబీసీడీఈ వర్గీకరణ చేయాలనీ కోరుతూ బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ, ఎంబీసీ సంఘం, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ, బీసీ సంక్షేమ సంఘం, సంచార విముక్త జాతుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిరాహారదీక్ష జరిగింది. నిరాహారదీక్షకు కూర్చున్న పలు సంఘాల నాయకులకు బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ చైర్మెన్ ప్రొఫెసర్ మురళీ మనోహర్ పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తించినపుడు స్థానిక సంస్థల్లో ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కానీ సుప్రీం కోర్టు తీర్పు పేరుతో టీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించడం సరైంది కాదన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారమేతే గతేడాది ఆగస్టులోనే ఎన్నికలు జరగాలనీ, గడువు పొడిగించాలని ప్రభుత్వం న్యాయస్థానాన్ని విజ్ఞప్తి చేసిందని చెప్పారు. ఇప్పుడూ గడువు కోరేందుకు అవకాశమున్నా ఎన్నికలకు వెళ్లడం, బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తూ ఆర్డినెన్స్ తేవడం చట్టవిరుద్ధమని అన్నారు. బీసీలంతా ఏకమై టీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని కోరారు. సామాజికవేత్త ఉ సాంబశివరావు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు 11 శాతం తగ్గిస్తూ ఆర్డినెన్స్ తేవడం నిరంకుశమని విమర్శించారు. కోర్టు చెప్పినా జనాభా లెక్కలు ఎందుకు తీయలేదనీ, బీసీ ఎబీసీడీఈ వర్గీకరణ ఎందుకు చేయలేదనీ ప్రశ్నించారు. కోర్టు ధిక్కరణ కిందికి వస్తుందన్నారు. జనాభా లెక్కల ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనరల్ స్థానాల్లోనూ బీసీలకు సీట్లు కేటాయిస్తామని కేసీఆర్ చెప్పడం అవమానించడమేనని అన్నారు. బీసీల వాటా ఇవ్వకుండా ఉదారంగా ఇస్తున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీల రిజర్వేషన్లు తగ్గించడం టీఆర్ఎస్ పతనానికి నాంది అని అన్నారు. ప్రొఫెసర్ సుదర్శన్‌రావు మాట్లాడుతూ బీసీల జనాభా, ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థితిగతుల కోసం సమగ్ర సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని కోరారు. కానీ సుప్రీం తీర్పును సాకుగా చూపి బీసీల రిజర్వేషన్లు తగ్గించడం భ్రూణహత్యలాంటిదేనని అన్నారు. బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లె గోపాల్ మాట్లాడుతూ ఆ నిర్ణయంతో బీసీలు 1400కుపైగా సర్పంచ్‌లు, 23 వేలకుపైగా వార్డుమెంబర్లు కోల్పోయారని చెప్పారు. గతంలో కొనసాగిన 61.17 శాతం బీసీ రిజర్వేషన్లు ఎందుకు కోల్పోవాల్సి వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. బీసీల గణంకాలను కోర్టు ముందు ఎందుకు ఉంచలేదని అడిగారు. ఎంబీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ల తగ్గింపును నిరసిస్తూ అనేక ఆందోళనలు జరుగుతుంటే ఏకపక్షంగా సెలవు రోజున పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. 1994 నుంచి బీసీలకు 34 శాతం అమలవుతున్నాయనీ, కొందరు కోర్టును ఆశ్రయించారనే పేరుతో 23 శాతానికి తగ్గించడం సమంజసం కాదన్నారు. ఆర్డినెన్స్‌ను వెనక్కి తీసుకోవాలనీ, అఖిలపక్షం పిలవాలనీ, బీసీ సంఘాలు, కుల సంఘాలతో సమావేశం జరపాలనీ డిమాండ్ చేశారు. పార్లమెంటులో చట్టం చేసి బీసీల రిజర్వేషన్లు 34 శాతం కొనసాగించాలని కోరారు. టీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు ఒత్తిడి పెంచాలని చెప్పారు. ఎంబీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు ఎఎల్ మల్లయ్య, ఎంవి రమణ, ఎం నరేందర్‌గౌడ్, లెల్లెల బాలకృష్ణ, జి నాగరాజు, ఉడుత రవీందర్, మన్నారం నాగరాజు, మల్లి సుబ్బారావు, ఆర్ శ్రీరాంనాయక్ (టీమాస్), స్కైలాబ్‌బాబు (కేవీపీఎస్) తదితరులు పాల్గొన్నారు.



నిరాహార దీక్షలో నాయకులు

సింగరేణి నూతన ఈడీగా ఆల్విన్





హైద రాబాద్: సింగరేణి కాలరీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ కోల్ మూమెంట్)గా జే. ఆల్విన్ సింగరేణి భవన్‌లో అధికార బాధ్య తలను బుధవారం స్వీకరించారు. ఆయన ఎంబిబిఎస్ పూర్తిచేసి 2006లో రైల్వే ఉద్యోగంలో చేరారు. కాగా ఆయన గతంలో రైల్వేలో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆల్విన్‌కు సింగరేణి చైర్మన్ ఎండీ ఎన్. శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆల్విన్‌కు జనరల్ మేనేజర్ మార్కెటింగ్ కో ఆర్డినేటర్ ఆంథోని రాజా, జిఎం ఫైనాన్స్, అకౌంట్స్ వి.నర్సింహమూర్తి, కోల్ మూమెంట్ సేల్స్ విభాగం అధికారి ఎన్.వి.కె, శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

4న ప్రవేశ పరీక్షల తేదీలు ఖరారు : పాపిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షల తేదీలను ఈనెల 4న ఖరారు చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి చెప్పారు. ఎంసెట్ నిర్వహణ బాధ్యతను ఏ విశ్వవిద్యాలయానికి అప్పగించాలనేది అదేరోజు నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏ ప్రవేశ పరీక్ష ఏ విశ్వవిద్యాలయానికి కేటాయించామో నిర్ణయం తీసుకున్నాక కన్వీనర్లను నియమిస్తామని అన్నారు.

గ్రీన్ ఫీల్డ్ సర్వేపై రైతుల ఆగ్రహం

భూములు లాక్కుంటే ఊరుకోం..:

కలెక్టరేట్‌లో రైతుల బైటాయింపు

- **సర్వేను తక్షణం విరమించాలని డిమాండ్**

నవతెలంగాణ - ఖమ్మంటౌన్

గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరిట తమ అనుమతి లేకుండా భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట పొలాల్లో సర్వేను తక్షణం నిలిపేయాలని డిమాండ్ చేశారు. బుధవారం రైతులు తొలుత ఖమ్మం ధర్నాచౌక్‌లో ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోకి వెళ్లి ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్రధాన ద్వారం వద్ద బైటాయించి నినాదాలు చేశారు. రైతులకు జాయింట్ కలెక్టర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ డిమాండ్ చేశారు. అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఆమరణ దీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు.

ఇటీవల ఖమ్మం, కల్లూరు డివిజన్ల వారీగా నిర్వహించిన సమావేశాల్లో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేకు తమ భూములను ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. అయినా అధికార యంత్రాంగం సర్వే ప్రయత్నాలను విరమించుకోకపోయే సరికి రైతులు ఉద్యమ బాట పట్టారు. పది మండలాల గ్రీన్ ఫీల్డ్ నిర్వాసిత రైతులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఉన్న ధర్నాచౌక్‌లో ఆందోళనకు దిగారు. ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ నేషనల్ కో ఆర్డినేటర్ ఐతం కోదండ రామారావు నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో పోరాడి భూములు దక్కించుకుందామని నినదించారు. ఇటీవల ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఎంతో క్లిష్టతరమైన గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే సమస్య ఎందుకు పట్టడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడించడం ద్వారా వారు ఈ సమస్యను గుర్తించి అసెంబ్లీలో ప్రస్తావించేలా చేయాలని నిర్ణయించారు. “చావులు వద్దు.. పోరాడి సాధించుకుందాం” అంటూ నినాదాలు చేశారు. జాయింట్ కలెక్టర్ స్పష్టత ఇచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదని భీష్మించారు. దీంతో కలెక్టరేట్‌లో ఉన్న జేసీ ఆయేషా రైతుల వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం సర్వే మాత్రమే చేస్తున్నామనీ, అంతమాత్రాన భూములను తీసేసుకుంటున్నట్టు కాదనీ వివరించారు. ప్రభుత్వ ఆదేశానుసారం సర్వే చేయక తప్పదన్నారు. అయితే సర్వేను కూడా విరమించుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం రైతులు కలెక్టరేట్ ఎదుట రహదారిపై బైటాయించారు.



10 వేల టన్నుల ధాన్యం పండుతుంది
నున్నా నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రహదారిని జిల్లాలోని పది మండలాలను కలుపుతూ నిర్మించదలచారనీ, ప్రభుత్వం సేకరించదలచిన రైతుల భూమిలో ప్రతి ఏటా 10 వేల టన్నుల ధాన్యం పండుతుందనీ సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. రైతుల ఆందోళనకు మద్దతు తెలిపిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇలాంటి బంగారు భూమిని రోడ్డు పేరుతో గుంజేసుకుంటే సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోయి జిల్లాలో ఆహార ధాన్యాల కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే రైతులు ఆహార ధాన్యాల సాగు లాభసాటిగా లేక సుబాబుల్, జామాయిల్ వంటి వాణిజ్యం పంటలవైపు మొగ్గు చూపాల్సిన దుస్థితిని ఏర్పడిందన్నారు. ఇలాంటి సమయంలో రైతులకు ఇష్టం లేకుండా భూములను లాగేసుకుంటే రైతులు రోడ్డున పడతారన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డునే ఇరువైపులా 50 అడుగుల చొప్పున విస్తరిస్తే ఖర్చు తగ్గడంతో పాటు రైతుల భూములను తీసుకోవాల్సిన అవసరం రాదని సూచించారు. వందలాది మంది రైతులు భూములు పోతున్నాయని ఆందోళన చెందుతుంటే.. ఈ ప్రాంతాలకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం దారుణమని అన్నారు. వీరు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

ఒకే చట్టం సాధ్యం కాదు

మూడు కేటగిరీలుగా విశ్వ విద్యాలయాలు!

- వ్యవసాయ, సాంకేతిక, కన్వెన్షనల్ వర్సిటీలుగా విభజన
- మూడు యాక్ట్‌ల రూపకల్పనకు అవకాశం
- సర్కారు సమాలోచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను ఒకే గొడుగు కిందికి తేవాలనీ ప్రభుత్వం భావించింది. కానీ అన్ని విశ్వవిద్యాలయాలకూ ఒకే చట్టం సాధ్యం కాదని నిపుణులు స్పష్టం చేశారు. దీంతో రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాలను మూడు కేటగిరీలుగా విభజన చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నత విద్యామండలి సిఫారసు చేసింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం, సాంకేతిక విశ్వవిద్యాలయాలు, కన్వెన్షనల్ విశ్వవి ద్యాలయాలు ఇలా మూడు కేటగిరీలుగా విభజన చేయాలని సూచించింది. దాని ప్రకారం రాష్ట్రంలో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయం విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర హార్టికల్చర్ విశ్వవిద్యాలయం, పివి నర్సింహారావు తెలంగాణ రాష్ట్ర వెటర్నరీ విశ్వవిద్యా లయం, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యా లయం ఒక కేటగిరీ, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్), జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం (జేఎన్ఏఎఫ్ఏయూ), రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) రెండో కేటగిరీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ), కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ), శాతవాహన విశ్వవిద్యాలయం (ఎస్‌యూ), తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ), పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ), మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (పీఎస్‌టీయూ), డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ) మూడో కేటగిరీగా విభజించాలని ఉన్నత విద్యామండలి సిఫారసు చేసింది. ఈ కేటగిరీల వారీగా మూడు చట్టాలను రూపొందించుకునే అవకాశముందని సూచించింది. ఉన్నత విద్యామండలి సిఫారసుపై రాష్ట్ర ప్రభుత్వం సమాలోచన చేస్తున్నది. ప్రస్తుతం ఒక్కో విశ్వవిద్యాలయానికి ఒక్కో చట్టం ఉన్నది. అంటే 15 విశ్వవిద్యాలయాలకు 15 చట్టాలున్నాయి. ఉన్నత విద్యామండలి సిఫారసుల ప్రకారం 15 చట్టాల స్థానంలో మూడు చట్టాలే రూపొందించే అవకాశముంది. విశ్వవిద్యాలయాల చట్టాల్లో ఆధునిక కాలానికి అనుగుణంగా సవరణలు చేసేందుకు ప్రభుత్వం సమాలోచన చేస్తున్నది.

ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం : పాపిరెడ్డి

విశ్వవిద్యాలయాల చట్టాల సవరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక సమర్పించామని ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి తనను కలిసిన విలేకరులతో చెప్పారు. మూడు కేటగిరీలుగా విశ్వవిద్యాలయాలను విభజించాలని సూచించామని అన్నారు. ప్రభుత్వ నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

మూడు కేటగిరీలుగా విశ్వవిద్యాలయాలు

మొదటి కేటగిరీ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర హార్టికల్చర్ విశ్వవిద్యాలయం, పివి నర్సింహారావు తెలంగాణ రాష్ట్ర వెటర్నరీ విశ్వవిద్యాలయం, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం

రెండో కేటగిరీ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్టీ యూహెచ్), జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం (జేఎన్ఏఎఫ్ఏయూ), రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ)

మూడో కేటగిరీ : ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ), కాకతీయ విశ్వవిద్యా లయం (కేయూ), శాతవాహన విశ్వవిద్యాలయం (ఎస్‌యూ), తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ), పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ), మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం , పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (పీఎస్‌టీయూ), డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.

మాస్టార్జీ ఫౌండేషన్ కీర్తిరత్న పురస్కారాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాంస్కృతిక రంగాలలో విస్తృత సేవలందించిన వారికి మాస్టార్జీ ఫౌండేషన్ “కీర్తిరత్న” పురస్కారాలను ప్రదానం చేయనుంది. ఈ పురస్కారాలను ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6గంటలకు హైదరాబాద్, బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అందజేయనున్నట్టు ఫౌండేషన్ కార్యదర్శి జి నలంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులకు 50 ఏండ్ల పైబడిన వారు మాత్రమే అర్హులని తెలిపారు.

చలి తీవ్రతకు వృద్ధుడు మృతి

నవతెలంగాణ- సారంగాపూర్

చలికి తట్టుకోలేక నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని గోపాల్‌పేట్‌కు చెందిన కొప్పుల పోతన్న(72) బుధవారం మృతిచెందాడు. మృతుడికి కుమారుడు ఉన్నారు. టీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ మంతెన గంగారెడ్డి, సల్ల సాయన్న గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సంపాదకీయం

బీసీల హక్కులకు భంగం

బీసీల రిజర్వేషన్లపై ముందు హడావుడి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆనక మిన్నకుండిపోయారు. తొలుత 'రిజర్వేషన్లను 68శాతానికి పెంచుతాం.. తమిళనాడులో అమల్జేస్త లేరా? సుప్రీంకోర్టు తీర్పు ఏమన్న జాగీరా? పార్లమెంటులో చట్టం చేసేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తం..' అని కాస్త గంబీరంగా, కఠినంగానే మాట్లాడారు.

34శాతం రిజర్వేషన్లు కొనసాగిస్తూనే, ఏ, బీ, సీ, డీ, ఈ వర్గీకరణ చేయాలనే డిమాండ్‌ ప్రజా సంఘాల నుంచి వస్తున్నది. ఈ మేరకు అత్యంత వెనుకబడిన కులాల సంఘం(ఎంబీసీ) హైకోర్టులో రిట్‌పిటీషన్‌ దాఖలు చేసింది. ఇతర సంఘాలు సైతం వేసాయి. అయినా కాంగ్రెసు, బీజేపీ, టీఆర్‌ఎస్‌లు వీరి న్యాయమైన డిమాండును పట్టించుకోకుండా పరస్పరం ఆరోపణలతో కాలం గడపటం బాధ్యత అనిపించుకోదు.

తీరా అసెంబ్లీ ఎన్నికలయ్యాక స్వరం మార్చారు. బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తూ తెచ్చిన ఆర్డినెన్స్‌ను సమర్థించుకున్నారు. "ఒకవైపు 50శాతానికి మించి రిజర్వేషన్లు ఉండరాదంటూ సుప్రీంకోర్టు తీర్పు ఉందని, అలాగే మరోవైపు జనవరి 10లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ హైకోర్టు ఆదేశించిందని" ఈనెల 29న ప్రగతిభవన్‌లో నిర్వహించిన ప్రెస్‌ కాన్ఫరెన్స్‌లో వ్యాఖ్యానించారు. మరోమాట కూడా సెలవిచ్చారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌, బీజేపీవి కట్టుకథలని గట్టిగానే విమర్శించారు. ఇంకో అడుగు ముందుకేసి ఏకంగా దేశ ప్రధానిపైకే బాణం గురిపెట్టారు. బీసీ తరగతికి చెందిన దేశ ప్రధాని సన్నాసీ ఉన్నడు, ఏం చేసిండు.. బీసీ మంత్రిత్వశాఖ పెట్టాలనీ ఎప్పటి నుంచో చెప్పుకుంట వస్తున్న.. అదీ కూడా ఏర్పాటుచేయలే.. ఇంక రిజర్వేషన్లు ఏం చేస్తడు అని సీఎం తిట్ల పురాణం అందుకున్నడు. బీసీ రిజర్వేషన్ల విషయంలో అధికార పార్టీతోపాటు కాంగ్రెస్‌, బీజేపీ సైతం కప్పదాటు వైఖరిని అవలంభిస్తున్నాయి. గతం నుంచే 34శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. టీఆర్‌ఎస్‌ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఆర్డినెన్స్‌ తెవడంతో 34శాతం నుంచి 22.81శాతానికి తగ్గిపోయింది. ఇప్పటిదాకా విద్యా, ఉద్యోగ రంగాల్లో అమలవుతున్న 25శాతం కంటే కూడా తక్కువ కావడం గమనార్హం. వెనుకబడిన తరగతుల నుంచి రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్‌ వస్తుండగా, సుప్రీంకోర్టు తీర్పు ఆటంకమనే చర్చ కూడా ఉంది. ఆటంకముంటే రాజ్యాంగ సవరణతో తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టవచ్చు. తమిళనాడులో అలాగే రిజర్వేషన్లు పొందుతున్నారు. మరికొన్ని రాష్ట్రాల్లో 50శాతం కంటే ఎక్కువే రిజర్వేషన్లు ఉన్నాయి. రిజర్వేషన్లు పెంచడం, తొమ్మిదో షెడ్యూల్లో చేర్చడం విస్తృతంగా చర్చించాల్సిన అంశమే. కాగా పెంపుదల సంగతి పక్కనబెడితే, అసలు ఉన్న రిజర్వేషన్లకు ఎసరొచ్చింది. ఎన్నికల ముందు కేసీఆర్‌ చేసిన బాసలు అందరికి ఎరుకే. పార్లమెంటు చేసే చట్టాలే గొప్పవి, సుప్రీంకోర్టు తీర్పు ఏమైనా పార్లమెంటుకు అతీతమా అనే వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజల చెవుల్లో ఇంకా మార్మోమోగుతూనే ఉండగా... రెండోసారి ప్రమాణస్వీకారం చేసిన మరుక్షణమే రిజర్వేషన్లు తగ్గిస్తూ ఆర్డినెన్స్‌ తేవడం అన్యాయమే. సుప్రీంకోర్టులో బీసీ హక్కులను కాపాడటానికి కనీస ప్రయత్నం చేయకుండానే, కేసు ఉపసంహరించుకుని బీసీల భవిష్యత్తును ఫణంగా పెట్టారు. ఇప్పుడు అంతా అయిపోయాక ఒకవైపు కాంగ్రెస్‌, మరోవైపు బీజేపీ మొసలి కన్నీరు కారుస్తున్నాయి. నిజానికి బీజేపీ, కాంగ్రెస్‌, టీఆర్‌ఎస్‌ తలుచుకుంటే బీసీల ప్రయోజనాలకు, హక్కులకు భంగం కలగకుండా కాపాడగలవు.



తాజాగా జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో సవరణ బిల్లు ప్రతిపాదించి, సమస్యను పరిష్కరించే అవకాశం ఉంది. అప్పుడు సుప్రీంకోర్టు తీర్పు కూడా ఆటంకం కాకుండా ఉండేది. ఆ ప్రయత్నమేది ఆయా పార్టీల నుంచి జరగడం లేదు. కాగా వట్టిమాటలు చెబుతున్నాయి. గత నాలుగున్నరేండ్లుగా కేసీఆర్‌, దేశ ప్రధాని మోడీ అత్యంత సాన్నిహిత్యం నెరపుతున్నారు. ఆ సాన్నిహిత్యం ఉపయోగించి చట్టసవరణ చేయవచ్చు. ఆ పని చేయలేదు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పీటిషన్‌ కూడా వేయలేదు. దానికితోడు జనవరి 10లోపు ఎన్నికలు నిర్వహించాలనే హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లలేదు. బీసీల హక్కులను నిర్లక్ష్యంచేస్తూ రిజర్వేషన్లను తమ స్వార్థరాజకీయ ప్రయోజనాలకోసం వాడుకునే ప్రయత్నంలో రాష్ట్రంలో అధికార టీఆర్‌ఎస్‌ ఉండగా, కేంద్రంలో అధికార, ప్రతిపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్‌ల ఆలోచనలు సైతం అందుకు భిన్నంగా ఏమీ లేవు. బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి నోటిఫికేషన్‌ విడుదల చేసింది. ఈనెల 21, 25, 30 తేదీల్లో మూడు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. వీటిని తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని టీఆర్‌ఎస్‌ అంతర్గత ఆలోచనగా కనిపిస్తున్నది. ఇప్పుడు తమకు అనుకూల వాతావరణ ఉందని టీఆర్‌ఎస్‌ భావిస్తున్నది. ఎన్నికలు వెంటనే నిర్వహించేలా చూస్తే, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పంచాయతీలోనూ ప్రతిఫలిస్తాయని ఆ పార్టీ అభిప్రాయం. పార్లమెంటు ఎన్నికలు దాటాక స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తే, టీఆర్‌ఎస్‌ పట్టు సడలుతుందనే భయం ఆ పార్టీని వేధిస్తున్నది. ఈనేపథ్యంలో బీసీల హక్కులను ప్రశ్నార్థకం చేసింది. 34శాతం రిజర్వేషన్లు కొనసాగిస్తూనే, ఏ, బీ, సీ, డీ, ఈ వర్గీకరణ చేయాలనే డిమాండ్‌ ప్రజా సంఘాల నుంచి వస్తున్నది. ఈ మేరకు అత్యంత వెనుకబడిన కులాల సంఘం(ఎంబీసీ) హైకోర్టులో రిట్‌పిటీషన్‌ దాఖలు చేసింది. ఇతర సంఘాలు సైతం వేసాయి. అయినా కాంగ్రెసు, బీజేపీ, టీఆర్‌ఎస్‌లు వీరి న్యాయమైన డిమాండును పట్టించుకోకుండా పరస్పరం ఆరోపణలతో కాలం గడపటం బాధ్యత అనిపించుకోదు.

మోడీ కావాలని దాచినవి.. తెలిసీ ఏఎన్‌ఐ అడగనివి..



ఎం. కోటేశ్వరరావు

మిన్ను విరిగి మీద పడితే తప్ప మీడియా గోష్టిలో ముఖాముఖీ మాట్లాడని భారత తొలి ప్రధానిగా నరేంద్రమోడీ సరికొత్త రికార్డు సృష్టించటం ఖాయమని తెలిపోయింది. బహుశా ఈ జాబితాలో ప్రపంచంలో ఆయనే తొలి ప్రజాప్రతినిధి కూడా అయి ఉండవచ్చు. పదేండ్ల కాలంలో మూడంటే మూడు సార్లు మాత్రమే మీడియాతో మాట్లాడిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను మౌనముని అని ఎద్దేవా చేసిన వారిలో మోడీ కూడా ఉన్నారు. సోనియాగాంధీ అనుమతి ఇవ్వని కారణంగా మన్మోహన్‌ అలా చేసి ఉండవచ్చు. కానీ.. నాకు 56 అంగుళాల ఛాతీ ఉంది, రిమోట్‌ కంట్రోలు లేదు అని చెప్పుకొనే మోడీ ఒక్కసారి కూడా మీడియాతో మాట్లాడలేదు. అయితే ఏ ప్రధానీ ఇవ్వనన్ని ఫోజులు మీడియా కెమెరాలకు ఇచ్చారు! అలాంటి పెద్ద మనిషి మోడీ జనవరి ఒకటవ తేదీన, హిందూత్వశక్తులు, అసలు సిసలు భారతీయతకు ప్రతీకలం.. అని చెప్పుకొనే వారు మొహాలు ఎక్కడో పెట్టుకొని సిగ్గుపడే విధంగా ఏఎన్‌ఐ అనే వార్తా సంస్థకు ఆంగ్ల సంవత్సరాది రోజు 95నిమిషాల ఇంటర్వ్యూ ఇచ్చారు. అది యాదృచ్ఛికం తప్ప ఆంగ్ల సంవత్సరాదికి మోడీ ఇంటర్వ్యూకు సంబంధం లేదని చెప్పే బాపతు కూడా మనకు తగలవచ్చు.

మోడీ చెప్పనిది, ఇంటర్వ్యూ చేసిన వారు అడగనిది ఏమిటి? 126 విమానాల కోసం గతంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి అధిక ధరలకు 36విమానాలు ఎందుకు కొన్నారు? ఎంతో అనుభవం ఉన్న హాల్‌ను విస్మరించి ఎలాంటి అనుభవం లేని అనిల్‌ అంబానికి కాంట్రాక్టు ఎందుకిచ్చారు? అంబానీ కంపెనీ దివాలా తీసిందా లేదా? విమానాల ధరల వివరాలను పబ్లిక్‌ ఎకౌంట్స్‌ కమిటీకి కాగ్‌ ఇచ్చినట్టు సుప్రీం కోర్టుకు ప్రభుత్వం తెలిపింది. కానీ అలాంటిదేమీ లేదని కమిటీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చెప్పగా, అసలు తమ నివేదికే పూర్తి కాలేదని కాగ్‌ చెపుతోంది కదా..

బ్రిటన్‌లో చాలా కాలం కిందట రాజు గారి తరువాత రాణీగారి ప్రతిపక్షంగా వ్యవహరించే పార్టీలు ఉండేవి. అంటే రాజు, రాణీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అణగిమణిగి ప్రశ్నించే పక్షాలవి. అలాగే మోడీ మన దేశంలో అలాంటి మీడియాను రంగంలోకి తెచ్చిన ఆద్యుడిగా చెప్పుకోవాలి. ఒక యాంకర్‌గా చర్చలో పాల్గొనేవారి మీదకు ఎక్కే ఆర్నాబ్‌ గోస్వామి నక్క వినయాలతో నరేంద్రమోడీని ఇంటర్వ్యూ చేసిన విషయం తెలిసిందే. అంటే ముందుగానే ఏ ప్రశ్నలు అడగాలో ఏమి జవాబులు చెబుతారో, వాటి మీద ఉప ప్రశ్నలు వేయకుండా ఎలా నోరు మూసుకోవాలో అన్నీ ముందే నిర్ణయం అవుతాయి. ఒక వేళ నోరు జారితే ఆ భాగాన్ని తొలగిస్తారనుకోండి అది వేరే విషయం. జనవరి ఒకటిన ఏఎన్‌ఐ ఇంటర్వ్యూ కూడా అలాంటి ముందస్తు ఏర్పాటుతో జరిగిందే అని వేరే చెప్పనవసరం లేదు. ఆ షరతుకు ఒప్పుకుంటేనే తన గదిలో మోడీ నోరు విప్పుతారు.

కొంతమంది ఓటమి లేదా తప్పిదాలను ఒక పట్టాన ఒప్పుకోరు. అందునా అవకాశవాద రాజకీయ నాయకులు కిందపడ్డా మాదే విజయం అంటారు. రెండేండ్ల క్రితం మోడీ చేసిన పెద్ద నోట్లరద్దు గురించి తాజా ఇంటర్వ్యూలో చెప్పిందేమిటి? ఇదేమీ ఝట్కా (ఆకస్మిక నిర్ణయం) కాదు. ఏడాది క్రితమే మీ దగ్గర నల్లధనం ఏదైనా ఉంటే డిపాజిట్‌ చేయండి, అపరాధ రుసుం చెల్లించండి, మీకు సాయం దొరుకుతుంది అని హెచ్చరించా. అయినప్పటికీ ఇతరుల మాదిరే మోడీ కూడా వ్యవహరిస్తారులెమ్మని కొంతమందే స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. నోట్ల రద్దుకు ముందు సమాంతర ఆర్థిక వ్యవస్థ ఉంది. అది అంతర్గతంగా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసింది. సంచుల్లో దాచిన కరెన్సీ బ్యాంకింగ్‌ వ్యవస్థలోకి తిరిగి వచ్చింది.' అన్నారు మోడీ.

మోడీ మహాశయుడు నోట్ల రద్దు గురించి చెప్పిందాంట్లో కొత్తదేమీ లేదు. సాధించింది ఏమిటో చెప్పాలి కదా! ఎంత నల్లధనం బయటపడింది, దానిని ఎలా ఉపయోగించారు, దానివలన ఆర్థిక వ్యవస్థకు జరిగిన మేలేమిటి? బ్యాంకింగ్‌ వ్యవస్థకు పెద్ద మొత్తంలో కరెన్సీ వస్తే ఇప్పుడు బ్యాంకులకు ప్రభుత్వం మూలధనం సమకూర్చేందుకు రిజర్వుబ్యాంకుల వద్ద వున్న మిగులును ఇమ్మని ఎందుకు అడుగుతున్నట్టు? వీటి గురించి ఎంత తరచినా కేంద్ర ప్రభుత్వం లేదా రిజర్వుబ్యాంకు అధికారికంగా ఒక్క ప్రకటనా చేయలేదు. ఒక సాధారణ అంశం మాదిరి, 2018 ఆగస్టులో తన వార్షిక నివేదికలో తప్పదు కాబట్టి వివరాలను పొందుపరచింది. దాని ప్రకారం రద్దయిన నోట్లలో 99.3శాతం తిరిగి బ్యాంకులకు వచ్చాయి. ఆ మిగిలిన 0.7శాతం కూడా చిరిగిపోయి, ధ్వంసమై చెలామణిలో లేని లేదా అమాయకంగా మార్చుకోకుండా తమవద్దే ఉంచుకున్న అమాయక సామాన్యుల వద్ద ఉండిపోయింది తప్ప అది నల్లధనం కాదు. రద్దు వలన వచ్చిన లాభం కంటే జరిగిన నష్టమే ఎక్కువని అందరికీ తెలిసినా అంగీకరించటానికి 56 అంగుళాల ఛాతీకి ధైర్యం చాల్లేదు.

రిజర్వుబ్యాంకు గవర్నర్‌ ఉర్జిత్‌ పటేల్‌ రాజీనామా గురించి మోడీ పెద్ద జోక్‌ పేల్చారు. మొదటిసారిగా బయట పెడుతున్నానంటూ రాజీనామాకు ఆరేడు నెలల ముందే తాను తప్పుకుంటానని చెప్పారని, వ్యక్తిగతంగా తనకు రాతపూర్వకంగా తెలియచేశారని నరేంద్రమోడీ చెప్పారు. రాజీనామా సమయంలోనే ఈ విషయం ఎందుకు చెప్పలేదు, అదేమైనా రహస్యమా, దేశ భద్రతకు సంబంధించిన అంశమా? రిజర్వుబ్యాంకు వద్ద ఉన్న నిధులను కేంద్ర ప్రభుత్వానికి బదలాయించమని పటేల్‌ను వత్తిడి చేసిన అంశం బహిరంగ రహస్యం. మిగులు నిధులు, ఇతర కొన్ని అంశాలలో తాము చెప్పినట్టు చేయకపోతే కుదరదని తెగేసి చెప్పటమే గాక దేశ చరిత్రలో తొలిసారిగా రిజర్వుబ్యాంకు చట్టంలోని సెక్షన్‌ ఏడును ప్రయోగించారు. దాని ప్రకారం ప్రభుత్వం చెప్పినట్టు రిజర్వుబ్యాంకు వ్యవహరించాల్సి ఉంటుంది. ఒక స్వతంత్ర ప్రతిపత్తిగలిగిన సంస్థకు అధిపతిగా ఉన్న వ్యక్తిలో ఏ కాస్త ఆత్మగౌరవం ఉన్నా దానికి నిరసనగా రాజీనామా చేయటం తప్ప మరొక మార్గం లేదు. ఉర్జిత్‌ పటేల్‌ ఆ పని చేయకుండా తన వ్యక్తిగత కారణాలు చూపి తప్పుకున్నాడు. అయినా మోడీ ఈ విషయం గురించి పిట్టకథలు చెబుతున్నారు. రాజీనామాకు అనుమతించాలంటూ ఆరేడు నెలల క్రితం పటేల్‌ రాసిన లేఖను మోడీ బయట పెట్టి ఉంటే ఆయన చెబుతున్న మాటలకు విశ్వసనీయత ఉండేది.

రాజకీయాల గురించి ఎంత జాణతనంతో మాట్లాడినా చెల్లుతుంది. రైతాంగ రుణభారం వంటి తీవ్ర సమస్యల గురించి ప్రధాని మోడీ చాలా చులకనగా మాట్లాడారు. రుణాల రద్దు లాలీపాప్‌ వంటిదన్నారు. అదే నిజమైతే ఆయన పార్టీ మంత్రులు ఎందుకు రుణాల రద్దు గురించి మాట్లాడుతున్నట్టు? మోడీ మాట్లాడటానికి ఒక రోజు ముందే తమకు ఒడిషాలో అధికారమిస్తే రైతుల రుణాలను రద్దు చేస్తామని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ ప్రకటించారు. ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్నట్టుగా ఉంది మోడీ తీరు. రుణాల రద్దు కొద్దిమందికే ఉపయోగపడుతున్నదనీ, బ్యాంకుల నుంచి తీసుకొనే వారు తక్కువ, వడ్డీ వ్యాపారుల వద్ద తీసుకొనే వారే ఎక్కువని కూడా



మోడీ సెలవిచ్చారు. ఆయనకు వాస్తవాలు తెలియవా, నివేదికలు చదవరా? అర్థంగాకపోతే వివరించాలని అధికారులను అడగరా? బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొనే రైతులు చాలా తక్కువని ప్రధానే చెప్పారంటే అర్థం ఏమిటి? బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వటం లేదనే కదా? అదే నిజమైతే కేంద్రం గత ఐదేండ్లుగా ఏమి చేస్తున్నట్టు. ప్రాధాన్యతా రంగంగా ప్రకటించిన వ్యవసాయానికి రుణాలు తగినన్ని ఇవ్వలేదని బ్యాంకులను ఎందుకు నిలదీయలేదు. వాస్తవం ఏమంటే 2018ఆగస్టులో నాబార్డు వెల్లడించిన అధ్యయనం ప్రకారం 52.5శాతం రైతు కుటుంబాలు రుణభారంలో కూరుకుపోయాయి. వీరిలో కేవలం 11.5శాతమే వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తీసుకున్నారు. రికార్డులు చెపుతున్న వాస్తవం ఇది కాగా మోడీ చెపుతున్నదేమిటి !?

సర్జికల్‌ దాడులు తీవ్రముప్పుతో కూడుకున్నవి గనుక ఎక్కువ సేపు సాగించకుండా తెల్లవారక ముందే పూర్తి చేసి రమ్మని తాను స్పష్టమైన మార్గదర్శక సూత్రాలను జారీచేసినట్టు ప్రధాని చెప్పుకున్నారు. వినేవారుంటే చెప్పేవారు ఎన్నయినా పిట్టకథలు చెబుతారు. ఇలాంటి దాడుల గురించి గతంలో వాటిని నిర్వహించిన వారు చెప్పాలి. లేని గొప్పలు చెప్పుకోవటం తప్ప ఏ అనుభవంతో మోడీ మార్గదర్శక సూత్రాలు జారీ చేసినట్టు? గతంలోనూ అనేక దాడులు జరిపారు. అయినా ఏ ప్రధానీ ఇంతగా గొప్పలు చెప్పుకోలేదు. గోవధల పేరుతో మూకదాడులను మోడీ ఖండించారు. కానీ ఆయన మంత్రులు చేస్తున్నదేమిటి? దాడులకు పాల్పడి శిక్షలు పడిన ఎనిమిది మంది నేరగాండ్లు బెయిలు మీద బయటకు వచ్చినప్పుడు హజారీబాగ్‌లో పూలదండలు వేసి మరీ కేంద్ర మంత్రి జయంత సిన్హా స్వాగతం పలికారు. ఇదేమి పనయ్యా అని అడిగితే అది భావ ప్రకటనా స్వేచ్ఛ అంటూ మరో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ గడుసుతనంతో తప్పించుకున్నారు. దాద్రి హత్య కేసులో నిందితుడు చస్తే శవం మీద జాతీయజండాను కప్పి ఒక నేరగాడికి ఆ గౌరవం ఇచ్చారు మరో మంత్రి మహేశ్‌శర్మ. మోడీకి ఈ సమయంలో ఆ మంత్రులు గుర్తుకు రాలేదా లేక మంత్రులనూ ఖండించినట్టా? ఎందుకీ వంచన? ఉత్తరప్రదేశ్‌లో గోరక్షకులుగా చెప్పుకొనే ఒక పోలీసు అధికారినే హత్య చేసిన విషయం తెలిసిందే.

రాఫెల్‌ విమాన ఒప్పందం గురించి మోడీ అతి తెలివి తర్కానికి పాల్పడ్డారు. అదానీ, అంబానీలకు లబ్ది చేకూర్చారు కదా అన్న ప్రశ్నకు వ్యక్తిగతంగా నా పేరు చెప్పలేదు కదా ప్రభుత్వంపై ఆ ఆరోపణలు వచ్చాయి అన్నారు. ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి, ఎంత ఇచ్చారో చెప్పమనండి అని అడ్డుసవాలు విసిరారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు తమ ప్రభుత్వానికి క్లీన్‌ చిట్‌ ఇచ్చిందని అన్నారు. అయితే మోడీ చెప్పనిది, ఇంటర్వ్యూ చేసిన వారు అడగనిది ఏమిటి? 126 విమానాల కోసం గతంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి అధిక ధరలకు 36విమానాలు ఎందుకు కొన్నారు? ఎంతో అనుభవం ఉన్న హాల్‌ను విస్మరించి ఎలాంటి అనుభవం లేని అనిల్‌ అంబానికి కాంట్రాక్టు ఎందుకిచ్చారు? అంబానీ కంపెనీ దివాలా తీసిందా లేదా? విమానాల ధరల వివరాలను పబ్లిక్‌ ఎకౌంట్స్‌ కమిటీకి కాగ్‌ ఇచ్చినట్టు సుప్రీం కోర్టుకు ప్రభుత్వం తెలిపింది. కానీ అలాంటిదేమీ లేదని కమిటీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చెప్పగా, అసలు తమ నివేదికే పూర్తి కాలేదని కాగ్‌ చెపుతోంది కదా.. దీనికి మీ సమాధానం ఏమిటి? 2జీ స్పెక్ట్రమ్‌ మాదిరి సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణ ఎందుకు జరపరు? భారత ప్రభుత్వమే అంబానీ కంపెనీ పేరు సిఫార్సు చేసిందని ఫ్రెంచి మాజీ అధ్యక్షుడు హోలాండే ప్రకటించారు. దాని మాటేమిటి? ఇవేవీ అడగాల్సిన వారు అడగలేదు, చెప్పాల్సిన మోడీ చెప్పలేదు..!

ముమ్మారు తలాక్‌ అంశం లింగవివక్షకు సంబంధించింది, శబరిమల అంశం సాంప్రదాయం అని మోడీ మహిళల పట్ల వివక్ష కూడదంటూ ఇచ్చిన సుప్రీం కోర్టు మెజారిటీ న్యాయమూర్తులు తీర్పును విస్మరించి వివక్షను సమర్థించిన మహిళా న్యాయమూర్తి ఇందు మల్హోత్రా చెప్పిన అంశాలను ప్రధాని వివరించారంటే దేశానికి ఏ సందేశం పంపినట్టు? అన్ని కేసులలోనూ మైనారిటీ న్యాయమూర్తుల వ్యతిరేక తీర్పులనే సమర్థిస్తారా? అదే ప్రాతిపదిక అయితే ఆధార్‌ కేసులో ఆ పథకాన్ని పూర్తిగా రద్దు చేయాలంటూ మైనారిటీ తీర్పు చెప్పిన చంద్రచూడ్‌ వైఖరిని అనుసరించి ఆధార్‌ను రద్దు చేస్తారా? శబరిమలలో మహిళల పట్ల వివక్షను ప్రధాని సమర్థిస్తున్న సమయంలోనే కేరళ మహిళా మానవహారంలో 30 నుంచి 50లక్షల మంది మహిళలు పాల్గొని ప్రధాని వైఖరిని ఖండించారు.. ఇలా అనేక అంశాలను మోడీ కావాలనే విస్మరించారు.. ఇంటర్వ్యూ చేసిన వారికి అవన్నీ తెలిసి కూడా అడగకుండా దాటవేశారు. ■

మెయిల్ @ నవతెలంగాణ




పి. రమాదేవి

మీడియాకో విన్నపం

బుధవారం (జనవరి 2వతేదీ) 3 గంటలకు హెచ్‌ఎమ్‌టీవీ వారు శబరిమల ఆలయ ప్రవేశంపై అభిప్రాయం అనే అంశం మీద చర్చా కార్యక్రమం నిర్వహించారు. అనుకోకుండా నేను ఆ సమయంలో హెచ్‌ఎంటీవీ ఆన్‌చేస్తే ఈ కార్యక్రమంపై చర్చ వస్తుంది. సరే దానిని చూస్తే ఆ అంశంపై కొంత విషయ పరిజ్ఞానం వస్తుంది అనుకున్నాను. కానీ విషయ పరిజ్ఞానం కంటే మనుషుల విపరీత స్వభావం నన్ను కలచివేసింది. ఇంత అడ్డగోలుగా మాట్లాడతారా అనిపించింది. చర్చలకు పిలిచేవారికి ముందుగా మీడియావారో మాట్లాడేటప్పుడు కనీస నియమ నిబంధనలు పాటించి సభ్యత, సంస్కారవంతమైన భాష మాత్రమే మాట్లాడాలి అనే విషయం నిర్వాహకులు వివరించాలి. ఆ కార్యక్రమాన్ని నిర్వహించే వారికి కూడా ఆ విషయంపై పరిజ్ఞానం ఉండాలి. చర్చల్లో పాల్గొనేవారు అసభ్య పదజాలం వాడుతుంటే, సభ్యతను అతిక్రమిస్తుంటే వారిని అదుపు చేయగలగాలి. అసలు ఈ రోజు జరిగిన చర్చలో హిందువులం.. మా సాంప్రదాయం.. అని మాట్లాడే ముందు సాటి మనుషులను మనుషులుగా గుర్తించటం మరచి, ఆలయ ప్రవేశం కోరేవారిని, కోర్టు తీర్పును సమర్థించేవారిని దుర్భాషలాడటం, కమ్యూనిస్టులను కుక్కలు అనటం, కేరళ ముఖ్యమంత్రిని కూడా అదే విధంగా సంబోధించి మాట్లాడటం ఎంతవరకు సమంజసం? అసలు హిందువులకు ఏ దేవుడు చెప్పాడు మనుషుల్ని కుక్కలు అనమని? సాటి మనిషిని గౌరవించలేనివారు ఎలాంటి హిందువులు? పైగా సామాజిక కార్యకర్తలు అని ఫోన్‌లో పరిచయం అయినవారు కూడా అదేరకమైన భాష మాట్లాడటాన్ని ఒక ప్రేక్షకురాలిగా తీవ్రంగా ఖండిస్తున్నాను. మీడియావారు చర్చల్లో పాల్గొనే వారికి ఖచ్చితంగా అసభ్య పదజాలం వాడొద్దు, వ్యక్తిగత దూషణలను చేయవద్దు కేవలం విషయం మీదనే చర్చ జరగాలి అని చెప్పాలి. ఈ నియమాలను అతిక్రమించిన వారిని, వారు మాట్లాడే దానిని కట్‌ చేయాలి. అలా ఒకటి రెండుసార్లు చేసినచో వారు ఎవరైనాసరే చర్చల్లో పాల్గొనే ముందు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడతారు. లేనిచో ఈ రకంగా విషయంపై సరిగా వివరణ ఇవ్వకుండా సంస్కార హీనమైన భాష వాడుతుంటే చివరికి మీడియాలో చర్చాకార్యక్రమాలు చూడాలంటేనే ప్రజలకు విసుగు, ఒకరమైన జుగుప్సా కలిగే ప్రమాదం ఉంది. కాబట్టి నా విన్నపాన్ని మీడియా మిత్రులు సహృదయంతో అర్థంచేసుకోగలరని మనవి.

సెల్: 9951483440

అగ్రి'కల్చర్‌' కాపాడుకుందాం...




డాక్టర్‌ చుక్కా రామయ్య

భారతదేశం ప్రధానంగా వ్యవసాయ దేశం. మన కల్చరంతా అగ్రికల్చరే. కాయకష్టం చేసి, అహర్నిశలు చెమటోడ్చి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు కుదేలవుతున్నారు. నష్టం వస్తున్నా, ప్రభుత్వాలు చేయూతనివ్వకపోయినా తరతరాలుగా నేలమ్మనే నమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న రైతు... దిగుబడులు సరిగా లేక, పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక చివరకు దిక్కుతోచని పరిస్థితుల్లో తనువు చాలిస్తుండటం అత్యంత బాధాకరం. అలాంటి రైతులకు తక్షణ ఉపశమనం కోసం రుణమాఫీ ఎంతో చేదోడువాదోడుగా నిలుస్తుంది. కానీ, ఇదొక్కటే శాశ్వత పరిష్కారం కాదు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటుధర కల్పించడమే కాకుండా వారికి అవసరమైన రుణాలను బ్యాంకులు సకాలంలో అందించ గలిగినప్పుడే వ్యవసాయరంగం కొత్త పుంతలు తొక్కుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. కానీ, దురదృష్టవశాత్తు మన దేశంలో రైతులను చిన్నచూపు చూసే సంస్కృతి పెరిగిపోతోంది. దీనికితోడు ప్రభుత్వాల నుంచి సరైన సాయం అందక రైతులు వ్యవసాయాన్ని వదిలి పట్టణాలకు వలసలు పోతున్నారు. తమకు ఉన్న ఎకరా, రెండెకరాల పొలాన్ని తనఖా పెట్టడమో, కౌలుకు ఇవ్వడమో చేసి పట్టణాలబాట పడుతున్నారు. ఈ వాతావరణంతో ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడే గ్రామాలు నేడు వెలవెలబోతున్నాయి. దేశంలో నెలకొన్న ఈ పరిస్థితికి చరమగీతం పాడాలి. రైతులకు అప్పులు చేయని పరిస్థితిని కల్పించడమే కాకుండా రైతులు ఎందుకు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారో దృష్టిపెట్టాలి. గతంలో ఎంఎస్‌ స్వామినాథన్‌ కమిషన్‌, జయతీఘోష్‌ కమిషన్‌ ఇచ్చిన సూచనలను అమలు చేసినప్పుడే రైతులను కష్టాల నుంచి గట్టెక్కించడం సాధ్యం. ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి.

వ్యవసాయం లాభసాటి కాకపోవడంతో రైతులు విచారంలో మునిగిపోతున్నారు. పరిశ్రమలు నష్టపోతే బ్యాంకింగ్‌ వ్యవస్థ ఎలా ఆదుకుంటుందో అలాగే రైతులకూ చేదోడువాదోడుగా నిలిస్తే వారిలో కొత్త ఉత్సాహం వస్తుంది. రైతుల్లో అధికశాతం మంది నిరక్షరాస్యులు గనక వారి గోడును వినే నాథుడే కరువవుతున్నాడు. ఇక రాజకీయ నాయకులైతే.. ఎన్నికల సమయంలో వెళ్లి ఓట్లు దండుకోవడం తప్ప ఆ తర్వాత వారి ముఖాలను చూసిన దాఖలాలు అరుదే. అన్నదాతలను ఓటు యంత్రాలుగా చూడటం బాధాకరం. ఈ పరిణామాల నేపథ్యంలో చిన్న మొక్క చనిపోతేనే తల్లడిల్లిపోయే రైతన్న ఉద్యమబాట పడుతున్నాడు. అయినా, వారి గోడును పట్టించుకునే తీరిక ప్రభుత్వాలకు ఉండటం లేదు. వ్యవసాయ రంగం అతి పెద్ద పరిశ్రమ. ఎంతోమంది పారిశ్రామికవేత్తలకు వందల కోట్లు అప్పులుగా ఇస్తున్న బ్యాంకులు దేశానికి అన్నం పెడుతున్న

రామయ్య మాట

రైతులకు లక్ష రూపాయలు అప్పుగా ఇవ్వాలంటే ఎన్నో షరతులు పెడుతున్నాయి. అప్పుల కోసం బ్యాంకులకు వచ్చిన అన్నదాతలను చిన్నచూపు చూస్తున్న దుస్థితి మన దేశంలో నెలకొనడం విషాదకరం. ఎన్నికల వేళ రాజకీయ నాయకులు వ్యవసాయరంగం బలోపేతం గురించి, రైతన్న సాధికారిత గురించి ఎన్ని మాటలు చెబుతున్నా అవన్నీ నీటిమూటలే అవుతున్నాయి. ఈ తరుణంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఓ వినూత్న రీతిలో రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలోని రైతులకు పంటల పెట్టుబడి కింద ఎకరానికి రూ.8వేలు ఇవ్వడమే కాకుండా భూమి ఉన్న ప్రతి రైతుకూ రూ.5లక్షల బీమా కల్పించింది.



కానీ, కాయకష్టం చేసినవారికి ఇందులో మేలెంత? అనేది మాత్రం ప్రశ్నార్థకమే అవుతోంది. తెలంగాణ రాష్ట్రంలో కౌలుదారుల సంఖ్య గణనీయంగా ఉంది. కష్టపడి పంటలసాగు చేసిన వారికి మాత్రం రైతుబంధుతో ఏ మాత్రం లబ్ది చేకూరడంలేదనే ఆవేదన లక్షలాదిమంది రైతుల్లో వ్యక్తమవుతోంది. నాటి తెలంగాణ సాయుధ పోరాటానికి ఊపిరి పోసిన దున్నేవాడికే భూమి నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని అహర్నిశలు కష్టపడి పంటలు సాగుచేసిన వారిని అన్ని విధాలా అండగా నిలవాల్సిన బాధ్యతను మాత్రం ప్రభుత్వాలు విస్మరించొద్దు. రైతుబంధు లాంటి పథకాలు దేశవ్యాప్తంగా అమలు కావాల్సిన అవసరం ఉంది. పట్టాదారులనే కాకుండా పంట పండించిన వారిని గౌరవించుకున్న ప్రభుత్వాలే నిజమైన రైతుబంధువులవుతాయి. ఎన్నికల కోసం కాకుండా రైతుల కోసం శాశ్వత ప్రాతిపదికన ఆలోచించాలి. రైతులకు బ్యాంకింగ్‌ వ్యవస్థపై విశ్వాసం పెంచాలి. రుణాల కోసం బ్యాంకుల గడప తొక్కే రైతులను వివక్షతో చూసే ధోరణులు పోవాలి. రైతులకు సలహాలు, సూచనలు ఇస్తూ వారిని సాగుబడి దిశగా ప్రోత్సహించాలి. పంటల దిగుబడి పెంచి దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమనానికి కృషిచేయాలి. అలాగే, రాజకీయ నాయకత్వాన్ని పట్టణాలు కేంద్రంగా బలోపేతం చేయడం కాకుండా గ్రామాల ప్రాతిపదికన బలోపేతం చేయడంపై నాయకులు దృష్టి పెట్టాలి. గ్రామాల్లో నాయకత్వం స్థిరంగా ఉంటుంది. ఇప్పటివరకు వచ్చిన ఎంతోమంది గొప్ప నాయకులంతా గ్రామీణ కల్చర్‌నుంచి వచ్చినవారే. నగరాలు, పట్టణాలు, విశ్వవిద్యాలయాల నుంచి వచ్చే కల్చర్‌ వేరేగా ఉంటుంది. బలమైన నాయకత్వం గ్రామాల్లోనే సాధ్యమవుతుంది.

వచ్చే ప్రభుత్వాలేవైనా వినూత్న వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ రైతుల పక్షాన నిలబడాలి. అంతే తప్ప రైతులకు చేసేదేమైనా కేవలం ఎన్నికల స్టంట్‌గా మారరాదు. సాగుచేసే ప్రతిరైతుకూ ప్రభుత్వాలు అందించే సాయం చేరేలా చూడాలి. అలాగే, వ్యవసాయ రంగంలో ఉపాధి దెబ్బతినకుండా యాంత్రీకరణ చేపట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తనాలు, ఎరువులు నాణ్యమైనవి రైతులకు పంపిణీ చేయడం ద్వారా దిగుబడులు పెంచగల్గుతాం. పండించిన పంటల నిల్వకు గోదాంలు, పంటల కొనుగోళ్లలో అక్రమాలకు తావులేకుండా దళారీ వ్యవస్థపై ఉక్కుపాదం మోపాలి. లాభార్జనే ధ్యేయంగా నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలకు ఏ విధంగానైతే రాయితీలు కల్పిస్తున్నారో రైతుకు అలాంటి భరోసా కలిగించగలిగితే మన అన్నదాతలు సాగుబడిలో అద్భుతాలు సృష్టించగల్గుతారు. ఎంఎస్‌ స్వామినాథన్‌ కమిషన్‌ సిఫార్సులను తూచ తప్పకుండా అమలుచేయాలి. దేశ వ్యవసాయ రంగం లాభసాటి కావాలంటే ఇలాంటి విప్లవాత్మకమైన నిర్ణయాలను ప్రభుత్వాలు పకడ్బందీగా అమలుచేయాలి. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో రైతుల గురించి ఆలోచించి పనిచేసినప్పుడే రైతు కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తుంది.

ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు

మానవి
నవతెలంగాణ

ఆధునిక విద్య ద్వారానే
స్త్రీ విముక్తి
సాధ్యపడుతుంది.

- సావిత్రిబాయి పూలే





చెర్రీ కుకీస్...

కావలసిన పదార్థాలు : చెర్రీస్ - ఒక కప్పు, మైదా పిండి - 150 గ్రా॥, వెనీలాఎసెన్స్ - సగం చెంచా, నట్‌మక్ పౌడర్ - చిటికెడు, ఐషింగ్ షుగర్ - 30 గ్రా॥, బటర్ - 70 గ్రా॥, గుడ్డు - ఒకటి, లెమెన్‌జెస్ట్ - సగం చెంచా.

తయారీ విధానం : ఒక పాత్రలో బటర్‌ను తీసుకొని దాంట్లో ఐషింగ్ షుగర్, గుడ్డును వేసి బాగా కలపాలి. తర్వాత మరో పాత్రలో మైదా పిండి, లెమన్‌జెస్ట్, నట్‌మక్ పౌడర్, చెర్రీస్ వేసి మెత్తగా కలుపుకోవాలి. కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని మొత్తాన్ని ముందుగా తయారు చేసుకున్న మిశ్రమంలో కలిపి ఫ్రిజ్‌లో ఐదు నిమిషాలు పెట్టుకోవాలి. చివరగా పిండిని బిస్కెట్ మాదిరి చేసుకొని ఓవెన్‌లో 170 డిగ్రీ సెంటిగ్రెడ్ వద్ద కుక్ చేసుకుంటే చెర్రీ కుకీస్ రెడీ.

తీయని వేడుక చేసుకుందాం...

అద్భుతమైన రుచులను ఆస్వాదించాలంటే వంట గదిలో కొత్త కొత్త ప్రయోగాలు చేయాల్సిందే..! చిట్టిపొట్టి పండ్లు అంటే బ్లూ బెర్రీ, చెర్రీస్, కాస్త వెన్న, చక్కెర, మైదాతో చేసిన కుకీస్ చాలా రుచిగా ఉంటాయి. ప్రతిసారి బేకరీ ఐటమ్స్ కొనడం కన్నా ఇంట్లోనే రుచికరమైన, మెత్తటి కుకీస్‌ను చేసుకోవచ్చు. అలాంటి కమ్మటి పదార్థాలతో తీయని వేడుక చేసుకుందామా...





రోజ్ కుకీస్...

కావలసిన పదార్థాలు : బియ్యం పిండి - ఒకటి కప్పు, మైదా - సగం కప్పు, చక్కెర - సగం కప్పు, చిక్కని కొబ్బరి పాలు - సగం కప్పు, గుడ్డు - ఒకటి (గుడ్డు ఇష్టపడని వాళ్ల కొబ్బరిపాలు కొద్దిగా పెంచుకోవచ్చు), ఉప్పు - చిటికెడు, నువ్వులు - ఒక చెంచా, నూనె - సరిపడా.

తయారీ విధానం : రోజ్ కుకీస్ తయారుచేసే అచ్చులకు నూనె పూసి కనీసం రెండు రోజులపాటు పక్కనుంచాలి. ఇలా చేస్తే కుకీస్ అచ్చులకు అంటుకోకుండా ఉంటాయి. పైన చెప్పిన పదార్థాలన్నిటినీ వెడల్పాటి గిన్నెలో వేసి బ్లెండర్‌తో చిక్కని పిండిలా కలుపుకోవాలి. పిండి మరీ చిక్కగా ఉంటే కుకీస్ కరకరలాడవు. పిండి మరీ పలుచగా ఉంటే పిండి అచ్చులకు అంటుకోదు. కాబట్టి దోశల పిండిలా మధ్యస్తంగా ఉండాలి. కలిపి పెట్టుకున్న పిండిలో నువ్వులు వేసి మళ్లీ కలుపుకోవాలి. వెడల్పాటి బాండీలో నూనె పోసి, అచ్చులను నూనెలో ముంచి ఉంచాలి. అచ్చులు కాగే నూనెలో వేడెక్కిన తర్వాత తీసి పిండిలో ముంచాలి. ఇలా ముంచేటప్పుడు అచ్చు పిండిలో 80 శాతం మాత్రమే మునగాలి. ఇలాగైతేనే తర్వాత తేలికగా అచ్చు నుంచి ఊడి కుకీస్ వస్తాయి. పిండిలో ముంచిన అచ్చును నూనెలో ముంచి ఉంచాలి. పిండి ఉడికి, బుడగలు వచ్చేవరకూ ఆగి, అచ్చును కదిలించాలి. ఇలా చేస్తే అచ్చుకు అంటుకున్న కుకీ ఊడి నూనెలో ఉండిపోతుంది. ఒకవేళ అచ్చుకు అతుక్కునే ఉంటే ఫోర్క్‌తో దాన్ని వేరు చేయవచ్చు. మీడియం మంట మీద కుకీలను రెండు వైపులా బంగారు రంగు వచ్చేవరకూ వేయించి తీయాలి. ఇలా కుకీస్ వేగే సమయంలో కూడా అచ్చులను బాండీలోని నూనెలోనే ముంచి ఉంచాలి. రెండో రౌండ్ కోసం ఇలా అచ్చులను రెడీగా ఉంచుకోవాలి. వేగిన కుకీస్‌ను బయటకు తీసిన వెంటనే అచ్చులను మళ్లీ పిండిలో ముంచి బాండీలో ఉంచాలి. ఇలా మిగిలిన పిండి మొత్తంతో రోజ్ కుకీస్ తయారు చేసుకోవాలి. ఈ రోజ్ కుకీస్ తియ్యగా కరకరలాడుతూ టేస్టీగా ఉంటాయి.

బ్రెడ్ పుడ్డింగ్...

కావలసిన పదార్థాలు : బనానా బ్రెడ్ స్లైస్ - ఒక కప్పు, గుడ్లు - రెండు, పాలు - రెండు కప్పులు, చక్కెర - 100 గ్రా॥, వెనీలాఎసెన్స్ - ఒక చెంచా, బటర్ - రెండు చెంచాలు.

తయారీ విధానం : ముందుగా పాలను బాగా మరిగించుకోవాలి. పాలు మరుగుతుంటే దాంట్లో చక్కెర, వెనీలాఎసెన్స్, గుడ్లు వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమం చల్లబడే వరకు పక్కన పెట్టుకోవాలి. తర్వాత మరో పాత్రలో బ్రెడ్ స్లైస్‌లు మునిగే వరకు పాలు పోసుకోవాలి. చివరగా ఓవెన్‌లో ఎనిమిది నిమిషాల పాటు హైస్పీడ్‌లో పెట్టుకుంటే చాలు బనాన బ్రెడ్ పుడ్డింగ్ రెడీ.

బ్లూ బెర్రీ పాన్‌కేక్...

కావలసిన పదార్థాలు : మైదాపిండి- రెండు కప్పులు, ఉప్పు- సగం చెంచా, బేకింగ్ పౌడర్- ఒక చెంచా, కాస్టర్ షుగర్- ఒక చెంచా, గుడ్డు - ఒకటి, పాలు - ఒక కప్పు, కరిగించిన వెన్న- సగం చెంచా, బ్లూబెర్రీస్ - సగం కప్పు, మాపల్ సిరప్ లేదా తేనె - డ్రెస్సింగ్‌కు.

తయారీ విధానం : మైదా, ఉప్పు, బేకింగ్ పౌడర్‌లను బ్లెండర్‌లో వేసి బాగా కలుపుకోవాలి. ఒక పాత్రలో గుడ్డు, పాలు పోసి బాగా గిలక్కొట్టాలి. ఆ మిశ్రమాన్ని మైదాతో పాటు బ్లెండర్‌లో వేయాలి. అలాగే కాస్టర్ షుగర్, కరిగిన వెన్నలను కూడా బ్లెండర్‌లో వేసి బాగా గిలక్కొట్టాలి. తర్వాత బ్లూ బెర్రీస్‌ను అందులో వేసి గిలక్కొట్టాలి. ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లో పోసి గంటపాటు అలాగే బయట ఉంచాలి. తర్వాత స్టవ్ వెలిగించి పాన్ వేడిచేయాలి.. దానిపై వెన్న వేసి రెడీగా పెట్టుకున్న పిండి మిశ్రమాన్ని దోసెల్లా వేయాలి. వేసిన దోసెలను ప్లేటులో పెట్టి వాటిపై తేనె, బ్లూబెర్రీసను అలంకరించాలి.అంతే.. బ్లూబెర్రీ పాన్‌కేక్స్ రెడీ.



మహాజనుల మాతృమూర్తి



ఒప్పుడు నాలుగ్గోడల మధ్య నలిగిపోయే మహిళలు నేడు అక్షరమనే ఆయుధంతో అంతరిక్షంలోకి అడుగు పెడుతున్నారంటే చదువులతల్లి సావిత్రిబాయి త్యాగఫలితమే. 170 ఏండ్ల కిందటే ఆడపిల్లల కోసం పాఠశాల ఏర్పాటుచేసి చదువు నేర్పడం చిన్న విషయంకాదు. ఆడపిల్లలు పుట్టింది ఇంటిపనికే అనే సనాతన సంస్కృతి సంకెళ్ళలో స్త్రీలను బంధించిన రోజులవి. ఆనాడు స్త్రీలు, శూద్రులు విద్యను అభ్యసించడానికి అనర్హులు. అలాంటి మహిళలు, శూద్రుల జీవితాల్లో అక్షరంతో వెలుగులు నింపే ప్రయత్నం చేసింది సావిత్రిబాయిపూలే.

సావిత్రిబాయి 1831 జనవరి 3న మహారాష్ట్ర లోని సతారా జిల్లాలో నయ్‌గావ్ గ్రామంలో ఓ సామాన్యరైతు కుంటుంబంలో జన్మించింది. తన తొమ్మిదవ ఏటనే జ్యోతిరావుపూలేతో బాల్య వివాహం జరిగింది. సమాజంలో కొనసాగుతున్న సామాజిక అంతరాలను అర్థంచేసుకున్న పూలే సమాజమార్పుకు అక్షరాలతో నాంది పలకాలని నిర్ణయించున్నారు. తన జీవిత సహచరి సావిత్రికి తొలిగురువై సామాజిక మార్పు తెచ్చే ఆక్షరాయుధంగా ఆమెను తయారు చేశారు. పూలే కలలు సాకారం చేయడానికి సావిత్రి జ్యోతిబాయి ఆశయంతో అడుగువేసింది.

అవమానాలు భరిస్తూ

బాలికల విద్యకోసం ఈ దంపతులు 1848 జనవరి 1న పూణేలోని బుదవారపేటలో మొదటి పాఠశాలను స్థాపించి చదువు చెప్పారు. సావిత్రిబాయి పాఠశాలకు వెళ్లేటపుడు పోకిరీలు వేధించినా, రాళ్ళతో దాడులు చేసినా, అలుకునీల్లు మీద బోసినా (పాఠశాలకు వెళ్లేపుడు పుస్తకాలతోపాటు ఒక చీరను అదనంగా సంచిలో పెట్టుకొని వెళ్లి అక్కడ చీర మార్చుకొనేది) ఆ అవమానాలన్నీ భరించి ఉన్నతమైన వ్యక్తిత్వంతో చదువు చెప్పింది. చివరికి పూలే తండ్రి పూలే దంపతులను ఇంటి నుండి గెంటివేశాడు. అయినా వారి దీక్ష సడలలేదు.



అక్కన చేర్చుకుని

ఆ కాలంలో బ్రాహ్మణ స్త్రీలు కూడా పురుషాధిక్య వివక్షకు గురయ్యేవారు. బాల్యవివాహాల వల్ల చాలామంది చిన్న వయసులోనే భర్తను పోగొట్టుకుని వితంతువులయ్యే వారు. కుటుంబంలో వీరి పరిస్థితి అత్యంత హీనంగా ఉండేది. ఇలాంటి ఆడపిల్లలకు పూలే దంపతులిద్దరూ ఒకవైపు విద్యను అందిస్తూ, మరోవైపు ఆధిపత్యానికి వ్యతిరేకంగా, దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారు. అగ్రవర్ణ మహిళా బాధితులను అక్కున చేర్చుకొని వితంతువులను, వారికి పుట్టిన సంతానాన్ని రక్షించడానికి ఒక శరణాలయాన్ని కూడా నిర్వహించారు. సమాజ చీత్కరింపులు, కుటుంబ బహిష్కరణలను లెక్కచేయకుండా అంటరానితనానికి, అణిచివేతకు గురైన మహిళలకు అండగా నిలిచి చరిత్రలో నిలిచారు. వ్యక్తులుగా బయలుదేరి వ్యవస్థగా రూపొంది సాంఘిక సంస్కరణల కొనసాగింపుకోసం "సత్యశోధక్ సమాజ్" అనే సంస్థను స్థాపించారు సావిత్రిబాయి, జ్యోతిబాపూలేలు.

కనీస సదుపాయాలు లేక

కానీ నేడు విద్యారంగంలో బాలికల పరిస్థితి ఎలా ఉంది? పాఠశాల స్థాయి విద్యాభ్యాసం పూర్తిచేయగానే పై చదువులకు రాకుండానే ఎంతో మంది అమ్మాయిలు చదువుకు దూరం కావల్సి వస్తుంది. దీనికి కారణం విద్య సరుకుగా మారడం. లక్షల్లో ఫీజులు చెల్లించి అడపిల్లను చదివించినా పెండ్లి చేసి ఓ ఇంటికి పంపేవాళ్లమే కదా! అనే భావన నేటికీ కొనసాగుతుంది. ఇంకా ప్రభుత్వ పాఠశాలల్లో సరైన విద్యా సౌకర్యాలు లేకపోవడం, బాలికలకు కనీసం టాయిలెట్లు కూడా సరిగా ఉండడం లేదు. దీనితో పాఠశాలలో ఉన్నప్పుడు మంచినీళ్ళు తాగడమే మానేస్తున్నారని అనేక సర్వేల్లో తేలింది. ఆడపిల్లలకు ప్రత్యేక ఆరోగ్య సమస్యలు ఉంటాయి. వాటిని పాఠశాల, కళాశాలలో పట్టించుకునే పరిస్థితి లేదు. కొన్ని విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఆడపిల్లలను వేధింపులకు గురిచేస్తున్నారు. ఇవన్నీ భరించలేక చాలా మంది అమ్మాయిలు మధ్యలోనే చదువు మానేస్తున్నారు.

మహిళా ప్రాతినిధ్యం పెరిగినప్పడే

ప్రభుత్వాలు మహిళలకోసం ప్రత్యేక అవకాశాలు కల్పించినప్పుడే సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమవుతుంది. అయితే కొంతమంది మహిళలు ఉన్నత చదువులు చదివి కూడా వంటింటికే పరిమితమవుతున్నారు. దీనికి కారణం రోజురోజుకు పని ప్రదేశాల్లో పెరిగిపోతున్న లైంగిక వేధింపులు. రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు మహిళా చట్టాలను, మహిళలకు ఉపయోగపడే కార్మిక చట్టాలను నీరుగారుస్తున్నాయి. దేశంలో ఇంత సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ మహిళలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోతుంది. ఆర్థిక దోపిడి కొనసాగుతూనే ఉంది. శతాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నప్పటికి కూడా మహిళలకు నేటికి బడిలోకే కాదు, గుడిలోకి కూడా ప్రవేశంలేని అంటరాని వారుగా చూస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. మహిళను ఇంటికే పరిమితం చేసే కుటుంబాలలో మార్పు రావాలి, చట్టసభలలో మహిళ ప్రాధాన్యం పెరిగినప్పుడు మాత్రమే మహిళా సమస్యలు పరిష్కారమవుతాయి.

పాఠ్యాంశంగా చేర్చాలి

"ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు" అన్నట్టుగానే ఆడపిల్ల ఆలోచనలకు స్వేచ్ఛని ఇస్తే "ఆడపిల్లల చదువు దేశానికే వెలుగు" నింపడంతోపాటు దేశాభివృద్ధిలో భాగస్వాములవుతారు. ఆడపిల్లలను ఉన్నత చదువుల్లో ప్రోత్సహిస్తే పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తారని ఇప్పటికే అనేక మంది నిరూపించారు. అందుకే అమ్మాయిల చదువులపట్ల చిత్తశుద్ధితో కృషిచేయాలి. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టే బాధ్యత ప్రభుత్వాల ప్రభుత్వాలు తీసుకోవాలి. అలాగే సావిత్రిబాయి వారసులుగా నేటితరం బాలికలు, మహిళలు ముందడుగు వేసి రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులకై పోరాడాలి. ఈ పురుషాధిక్య సమాజ బావజాలాన్ని రూపుమాపాలి. భారత సమాజానికి మొదటి ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి జన్మదినాన్ని ప్రభుత్వం ప్రతీ సంవత్సరం జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలి. స్ఫూర్తిదాయకమైన మహాజనుల మాతృమూర్తి జీవిత చరిత్రను పాఠశాల స్థాయినుండి కళాశాల వరకు ప్రత్యేక పాఠ్యాంశంగా చేర్చాలి.



- రజిత

రంగ వల్లులు



డి.కె జమున
మహబూబ్‌నగర్



23 చుక్కలు,
1 వచ్చేవరకు మధ్యచుక్క



గోవిందమ్మ
సిరిసిల్ల



మా చిరునామా
మానవి,నవతెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్. భవన్, 21/1, అజామాబాద్, హైదరాబాద్-20. ఇ-మెయిల్:
manavi@navatelangana.com

తగ్గేందుకు మార్గం ఉందిగా!

అనారోగ్యాలకు ఒత్తిడే కారణమని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. మైగ్రేన్, అల్సర్లు, గుండె జబ్బులు, ఐబీఎస్, బీపీ, మధుమేహం వంటి వ్యాధులకు కూడా కారణం ఇదే అంటున్నారు వైద్యులు. "ఒత్తిడికి గురైన వ్యక్తుల్లో స్ట్రెస్ హార్మోన్స్ విడుదలై శరీరంలో ఎన్నో మార్పులు కలుగజేస్తాయి. హార్ట్‌రేట్, బ్లడ్‌షుగర్ లెవల్స్ పెరుగుతాయి. అంతేకాదు కొన్నిసార్లు పరిస్థితి తీవ్రతను బట్టి చనిపోయే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. ఒత్తిడిని తగ్గించుకోవటానికి అనేక మార్గాలు ఉన్నాయి. వాటిగురించి తెలుసుకుని ఆచరించగలిగితే చాలావరకూ ఒత్తిడి నుండి బయటపడొచ్చు.


ఒత్తిడి అందరిల్లోనూ కనిపిస్తుంది. ఎల్‌కేజీ చిన్నారులు కూడా ఒత్తిడి ఎదుర్కొంటున్నారు అనడంలో అతిశయోక్తి లేదు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి పలువురు పలు రకాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. సాధారణంగా ఒత్తిడికి గురైనప్పుడు 'పారాసింపథటిక్ నెర్వ్‌సిస్టమ్' వెంటనే పనిచేయడం మొదలుపెడుతుంది. ఒత్తిడి నుంచి సాధారణస్థితికి వచ్చేందుకు అది సాయపడుతుంది. దీనినే 'రిలాక్సేషన్ రెస్పాన్స్' అంటారు. అయితే ఇది కొంతమందిలో విఫలమైనప్పుడు ఒత్తిడి విపరీతంగా పెరిగిపోయి, నరాలు చిట్లిపోయే ప్రమాదం కూడా ఉంది. దీనికి పరిష్కారం ఏమిటంటే.. ఒత్తిడిని పెంచుకోకుండా ఉండాలి. యోగాలాంటివి చేయాలి. విపరీతమైన ఒత్తిడికి



గురైన వారిలో ఎక్కువమంది దురలవాట్లకు బానిసలవుతున్నారు. యోగా ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చు. చాలా సింపుల్ ఆసనాలతోనే మనసు ప్రశాంతంగా ఉంచుకోవచ్చు అన్నారు యోగా నిపుణులు. యోగా, మెడిటేషన్‌ల ద్వారా ఒత్తిడిని చాలావరకూ అధిగమించవచ్చు. ❄

గవర్నర్‌ను కలిసిన కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్... బుధవారం రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌ను రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఉన్నారు.

జేఎస్‌ఓలో నారాయణ విద్యార్థుల జైత్రయాత్ర

- అత్యధికంగా 23సెలక్షన్స్



హైదరాబాద్: వశోవింబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ రీసెర్చ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన జూనియర్ సైన్స్ ఒలంపియాడ్(జేఎస్‌ఓ)లో, ఫిజిక్స్, కెమిస్ట్రీ,అస్ట్రానమీ విభాగాల మొదటిదశ ఫలితాల్లో నారాయణ విధ్యార్థులు జైత్రయాత్రను కొనసాగించారు. జూనియర్ సైన్స్ ఒలంపియాడ్‌లో పాఠశాల స్థాయి నుంచి తమ విద్యార్థులు 23 సెలక్షన్స్‌ను సాధించారనీ నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం తెలిపింది. కాలేజీ స్థాయి విద్యార్థులతో పోటీపడి తమ పాఠశాల విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒలంపియాడ్‌ల్లో ఒక్కో సెలక్షన్‌ను, అస్ట్రానమీలో నాలుగు సెలక్షన్‌లను సాధించామని తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సింధూర నారాయణ మాట్లాడుతూ...తెలుగు రాష్ట్రాల్లో ప్రకటించిన స్కూల్ స్థాయి సెలక్షన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థులందరూ తమ వారే కావటం గర్వకారణమన్నారు. దేశవ్యాప్తంగా స్కూల్ స్థాయిలో ఎక్కడ ఎలాంటి పోటీ పరీక్షలు నిర్వహించినా తమ విద్యార్థులు ముందువరుసలో నిలవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పోటీ ప్రపంచంలో తమ విద్యార్థులను సాటిలేని మేటి విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.

రైతు ఆత్మహత్య


(ఫైల్)

నవతెలంగాణ-తంగళ్ళపల్లి

అప్పుల భారంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్‌లో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. అంకుసాపూర్‌కు చెందిన బొలమల యాదగిరి తన ఎకరా పొలంలో పత్తి సాగు చేశాడు. సుతారి పని కూడా చేసేవాడు. పత్తి ఎండిపోయి సరైన దిగుబడి రాలేదు. మూడేండ్లుగా సాగు కలిసిరాక అప్పులు రూ.3లక్షల వరకు అయ్యాయి. వాటిని ఎలా తీర్చాలన్న బెంగతో యాదగిరి(40) ఇంట్లోనే ఉరేసుకున్నాడు. రైతుకు భార్య నాగలక్ష్మి, కూతురు భార్గవి, కొడుకు ప్రకాశ్ ఉన్నారు.

జర్నలిస్టులపై కేసులు ఎత్తేయాలి : టీడబ్ల్యూజేఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సామాజిక బాధ్యతలో భాగంగా ప్రజల్ని చైతన్యపరిచే విధంగా దయ్యాలు, భూతాలు లేవని కథనాలను ప్రసారం చేసిన మోజో టీవీ బృందంపై చిలకలగూడ పోలీసుస్టేషన్ కేసు నమోదు చేయడం దారుణమని, వారిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్)అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్.సోమయ్య, బి.బసవపున్నయ్య బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాడుబడ్డ భవనంలో దెయ్యాలు సంచరిస్తున్నాయనే స్థానిక ప్రజల అపోహలను, భయాందోళనలను పారదోలేందుకు యత్నించిన జర్నలిస్టులపై ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం సరిగాదన్నారు. గతంలో అదే భవనానికి సంబంధించి పలు జాతీయ, తెలుగు ఛానళ్ల ప్రచారం చేశాయని గుర్తు చేశారు. మోజో టీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సంజీవ్ కుమార్ సింగ్, ఇన్‌పుట్ ఎడిటర్ గోపరాజు, మరో ఐదుగురిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తేయాలని కోరారు.


పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించండి

పాఠశాల విద్య కమిషనర్‌కు టీపీఏ విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవతరగతి విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్, పాలు అందించాలని పాఠశాల విద్య శాఖ కమిషనర్‌కు తెలంగాణ తల్లిదండ్రుల సంఘం (టీపీఏ) విజ్ఞప్తి చేసింది. ఈమేరకు బుధవారం టీపీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగాటి నారాయణ, పగడాల లక్ష్మయ్య ఇదే అంశంపై కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 4800 ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాల్లో సుమారు 2 లక్షల మంది పదవ తరగతి చదువుతున్నారని పేర్కొన్నారు. వారిలో చాలా మంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నారన్నారు. పదవ తరగతిలో విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించాలనే అధికారుల ఆదేశాలకు అనుగుణంగా అన్ని పాఠశాలల్లోనూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉదయం పూట అల్పాహారం చేయకుండానే విద్యార్థులు తరగతులకు హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. సాయంత్రం ఏడు గంటలకు వరకు ఆకలితో స్పెషల్ క్లాసుల్లోనే ఉంటున్నారన్నారు. ఆకలితో ఉన్న విద్యార్థులు క్లాసుల్లో కూర్చొని చదువు మీద దృష్టి కేంద్రికరించలేరని అభిప్రాయపడ్డారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే సర్కారు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

పరిహారం కోసం నిర్వాసితుల ఆందోళన



నవతెలంగాణ-జనగామ ప్రతినిధి

పరిహారం కోసం భూ నిర్వాసితులు జనగామ జిల్లా కేంద్రంలోని సూర్యపేట-సిద్దిపేట రహదారిపై బుధవారం ఆందోళనకు దిగారు. జనగామ పట్టణాన్ని ఆనుకొని కలెక్టరేట్ సముదాయం సమీపంలో సుమారు ఆరున్నర ఎకరాల భూమిని ఇండ్ల నిర్మాణం కోసం 250 మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే దేవాదుల కుడి కాల్వ కోసం భూసేకరణలో భాగంగా ఆ ప్లాట్లను బాధితులు కోల్పోవాల్సి వచ్చింది. ప్రభుత్వం నష్టపరిహారంగా గజాల చొప్పున కాకుండా ఎకరాల చొప్పున ధర కట్టిస్తామనడంతో బాధితులు ఒప్పుకోలేదు. కలెక్టరేట్ పక్కనే గజం రూ.15వేలు ఉందనీ, ఎకరాల చొప్పున పరిహారం చెల్లిస్తే తాము తీవ్రంగా నష్టపోతామనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ ప్లాట్లకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బాధితులు సూర్యపేట-సిద్దిపేట రహదారిపై ధర్నా చేశారు. జనగామ సీఐ ముస్కె శ్రీనివాస్ అక్కడికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పడం ఆందోళన విరమించారు.

నా కష్టానికి కూలి ఇవ్వండి

కేంద్రంపై పోరాటానికి కలసి రండి

- శబరిమలలో మహిళల ప్రవేశానికి బీజేపీ అడ్డంకులు : కుప్పం జన్మభూమి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



చిత్తూరు: 'నాలుగున్నరేళ్లుగా మీ అభివృద్ధి కోసం కష్టపడుతున్నాను. ఇప్పుడు నోరు తెరచి అడుగుతున్నాను.. నా కష్టానికి కూలి ఇవ్వండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. ఆరో విడత 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమాన్ని ఆయన నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలోని వడ్డిపల్లిలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిసి రోడ్లు, ఎన్టీఆర్ గృహాలు, ఇంకుడు గుంతలను ప్రారంభించారు. సీమంతం కార్యక్రమంలో భార్గవిని ఆశీర్వదించారు. ప్రభుత్వ పాఠశాలలో సరదగా పిల్లలతో ఫొటోలు తీసుకున్నారు. అనంతరం జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ. వచ్చే ఎన్నికల్లో బిజెపి నుంచి రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ముస్లిములను జైల్లోపెడతామని ఆ పార్టీ నాయకులు హెచ్చరికలను ఆయన తప్పుపట్టారు. కేరళలో మహిళలను గుడిలోకి వెళ్లనివ్వకుండా బీజేపీ ఇబ్బంది పెడుతోందన్నారు.. పేదలకు ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. కాన్పుకోసం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే పేద గర్భిణులకు వైద్య ఖర్చులనూ ప్రభుత్వమే భరించేలా త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని పంపుసెట్లకు సోలార్ పవర్ కనెక్షన్లు ఇస్తామని, దీని ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఏడాదికి కేంద్రానికి ఆరువేల కోట్ల రూపాయలు పన్ను చెల్లిస్తున్నామని, కనీసం ఆ డబ్బు కూడా మనకు ఇవ్వడం లేదన్నారు. నిధులు ఇవ్వకపోయినా పోలవరాన్ని పూర్తిచేస్తానని పునరుద్ఘాటించారు. కక్ష సాధింపుగా చివరకు ఫోన్లు కూడా మోడీ ట్యాప్ చేస్తున్నారని విమర్శించారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల దేశ ఆర్థిక స్థితి కుదేలయ్యిందన్నారు. కేంద్రం నిధులివ్వకపోయినా కడపలో స్టీల్ ఫ్యాక్టరీ, రామాయంపేటలో నౌకాశ్రయాన్ని మనమే ఏర్పాటు చేసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రం కోసం పవన్‌కళ్యాణ్ కూడా సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓ కమిటీ ద్వారా రాష్ట్రానికి 70వేల కోట్ల రూపాయలు కేంద్రం నుంచి రావాల్సి ఉందని తేల్చారని, దీనిపైన పవన్ నిలదీయాలన్నారు. కేసీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ప్రజల కోసమే తాను ఓపిగ్గా ఉన్నానని, సభ్యతా సంస్కారం తనకు ఉన్నాయన్నారు.


అచ్రేకర్ కన్నుమూత


(ఫైల్)

ముంబయి: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ గురువు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ప్రముఖ క్రికెట్ కోచ్ రమాకాంత్ అచ్రేకర్(87) బుధవారం సాయంత్రం ముంబయిలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. భారతరత్నం సచిన్‌కు క్రికెట్‌లో ఓనమాలు దిద్దించిన అచ్రేకర్ వృద్ధాప్యంతో కన్నుమూశారు. ఈ విషయాన్ని అచ్రేకర్ కుటుంబ సభ్యులు మీడియాకు తెలిపారు. 1932లో జన్మించిన అచ్రేకర్ 1943లో క్రికెట్ ఆడటం ప్రారంభించి 1945లో న్యూ హిందూ స్పోర్ట్స్ క్లబ్ తరపున ఆడారు. యంగ్ మహారాష్ట్ర ఎలెవన్, గుల్ మోహర్ మిల్స్, ముంబయి పోర్ట్‌కు ప్రాతినిథ్యం వహించారు. 1963-64 మొయిన్‌ద్దౌలా టోర్నీలో ఆల్ ఇండియా స్టేట్ బ్యాంకు జట్టు తరపున హైదరాబాద్‌పై ఒక ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడారు. ఆ తర్వాత ముంబయిలోని శివాజీ పార్క్ వద్ద కామత్ స్మారక క్రికెట్ క్లబ్‌ను అచ్రేకర్ ప్రారంభించి ఎంతోమందికి క్రికెట్ ఓనమాలు నేర్పారు. ప్రస్తుతం ఈ క్లబ్‌ను అచ్రేకర్ కుమార్తె కల్పన, అల్లుడు దీపక్ నిర్వహిస్తున్నారు. అచ్రేకర్‌కు ఘనకీర్తి తెచ్చిపెట్టింది మాత్రం సచిన్ టెండూల్కరే. వినోద్ కాంబ్లి, ప్రవీన్ ఆమ్రే, సమీర్ దిఘె, బల్విందర్ సింగ్ సంధు, అజిత్ అగార్కర్ వంటి క్రికెటర్లకు ఆయన శిక్షణ నిచ్చారు. పద్మశ్రీ పురస్కారం గ్రహీత అచ్రేకర్‌కు సచిన్ ప్రియశిష్యుడు.

25న పోలింగ్ తేదీని మార్చండి

- ఎన్నికల సంఘానికి ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఈనెల 25న జరిగే రెండో విడత పోలింగ్‌ను మరో తేదీకి మార్చాలని పలు ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసి విజ్ఞప్తి చేశాయి. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం జరగనున్న నేపథ్యంలో ముందురోజు పోలింగ్ నిర్వహిస్తుండడంతో మరుసటి రోజే పంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహించడం వల్ల ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఇబ్బందులు వస్తాయని ఎన్నికల సంఘం దృష్టికి తెచ్చింది.

మరొక తేదీన నిర్వహించండి : పీఆర్టీయూ

ఈనెల 26న గణతంత్ర దినోత్సవం వేడుకలకు ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరవుతారని పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి కమలాకర్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులను దృష్టిలో ఉంచుకొని రెండో విడత పోలింగ్ తేదీని మరోకరోజు నిర్వహించాలని సూచించారు.

మార్పు చేయాలి : ఎస్టీయూ

ఈనెల 25న జరిగే పంచాయతీ ఎన్నికల పోలింగ్ తేదీని మరో రోజుకు మార్చాలని ఎస్టీయూటీఎస్ అధ్యక్షులు బి భుజంగరావు, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. గణతంత్ర దినోత్సవం ఉన్నందున పోలింగ్ తేదీని ముందుకుగానీ, తర్వాత గానీ నిర్వహించాలని సూచించారు.

పోలింగ్ తేదీని మార్చండి : టీటీయూ

ఈనెల 26న గణతంత్ర దినోత్సవం వేడుకలు జరగనున్నందున ముందురోజు జరిగే పోలింగ్ తేదీని మార్చాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) అధ్యక్షులు ఎం మణిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న జరిగే ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు 23వ తేదీనే పాఠశాలల నుంచి రిలీవ్ అవుతారని పేర్కొన్నారు. ఈనెల 24న తేదీ నుంచే పాఠశాలలన్నీ ఎన్నికల సంఘం ఆధీనంలోకి వెళ్తాయని తెలిపారు. ఈనెల 25న ఎన్నికల విధుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే ఉపాధ్యాయులకు ఇబ్బందులు తలెత్తుతాయని సూచించారు. అందుకే ఈనెల 25న జరిగే ఎన్నికలను మరో తేదీకి మార్చాలని కోరారు.

సత్వర న్యాయం అందించేందుకు కృషి

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టీబీఎన్ రాధాకృష్ణన్


(ఫైల్)

నవతెలంగాణ -హైదరాబాద్

ఎట్టకేలకు తెలంగాణ కల సాకారం అయ్యింది. తెలంగాణ రాష్ట్రం వచ్చినా ప్రత్యేకంగా హైకోర్టు కూడా కావాలనే తెలంగాణవాదుల కల కార్యరూపం దాల్చింది. మంగళవారం హైకోర్టు అధికారికంగా ఏర్పాటైన నేపథ్యంలో బుధవారం తెలంగాణ హైకోర్టు కేసుల విచారణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మొదటి కోర్టు హాల్లో ప్రధానన్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ అధ్యక్షతన న్యాయమూర్తులతో ఫుల్ కోర్టు సమావేశం అయ్యింది. తెలంగాణ అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఈ సమావేశానికి హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1.87 లక్షల పెండింగ్ కేసులతో హైకోర్టు ఏర్పడిందని, వీటి పరిష్కారం కోసం న్యాయవాదులు, న్యాయమూర్తులు (బెంచ్ అండ్ బార్) సమిష్టిగా పనిచేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణన్ అన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. ప్రమాణాలతో కూడిన న్యాయం సకాలంలో అందించేందుకు పాటుపడాలన్నారు. గుణాత్మకంగా, శాస్త్రీయంగా, సకాలంలో న్యాయం అందించేందుకు శక్తివంచనలేకుండా కృషి చేస్తామన్నారు. సత్వర న్యాయం అందించాలంటే బెంచ్ అండ్ బార్ సమిష్టిగా పనిచేయాలని, నాణానికి చెరో వైపు కాకుండా రెండు రథచక్రాల్లా ఉంటూ న్యాయాన్ని ముందుకు నడించించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇందుకు అందరూ అప్రమత్తంగా, సమర్థంగా పనిచేయాలని కోరారు. 1.87 లక్షల పెండింగ్ కేసులతో తెలంగాణ హైకోర్టు ప్రారంభం యిందని, వీటిని క్రమంగా తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. ప్రజల ఆశీస్సులతో రాజ్యాంగానికి లోబడి న్యాయమూర్తులు ప్రమాణం చేసిన విషయాన్ని జస్టిస్ రాధాకృష్ణన్ గుర్తు చేశారు. చారిత్రక మార్పును మనమంతా నిన్నటి వరకూ చూశామని, ప్రస్తుత హైకోర్టు కొత్త ఏడాదికి స్వాగతం చెప్పడంతో ఏర్పాటు అయ్యిందన్నారు. మనమంతా సమర్థంగా పనిచేస్తామని ఇక్కడ బార్ అండ్ బెంచ్ ప్రమాణం చేశామని, అందుకు అనుగుణంగా అందరూ చేతిలో చేయి వేసి ప్రమాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ హైకోర్టు.. తెలంగాణ హైకోర్టుగా మారేందుకు న్యాయవాదులు, ప్రభుత్వం, ఎంతోమంది సిబ్బంది,న్యాయాధికారులు, న్యాయమూర్తులు ఎంతో శ్రమించిన ఫలితంగా ఎలాంటి అవరోధాలు లేకుండా ఏర్పాటు జరిగిందని జస్టిస్ రాధాకృష్ణన్ కొనియాడారు. న్యాయవ్యవస్థ ఉన్నతి కోసం ప్రజలకు సత్వర న్యాయం అందించే సేవ చేసేందుకు కలిసికట్టుగా అడుగులు వేద్దామని ఆయన పిలుపునిచ్చారు. మూడ ధర్మాసనాలు ఏర్పాటు రాష్ట్ర హైకోర్టు ఏర్పడిన నేపథ్యంలో కొత్తగా న్యాయమూర్తులవారీగా వివిధ అంశాలను కేటాయించారు. మూడు ద్విసభ్య ధర్మాసనాలు ఏర్పాటు అయ్యాయి. మొదటి ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాధాకష్ణన్, జస్టిస్ ఏరాజశేఖర్‌రెడ్డిలతో ఏర్పాటు అయ్యింది. రెండో డివిజన్ బెంచ్‌లో రాఘవేంద్ర ఎస్ చౌహాన్, టీ అమర్‌నాథ్‌గౌడ్, మూడో డివిజన్ బెంచ్‌లో వీరామసుబ్రమణియన్, పీ కేశవరావులు ఏర్పాటు చేశారు.. మొదటి ధర్మాసనం ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్), రిట్ అప్పీళ్లు, ధిక్కరణ అప్పీళ్లు, క్రిమినల్ ధిక్కరణ అప్పీళ్లు, హెబియస్‌కార్పస్ కేసులు, సుమోటో రిట్ పిటిషన్లు, హైకోర్టు, జుడిషియల్ సర్వీసెస్, జిల్లా కోర్టులకు సంబంధించిన కేసులు విచారిస్తాయి. రెండో ధర్మాసనం క్రిమినల్ అప్పీళ్లు, భూసేకరణ, సిటీ సివిల్ కోర్టు అప్పీళ్లు, సివిల్ రివిజన్ పిటిషన్లు తదితర అంశాలను విచారిస్తుంది. మూడో ధర్మాసనం ఆదాయం పన్ను ట్రిబ్యునల్ అప్పీళ్లు, సెంట్రల్ ఎక్సైజ్, ఆదాయపు పన్ను, మనీలాండరింగ్ అప్పీళు తదితర కేసుల్ని విచారిస్తుంది.

రైతులను ఆదుకోవడంలో మోడీ సర్కారు విఫలం

- కేంద్ర వైఖరికి నిరసనగా నేటినుంచి ఢిల్లీలో భారీ ధర్నా : ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

దేశ రైతాంగాన్ని ఆదుకోవడంలో మోడీ సర్కారు పూర్తిగా విఫలమైందని ఆంధ్రప్రదేశ్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ చెప్పారు. నరేంద్ర మోడీ భారత ప్రధానిగా ఉండటం దేశ ప్రజల దురదష్టమని అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. దేశ రైతాంగమంతా ఎక్కువ శాతం బ్యాంకుల వద్ద అప్పులు తీసుకోవడం లేదని... కొద్దిమంది రైతులు మాత్రమే బ్యాంకుల వద్ద రుణాలు తీసుకుంటున్నట్టు మోడీ చెప్పారన్నారు. అయితే, దేశంలోని రైతులు అందరూ రుణాలు తీసుకుంటున్నారని తెలిపారు. రుణమాఫీ చేయకుండా ఉండటానికే మోడీ అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏపీకి పదేండ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన బీజేపీ కనీసం ఐదేండ్లు కూడా ఇవ్వకుండా మొండి చేయి చూపిందని మండి పడ్డారు. అమ రావతి నిర్మాణానికి కేంద్రం ఇప్పటివరకు 15 వందల కోట్ల రూపాయలే ఇచ్చిందని తెలిపారు. వెనకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వకుండా మోడీ సర్కారు రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. రెవెన్యూ లోటు రూ. 16 వేల కోట్లు ఉంటే... కేవలం మూడున్నర వేల కోట్లే ఇచ్చారని వివరించారు. విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ విషయంలో కూడా అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా సాధన, కేంద్ర వైఖరికి నిరసనగా జనవరి 3, 4వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్టు వెల్లడించారు. సీపీఐ, సీపీఐ(ఎం), రాజకీయ పార్టీలు, అన్ని సంఘాలు, మేధావులందరూ ఈ ధర్నాలో పాల్గొంటారని చెప్పారు.

లౌకిక వాదానికి పెనుముప్పు

- ప్రొఫెసర్ రాజమోహన్‌గాంధీ ఆందోళన
- 'తెలుగునాట గాంధీబాట' పుస్తక ఆవిష్కరణ

గుంటూరు : దేశంలో లౌకిక వాదానికి పెనుముప్పు ఏర్పడిందని మాజీ ఎంపి, మహాత్మాగాంధీ మనమడు రాజమోహన్ గాంధీ ఆందోళన వెలిబుచ్చారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ రాసిన 'తెలుగునాట గాంధీబాట' పుస్తకాన్ని స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. 'గాంధీ సిద్ధాంతాలు-నేటి ఆవశ్యకత' అంశంపై నిర్వహించిన సదస్సులో రాజమోహన్‌గాంధీ మాట్లాడుతూ 1946-48 మధ్య కాలంలో ఉన్న పరిస్థితులు మళ్లీ ఏర్పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీ జీవితం దేశానికి ఒక స్ఫూర్తి, దిక్సూచి అని చెప్పారు. దేశంలో నిరుద్యోగం పెరగుతోందని, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగాలన్నారు. నిరుద్యోగంతో యువతలో అశాంతి పెరిగితే దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు పెంచకపోతే రాజ్యాంగ మౌలిక సూత్రాల అమలుకు విఘాతం ఏర్పడినట్లేనని చెప్పారు. దేశంలోకి ఇతర దేశాల నుంచి చొరబాట్లను కఠినంగా నియంత్రించాలనీ, ఈశాన్య రాష్ట్రాల్లోకి 30 ఏళ్ల కిందట వచ్చిన అనేక మంది చొరబాటు దారులకు మానత్వంతో ఇక్కడ జీవించే అవకాశం ఇవ్వాలనీ, వారికి కాకుండా వారి పిల్లలకు మాత్రం ఓటు హక్కు ఇవ్వాలనీ ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రతి ఒక్కరూ బహుభాషలను నేర్చుకోవాలని, దక్షిణాది రాష్ట్రాల్లో చాలా మంది బహుభాషలు వచ్చిన వారు ఉన్నారని కొనియాడారు. ఎక్కువ భాషలు రావడం వల్ల దేశ సమగ్రత పరిఢవిల్లుతుందన్నారు. దక్షిణాదిలో ఒక రాష్ట్రం పట్ల మరో రాష్ట్రానికి శతృత్వం లేదని ఆయన పేర్కొన్నారు.

వర్సిటీల సందర్శనకుఉన్నత విద్యామండలి బృందం

- గవర్నర్ ఆదేశాల అమలుపై ఆరా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) బృందం సందర్శించనుంది. సంక్రాంతి పండుగ తర్వాత వర్సిటీలను ఆ బృందం సందర్శించే అవకాశమున్నది. ఈ బృందంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఆర్ లింబాద్రి, వి వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఓ నర్సింహారెడ్డి, శ్యామల, శివరాజ్ ఉన్నారు. గతేడాది ఆగస్టు 8న వీసీలతో విశ్వవిద్యాలయాల చాన్సలర్, తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో వీసీలకు పలు ఆదేశాలు జారీ చేశారు. విశ్వవిద్యాలయాలు బలోపేతం కావడానికి సూచనలు చేశారు. గవర్నర్ ఆదేశాలు ఏ మేరకు అమలయ్యాయో ఈ బృందం ఆయా విశ్వవిద్యాలయాలను ఆరా తీయనుంది. ఏయే అంశాలు ఎంత మేరకు అమలయ్యాయి, కాకపోతే ఎందుకు కాలేదో కారణాలు తెలుసుకుంటుంది. అన్ని విశ్వవిద్యాలయాల సందర్శన పూర్తయిన తర్వాత నివేదిక రూపొందించి ఉన్నత విద్యామండలి గవర్నర్‌కు సమర్పించే అవకాశమున్నది. బోధనా ప్రమాణాలు పెంచాలనీ, అధ్యాపకులు, విద్యార్థుల హాజరు కోసం బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టాలనీ, నాణ్యమైన విద్య అందించాలనీ, శాతవాహన, పాలమూరు, ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయాలు న్యాక్ గ్రేడ్ పొందాలనీ, అన్ని విశ్వవిద్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనీ, సకాలంలో స్నాతకోత్సవాలు నిర్వహించాలనీ, అడ్డగోలుగా పీహెచ్‌డీలు ఇవ్వకూడదనీ, పరిశోధనలు మెరుగుపడేందుకు చర్యలు తీసుకోవాలనీ, సామాజిక కోణంలో పరిశోధనలు చేయాలనీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలనీ ఇలా అనే అంశాల గురించి గవర్నర్ వివరించారు. ఇవి ఏ మేరకు అమలయ్యాయో ఈ బృందం తెలుసుకోనుంది. ఉన్నత విద్యామండలి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఈ అంశాలపై చర్చించి ఓ నిర్ణయానికి వచ్చే అవకాశముంది. దాని ఆధారంగా రూపొందించే నివేదికను గవర్నర్‌కు సమర్పిస్తారు.

కామారెడ్డిలో ఎంసీపీఐ (యూ) రాష్ట్ర మహాసభలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర రెండో మహాసభలు ఈనెల 31, ఫిబ్రవరి ఒకటి, రెండు తేదీల్లో కామారెడ్డిలో జరగనున్నాయి. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తొలుత ప్రకటించినట్టుగా ఈనెల 6,7,8 తేదీల్లో జరగాల్సిన మహాసభలను వాయిదా వేశామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

సీఎం ఓఎస్‌డీగా ప్రియాంక వర్గీస్ కొనసాగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి ఓఎస్డీగా ప్రియాంక వర్గీస్ కొనసాగనున్నారు. ఆమె సీఎంవోలో హరితహారం కార్యక్రమాన్ని పర్యవేక్షణాధికారిగా ఉన్నారు. ఆమెను ఓఎస్డీగా కొనసాగిస్తూ సీఎస్ ఎస్‌కే జోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'పంచాయతీ'లకు ఒంటరిగానే..

నవతెలంగాణ-కంఠేశ్వర్

గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతాయనీ, కావున తెలంగాణ జనసమితి ఒంటరిగానే బరిలోకి దిగుతున్నట్టు ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరామ్ స్పష్టం చేశారు. ఇప్పటికే చాలామంది సర్పంచ్‌గా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారనీ, అందుకే జిల్లా పర్యటనలు చేస్తూ సమన్వయ సమావేశాల్లో కమిటీలు వేస్తున్నట్టు తెలిపారు. బుధవారం నిజామాబాద్‌లోని తెలంగాణ జనసమితి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న బీసీల రిజర్వేషన్ల తగ్గింపు సరికాదని అన్నారు.


సింగరేణి 'సోషల్ మీడియా వాల్' ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సింగరేణి సంస్థకు సంబంధించిన సామాజిక మాధ్యమాలన్నీ ఒకేచోట కనబడేలా రూపొందించిన 'సోషల్ మీడియా వాల్' వెబ్‌సైట్‌ను బుధవారం ఆ సంస్థ డైరెక్టర్ ఎస్. చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 55 వేల మంది ప్రత్యక్షంగా, కొన్ని లక్షల మంది పరోక్షంగా ఆధారపడుతున్న ప్రతిష్టాత్మక సంస్థ సింగరేణి అని తెలిపారు. ఈ నేపథ్యంలో సంస్థకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందరికీ తెలియచేయాలనే ఉద్దేశంతో ప్రజా సంబంధాల శాఖ ద్వారా పలు సామాజిక మాధ్యమాలను రూపొందించి నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో సింగరేణి సైరన్-యూట్యూబ్ చానల్, ఫేస్ బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్, ట్విట్టర్ లాంటి సామాజిక మాధ్యమాలన్నింటినీ ఒకే గొడుకు కిందికి తీసుకొస్తున్నామని వివరించారు. వెబ్‌సైట్‌లో అన్నీ ఒకేచోట కనబడేలా 'సోషల్ మీడియా వాల్'ను రూపొందించామని చెప్పారు. తద్వారా ప్రపంచంలో ఎక్కడున్న వారైనా తమ సంస్థ సామాజిక మాధ్యమాలన్నింటినీ ఒకే చోట వీక్షించే అవకాశం కలుగుతుందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఎస్టీపీపీ ద్వారా జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తి, సింగరేణీ ఉద్యోగులు, కార్మికులతోపాటు పరిసర ప్రాంత వాసుల కోసం తీసుకుంటున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, సింగరేణి సేవా సమితి ద్వారా చేపడుతున్న వివిధ శిక్షణా కార్యక్రమాల వివరాలతోపాటు వివిధ సామాజిక ప్రయోజన అంశాలను ఈ మాధ్యమాలలో ఎప్పటికప్పుడు అప్ లోడ్ చేస్తామని చెప్పారు. వెబ్‌సైట్ హోమ్ పేజీలో 'సోషల్ మీడియా వాల్' పేరుతో ఉన్న బటన్‌ను క్లిక్ చేస్తే సింగరేణి మొత్తం సమాచారాన్ని పొందడానికి, అవసరమైనవి డౌన్ లోడ్ చేసుకోవడానికి వీలు కలుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

'24 గంటల కరెంటు'కు ఏడాది పూర్తి

- ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ రఘుమారెడ్డి


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా విషయంలో ఏడాది కాలాన్ని విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి అన్నారు. వ్యవసాయ రంగానికి సైతం 24 గంటల విద్యుత్ సరఫరాతో అన్ని రంగాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించటం ద్వారా రాష్ట్రం అనేక రికార్డులను సష్టించిందని ఆయన తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం సంస్థ డైరెక్టర్‌లు టి. శ్రీనివాస్, జె శ్రీనివాసరెడ్డి తదితరులు సీఎమ్‌డీని కలిశారు. సంస్థ సాధించిన విజయాలకు గుర్తుగా వారు కేక్ కట్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా.. 11.09.2018న రాష్ట్రంలో 10,818 మెగా వాట్ల గరిష్ట డిమాండ్‌ను, 09.10.2018న 6,961 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌నూ ఎదుర్కొ న్నామని ఈ సందర్భంగా సీఎమ్‌డీ తెలిపారు. 09.10.2018న 233 .44 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేశామని వివరించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో గత వేసవిలో 2,958 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ఉన్నప్పటికీ, ఎలాంటి అంతరాయాలు లేకుండా సరఫరా చేయగలిగామని తెలిపారు. 29.05.2018న 62.83 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేశామని.. రాబోయే వేసవిలో సైతం ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయలగమనే ధీమాను ఆయన ఈ సందర్భంగా వ్యక్తం చేశారు.

ఆధునిక భారత విద్యాప్రధాయిని సావిత్రీబాయి పూలే



వాసిలి సురేష్

"శ్రమించి పని చేయండి.
శ్రద్ధగా అధ్యయనం చేయండి.
మంచి మార్గంలో నడవండి"
- సావిత్రిబాయి పూలే

వెయ్యి మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది. నేడు భారతదేశంలో ఏ మూలకు వెళ్లినా పుస్తకాలతో కళకళలాడుతూ ఆడబిడ్డలు బడికి పోతూ కనిపిస్తారు. కొన్ని వేల సంవత్సరాల నుండి వైదిక బ్రాహ్మణీయ సమాజం స్త్రీలకు, శూద్రులకు, అతి శూద్రులకు చదువును నిరాకరించింది. జ్ఞానానికి వారిని దూరంగా ఉంచింది. కానీ నేడు ఇంతమంది స్త్రీలు, శూద్రులు చదువుకుంటున్నారంటే, ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా, పరిపాలకులుగా అన్ని రంగాలలో సమాన అవకాశాలు పొందుతున్నారంటే దానికి మూల బీజం వేసింది పూలే దంపతులు. వారి త్యాగం, ధైర్యం, పట్టుదల వల్ల స్త్రీలకు, శూద్రులకు చదువు సాధ్యమైంది. ఆధునిక భారతదేశంలో శూద్రులకు, అతి శూద్రులకు, స్త్రీలకు విద్య అందించేందుకు తన జీవితాన్ని త్యాగం చేసి కోట్ల మందికి విద్యా ప్రధాయిని అయింది మన చదువుల తల్లి, క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే. 1831వ సంవత్సరం జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖం డాల ప్రాంతంలో శిఖాల గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరం లో గల నాయిగావ్ అనే గ్రామంలో జన్మించింది. తల్లి లక్ష్మీ బాయి, తండ్రి ఖండోజీ. చిన్నప్పటి నుంచే ఆకట్టుకునే మాట తీరు, ధైర్యసాహసాలు, చలాకీతనం, తెలివితేటలు, చురుకు దనం ఆమె సొంతం. 9 ఏండ్ల వయసులో పన్నెండేండ్ల జ్యోతిరావుకిచ్చి వివాహం జరిపించారు. ఆడ దిక్కులేని ఆ కుటుంబ బాధ్యత చిన్న వయసులోనే సావిత్రిబాయి అందు కుంది. తన భార్య సావిత్రీబాయి ఎందుకు చదువుకోకూ డదు? అని ఆలోచించిన జ్యోతిరావు పూలే తానే స్వయంగా సావిత్రికి చదువు నేర్పాడు. ఈ విధంగా సావిత్రి మరాఠీ, ఆంగ్లంలో రాయడం నేర్చుకుంది. సావిత్రిబాయి చదువు నేర్చుకోవడం ఆమె జీవితానికి గొప్ప మలుపు. అంతేకాక భావి భారతానికి సరైన మార్గం చూపిస్తూ చరిత్ర కెక్కింది. అది ఆమె వేసిన తొలి అడుగు అని చె ప్పవచ్చు. 20 ఏండ్ల వ యసులో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులైన పూలే తన మిత్రుల సహాయంతో 1848 జనవరి 1న పూనాలోని, బుధవార పేట నివాసి భిడే గహంలో బాలికా పాఠశాలను ప్రార ంభించారు. బాలికా విద్య కోసం భారతదేశంలోనే తొలిసారిగా స్థాపించిన ఈ పాఠశాలలో ముఖ్య ఉపాధ్యాయునిగా సావిత్రిబాయి నియమింపబడింది. ఈ విధంగా సావిత్రీబాయి భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయునిగా చరిత్రకెక్కింది.

> **చదువు నేర్చుకోవడం సావిత్రీబాయి జీవితానికి గొప్ప మలుపు. 20 ఏండ్ల వయసులో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులైన పూలే తన మిత్రుల సహాయంతో 1848 జనవరి 1న పూనాలోని, బుధవార పేట నివాసి భిడే గహంలో బాలికా పాఠశాలను ప్రారంభించారు. బాలికా విద్య కోసం భారతదేశంలోనే తొలిసారిగా స్థాపించిన ఈ పాఠశాలలో ముఖ్య ఉపాధ్యాయునిగా సావిత్రీబాయి నియమింపబడింది. ఈ విధంగా సావిత్రీబాయి భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయునిగా చరిత్రకెక్కింది.**

ఆడ పిల్లలు చదువుకోవడం చెడి పోవడానికి తొలిమెట్టుగా భావించి, తమ ఆడబిడ్డలను పాఠశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు నిరాకరించేవారు. బ్రాహ్మణవాదుల, సంప్రదాయవాదుల అవహేళనలు ప్రతికూల పరిస్థితుల మధ్య సావిత్రీబాయి ముందుకు సాగింది. వారిని ఒప్పిస్తూ, బాలికల అభిమానాన్ని, ప్రేమను సంపాదించి, వారిని పైకి తీసుకు రావాలని దృఢ సంకల్పంతో బాలికల మానసిక వికాసానికి తన శక్తియుక్తులను వెచ్చించింది. ఇదేవిధంగా బాలికల పాఠశాలలను ఒకవైపు విస్తృత పరుస్తూనే, మరోవైపు1852 మార్చి మూడవ తేదీన అస్పృశ్యుల కోసం (దళితుల కోసం) బేతాళపేటలో పూలే ఒక పాఠశాలను ప్రారంభించాడు. ఇది భారతదేశంలో అస్పృశ్యుల కోసం ప్రారంభించిన తొలి పాఠశాల. అలా ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా సావిత్రిబాయి నియమింపబడ్డారు. అస్పృశ్యత అనే దుర్మార్గ విధానాన్ని ఎదిరించి సమానత్వం కోసం కృషి చేయాలన్న సద్బుద్ధితో మహాత్మ జ్యోతిరావుపూలే ఈ పాఠశాలను స్థాపించాడు. సావిత్రీబాయి పూలే 1852 జనవరి 14న "తిలగుండ్ సమారోహ్" అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఇది భారతదేశంలో స్థాపించిన తొలి మహిళా సంస్థ. పూలే స్థాపించిన పాఠశాలలన్నింటినీ తీర్చిదిద్ది, వాటిని విజయపథంలో నడిపించడంలో సావిత్రి కృషి అనన్య సామాన్యమైనది. భర్త చేసే సామాజిక కార్యక్రమాలలో అత్యధిక భారం సావిత్రీబాయి మోసింది, సమాజ సంస్కరణ, సామాజిక సేవలను ఎంచుకున్న పూలే దంపతులు ఎదుర్కొన్న కష్టాలు, వారికి ఎదురైన దుర్భర పరిస్థితులు ఎంతో భయంకరమైనవి. స్త్రీ విద్య, సమాజ సేవ ఉన్నత లక్ష్యాలను తలకెత్తుకున్న సావిత్రీబాయి తను ఎటువంటి కష్టనష్టాలు ఎదురైనా తన లక్ష్యాన్ని వదులుకోలేదు. తన బుద్ధి, తన జ్ఞానం బహుజనులకు, ప్రజలకు ఉపయోగపడాలనే లక్ష్యంతో తన జీవిత ప్రయాణంలో కొనసాగింది. 1876-77 కాలంలో మహారాష్ట్రలో భయంకరమైన కరువు వచ్చింది. మహాత్మా పూలే ఇటువంటి పరిస్థితుల్లో ఎక్కడికక్కడ భోజన కేంద్రాలు ప్రారంభించి అన్నదానం కొనసాగించారు. వారి పాఠశాలల్లో చదివే రెండువేల విద్యార్థులకు ఆహారం ఉచితంగా అందించే బాధ్యత సావిత్రీబాయి తీసుకుంది. కరువు కాలంలో సావిత్రీబాయి కొన్ని వందల మందికి ప్రాణదానం చేసిందంటే అతిశయోక్తి కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆనాటి మహారాష్ట్ర సమాజానికి సావిత్రీబాయి తల్లిలా మాతత్వంపంచింది.

1853 జనవరి 28 బాల హత్య ప్రతిబంధక్ గహాన్ని స్థాపించింది. ఒక్క సంవత్సరంలోనే 32 మంది గర్భవతులకు పురుడు పోసింది. 56 మంది వితంతువులు తమ బిడ్డలను తమ ఇంటి ఆవరణలోని ఊయల తొట్టిలో వేసి వెళ్లారు. ఆనాటి సామాజిక కట్టుబాట్లకు విరుద్ధంగా గర్భవతియై భయంతో ఆత్మహత్య చేసుకోబోతున్న బ్రాహ్మణ వితంతువును రక్షించి తమ ఇంట్లో ఆశ్రయం కల్పించారు. ఆ బ్రాహ్మణ వితంతువు ఖాసీబాయి కన్న బిడ్డ యశ్వంతరావును దత్తత తీసుకొని చదివించి డాక్టర్‌ను చేసి, జ్యోతిబా మరణాంతరం సత్యశోధక్ సమాజ్‌ను నడిపిన ధీశాలి సావిత్రిబాయి పూలే. మహాత్ముడు జ్యోతిబా పూలే అంత్యక్రియలను తానే నిర్వహించిన సంఘసంస్కర్త. 1896లో వచ్చిన కరువు లోను తాను ముందుండి సహాయ కార్యక్రమాలను నిర్వహించిన మానవతామూర్తి. కరువు తర్వాత 1897లో పూణే ప్రాంతాన్ని ప్లేగు మహమ్మారి చుట్టుముట్టింది. ప్రాణాంతక వ్యాధి అని తెలిసినా సాటి మనుషులకు సహాయం చేయకుండా ఉండలేనితనం వల్లనే ప్లేగు సోకిన బాలుడిని భుజాన వేసుకొని ఆసుపత్రిలో చేర్చింది. ఆ బాలుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మాతృమూర్తి సావిత్రీబాయి ప్లేగు బారినపడి మరునాడు ఉదయం తుది శ్వాస విడిచింది. ఒక ఊపిరి ఆగిపోయింది. భౌతికంగా విశ్వంలో కలిసిపోయింది. ప్రజల ఉన్నతిని కాంక్షించిన పూలే దంపతుల కృషి కోట్ల మంది విద్యావంతులను ప్రజ్వలింప చేస్తూనే ఉంది.

శూద్రులైన మగవాళ్లు చదువుకోవడమే తప్పైన కాలంలో స్త్రీగా సావిత్రీబాయి చదువుకుంది. బ్రాహ్మణ వితంతువులకు ఆసరాగా ఉండటమే కాకుండా వారికి గుండు గీయించడానికి వ్యతిరేకంగా మంగలి పని వారి సమ్మెకు నాయకత్వం వహించింది. భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయిని, ఆపన్నులను అక్కున చేర్చుకున్న కరుణామయి సావిత్రీబాయి. మరాఠా సాహిత్యంలో తొలితరం రచయిత్రి ఆమే కావడం విశేషం. నేడు మనమందరం నిజమైన చదువుల తల్లి సావిత్రీబాయి పూలేని స్మరించుకోవాలి. ఆమెను అవగాహన చేసుకోవాలి. సావిత్రీబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగాజరుపుకోవాలి.

సెల్ : 9494615360

తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే



రవికుమార్ సంగనమోని

బలహీనులారా బాధితులారా
సోదరులారా లేవండి
బానిసభావ సంకెళ్ళను
తెంచుకుని కదలండి!
శతాబ్దాల అనంతరం చదువు
మనచేతికందే
చదువుదాం మన బిడ్డలా
చక్కగా చదివించుదాం!
విజ్ఞానంతో మన బతుకులను
మనమే మార్చేసుకుందాం,
చీకటిలో వేదనతో ఇన్నాళ్ళు
మునిగిపోయాం,
నిద్రలోంచి మేల్కొందాం, ధిక్కరించి
నేర్చుకుందాం!!

ఎన్నో శతాబ్దాలపాటు చదువుకు దూరమైన, అత్యధిక ప్రజలనుద్దేశించి చెప్పబడిన పైవచన కవిత, సావిత్రీబాయి పూలే కలం నుండి జాలువారిన విజ్ఞాన సుగంధం. ఆమె మరెవరో కాదు ప్రముఖ సంఘసంస్కర్త, మహాత్మా జ్యోతిరావు పూలే అర్ధాంగి. బలహీనవర్గాల చైతన్యం, అంధ విశ్వాసాల నిర్మూలన కోసం తన భర్త చేసిన పోరాటాలకి జీవితాంతం చేయూతనిచ్చి, బహుజనుల ఆనందంలోనే తన ఆనందాన్ని వెతుక్కున్న సామాజిక అభిలాషి. ధర్మం పేరిట అణగారినవర్గాల ప్రజలకు అనేక శతాబ్దాలపాటు ఈ దేశం విద్యను నిషేధించింది. వారిలో విద్యాచైతన్యాన్ని కలుగకుండా ఎన్నో ఆంక్షలు విధించింది. మతగ్రంథాలను రహస్యంగా ఎవరైనా చదివినా, వారి నాలుక కత్తిరించడం, ఒకవేళ వింటే చెవుల్లో సీసం పోయడం, శిరస్సు ఖండించడం వంటి శిక్షలు విధించాలని మనువాదం శిక్షాస్మృతిని ఏర్పరచింది. అలాంటి పరిస్థితుల్లో, నిరక్షరాస్యులైన సావిత్రీబాయి పూలే, భర్త పర్యవేక్షణలో విద్యనేర్చుకుని దాన్ని మహిళా చైతన్యం కోసం ఉపయోగించింది. సమాజం ఎన్ని నిషేధాలు విధించినా మొక్కవోని దీక్షతో భర్త ఏర్పరచిన బాలిక విద్యాలయంలో స్వయంగా ఉపాధ్యాయురాలై ఒక కొత్త శకానికి నాంది అయ్యింది. మహిళా చైతన్యానికి పునాదులు వేసింది. ఆమెనే లేకుంటే విద్యనభ్యసించాలన్న ఆలోచన పుట్టడానికి ఇంకా ఎన్ని దశాబ్దాలు పట్టేదో? బాలికలకు విద్య నేర్పాలనే ఆమె సంకల్పం ఎంత గొప్పదో, దాన్ని అమలు చేస్తున్నప్పుడు సమాజం నుండి ఎదుర్కొన్న అవమానాలు, భౌతిక దాడులూ అంతే తీవ్రమైనవన్న విషయం గుర్తుంచుకోవాలి. అయినప్పటికీ భౌతిక దాడులను సైతం బహుమానాలుగా భావించి ఆశయసాధనలో మునగడం ఆమెకు తప్ప, మరెవరికి సాధ్యం కాదేమో. అలాంటి పరిస్థితుల్లో ప్రారంభమైన మహిళా విద్య నేటివరకు ఎన్నో సత్ఫలితాలు అందించింది. నాడు ఎన్నో అవమానాలను సైతం ఆమె చిరునవ్వుతో ఎదుర్కొని ముందుకు సాగబట్టే అబ్బాయిలతో సమంగా, ధీటుగా బాలికలు నేడు చదువుకోగల్గుతున్నారు.

ఆమె అందించిన విద్య ద్వారా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఉపాధ్యాయులుగా, కవులుగా, రచయితలుగా, వైద్యులుగా, న్యాయవాదులుగా, రక్షకభటులుగా, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా, శాస్త్రవేత్తలుగా, ఇలా అన్ని రంగాల్లో రాణిస్తూ నవసమాజ నిర్మాణం కోసం ఎంతో కృషి చేస్తున్నారు.

2017 నవంబర్ 28న హైదరాబాద్‌లో ప్రారంభమైన చారిత్రాత్మక ప్రాజెక్టు, మెట్రోరైలును నడిపిన వ్యక్తులు ముగ్గురూ నారిమణులే కావడం, యావత్ మహిళా లోకానికే స్ఫూర్తి. ఉత్సాహం కలిగించే ఇటువంటివెన్ని చెప్పుకున్నా అవన్నీ నాణానికి ఒకపార్శ్వం. చాందస భావాలకి లోనవుతూ విద్యచైతన్యానికి ఆమడదూరంలో ఉన్నవారెందరో నేటికీ ఉన్నారు. విద్యప్రాధాన్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక, చదువుల్లో రాణిస్తున్న బాలికలనెందరినో విద్యకు దూరం చేస్తున్న తల్లిదండ్రులను మనం చూస్తున్నాం. వారలా చేయడానికి కారణాలు

1.బాలికలు చదవడం వలన తమకు ప్రయోజనం లేదని భావించడం.
2.బాగా చదివిస్తే పెండ్లి చేసేనాడు ఎక్కువ కట్నకానుకలు ఇవ్వాల్సిరావడం.
3.అమ్మాయిలకు అక్షర జ్ఞానం వస్తే చాలు అనుకోవడం.

వివిధ పరిస్థితుల కారణంగా తల్లిదండ్రులు అలా భావించినప్పటికీ అది సరికాదనే చెప్పాలి. 'ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు' అని ఊరికే అనలేదు. ఒక అమ్మాయి చదువుకోవడం వలన భవిష్యత్‌లో ఆమె తన కుటుంబాన్నంతటినీ తన తెలివితో తీర్చిదిద్దుకుంటుంది. ఉన్నత చదువులు చదివి తమ కాళ్లపై తాము నిలబడటమే కాక, కుటుంబాలను మగవారికన్నా ధీటుగా పోషిస్తూ, భరోసాగా నిలిచిన మహిళలనెందర్నో చూడవచ్చు. విద్య అందించే నైతికస్థైర్యం మనం అంచనావేయలేం. స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటూ, వ్యక్తిగతంగా ఎదగడానికి తద్వారా సామాజిక చైతన్యానికి విద్య, మహిళకు ఒక ఆయుధంగా పనిచేస్తుంది. పురుషులతో పోలిస్తే మహిళలు మానసికంగా ఏమాత్రం తక్కువ కాదనే విషయం, నిరంతరం నిరూపితం అవుతూనే ఉంది. చరిత్రలో ఎంతోమంది మగువలు తమ ధైర్యసాహసాలతో, ప్రతిభాపాటవాలతో, నేర్పుతో రాజ్యాలను పాలించారని చదువుకున్నాం. రాచరిక పాలన అంతమయ్యాక కూడా రాజకీయాల్లో రాణించిన, రాణిస్తున్న మహిళలనెందరినో చూశాం, చూస్తూనే ఉన్నాం. దీనంతటికీ కారణం వారిపై వారికి నమ్మకం, సామాజిక, రాజకీయ చైతన్యం, ధైర్యసాహసాలే. వీటిని అందించింది నిస్సందేహంగా విద్యే. తీవ్ర అవమానాలను బహుమానాలుగా భావించి విద్యను ప్రసాదించిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి పూలే అన్న విషయం నేడు ఎంతమందికి తెలుసో ఆత్మపరిశీలన చేసుకోవాలి. నేడు మహిళలు అనుభవిస్తున్న ఫలాలన్నీ ఆ విద్యాప్రధాత త్యాగాల ప్రతిఫలం అనే విషయం గుర్తించాలి. కాబట్టి మూలాలు ఎప్పటికీ మరువకుండా ఆమె నాడు విద్యనందించడానికి తపించిన వైనాన్ని కండ్లకు కట్టినట్టుగా చూపెట్టాల్సిన బాధ్యత సమాజం మీద ప్రేమ ఉన్న ప్రతీ ఒక్కరూ తీసుకోవాలి. ఇలాంటి మహనీయుల జీవిత చరిత్రలు అధ్యయనం చేయాలి, బయటికి తీసుకురావాలి. వారి ఆశయాలను సాధించడానికి జనాల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తించి, సమసమాజ నిర్మాణానికి తమవంతు ప్రయత్నం చేసే అవకాశాన్ని వదులుకోకూడదు.

ఎన్నో ఆటంకాలు ఎదుర్కొని సావిత్రిబాయి బాలికలకు విద్య నేర్పడానికి ప్రధాన కారణం మహిళలు స్వేచ్ఛ, సామాజిక చైతన్యం, హక్కులు, సమన్యాయం వంటి వాటి కోసం ఎవరిపై ఆధారపడకుండా తమంతట తాము పోరాడి సాధించుకోవడం కోసం. ఈ అంశాల సాధన కోసం రచనలతో నిరంతర పోరాటం చేసిన వారిలో ప్రముఖవ్యక్తి గౌరిలంకేష్. తన రచనలతో నిత్యం ప్రశ్నిస్తూ అందరిలో చైతన్యాన్ని నింపింది. అలా చేయడాన్ని జీర్ణించుకోలేని మతతత్వశక్తులు ఆమెను భౌతికంగా అంతంచేశాయి. సమాజహితం కోరిన ఆమె ఆశయాలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయి. ఆమె రచనలతో స్ఫూర్తి పొంది అన్యాయాలపై పోరాడాల్సిన అవసరం నేడు స్పష్టంగా కన్పిస్తున్నది.

తెలుగు రాష్ట్రాల్లో కూడా ఆమె ఆశయసాధన కోసం పనిచేస్తున్న, పని చేసిన వ్యక్తుల్లో ముఖ్యులు తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం, పీఓడబ్ల్యు సంధ్య, సామాజిక ఉద్యమకారిణి దేవి, అరుణోదయ సాంస్కృతిక నాయకురాలు, గాయని విమలక్క తదితరులు. వీరు పురుషాధిక్య పోకడలకు ధీటైన జవాబు చెబుతూ వివక్షలేని సమసమాజం కోసం విశ్రాంతిలేని పోరాటం చేస్తున్నారు. మహిళా సమాజం కోసం ఇంతగా శ్రమిస్తున్న వీరిని హర్షించాల్సిందిపోయి సామాజిక మాధ్యమాలలో మూర్ఖులు కొందరు అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారింది. అయినా సమాజహితం కోరేవారు కనుక అవమానాలను పంటి బిగువున భరిస్తూ, నాటి సావిత్రీ బాయి పూలే పోరాట స్ఫూర్తిని గుర్తుకు తెస్తున్నారు. ఇలాంటి వారికి సమానత్వం కోరుకునే వారందరూ బాస టగా నిలవాలి. వివక్షకు, అన్యాయాలకు, హింసకు వ్యతి రేకంగా చేస్తున్న వారి పోరాటాలలో కలిసి నడవాలి. రాజ్య పాలనలో కూడా ఎప్పుడైతే మహిళల భాగస్వామ్యం అధి కంగా ఉంటుందో అప్పుడే సావిత్రిబాయి కన్న కలలకి సార్థ కత చేకూరినట్టవుతుంది. మహిళను ఇంట్లో, సమాజంలో చులకన భావంతో చూస్తూ ఆమె మీద ఎన్నో రకాల దాడులకు పాల్పడుతూ వికృతానందం పొందుతున్న వారికి అడ్డుకట్ట వేయాలి. సమానత్వం కోసం కృషి చేయడమే అసలైన మనిషితత్వం అని గుర్తించాలి. సమానత్వ సాధన కోసం పాటుపడటమే చదువులతల్లి సావిత్రీ బాయి పులేకి మనమిచ్చే అసలైన నివాళి.

సెల్ :7893903740

నా దేశం ఎటు పోతుంది?



ఎం.నవనీత

భారతదేశం సకల మతాలకు నిలువ నీడనిచ్చి భిన్నత్వంలో ఏకత్వంగా పిలువబడుతున్న ధన్యభూమి. భారతదేశం సకల సంపదలకు, అష్ట ఐశ్వర్యాలకు నిలువుటద్దం. అవును.. పై మాటలన్ని నిజమే కదా! అందుకోసమే కదా 200 ఏండ్లు పరదేశీయులు మనల్ని పాలించి దోచుకుపోయారు. ఆ తర్వాత మన వాళ్లే మనల్ని దోచుకుంటున్నారు. అయినా ఇక్కడి వనరులకు కొదువలేదు. ఎన్ని భాషలు, ఎన్ని మతాలున్నా మనలో మనకు చిచ్చుపెట్టే నాయకులు లేనంతవరకు అన్నదమ్ములుగా కలిసుంటున్నాం. కానీ ఇప్పుడు మనం ఎటు పోతున్నాం. నాగరికత పెరుగుతున్న కొద్దీ మనలో వివేకం లోపిస్తుందా? లేక మన వినాశనం మనమే కోరుకుంటున్నామా? 70 సంవత్సరాల స్వత్యంత్ర్య భారతదేశంలో ఏం మారింది. రోజురోజుకూ ఆకలి చావులు పెరుగుతున్నాయి. రోజురోజుకూ అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించే తీరు పెరుగుతుంది.

ఒక పూట కడుపు నింపుకొని మిగిలిన రెండు పూటలు పస్తులుండే వారున్న దేశం.. మరోవైపున ప్రపంచ కుబేరుల జాబితాలో మొదటి పది మందిలో ముగ్గురు మనవారే ఉన్నారు. మనల్ని పాలిస్తున్న నాయకుల్లో చాలామంది దొంగలని తెలిసినా ఎందుకు ఎన్నుకుంటున్నాం? ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేక తప్పుదోవ పడుతున్న యువత పెరుగుతోంది. మరోవైపు చుట్టుపక్కల దేశాల చొరబాట్లు ఎక్కువవుతున్నాయి. అసలేం జరుగుతోంది మన దేశంలో..? ఒక నివేదిక ప్రకారం దేశంలో నేటికీ సుమారు 14,51,000మంది కూడు కోసం భిక్షమెత్తుకుంటున్నారు. టీఓఐ 2017లో ప్రచురించిన కథనం ప్రకారం స్లమ్స్‌లలో జీవిస్తున్న వారి సంఖ్య 10 కోట్లు. భారతదేశంలో సుమారు 1.26 కోట్ల మంది బాల కార్మికులుగా జీవిస్తున్నారు. దేశంలో రోజుకు 106 మంది అమ్మాయిలు లైంగికదాడులకు గురవుతున్నారు. అందులో 4:10 మైనర్లే అంటే అర్థం చేసుకోండి. సంవత్సరానికి 200-300 మంది అమ్మాయిలు యాసిడ్ దాడికి గురవుతున్నారు. ఇంకోవైపు ఒక అంచనా ప్రకారం విదేశాలలో దాగిఉన్న నల్లధనం విలువ రూ.90లక్షల కోట్లు. భారతదేశంలో 70శాతం ప్రజలు వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ఇందులో ప్రతి సంవత్సరం 12 వేల మంది వరకు రైతులు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇక మన దేశం ఎటుపోతుందో ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే ముందు మనం మారాలి. మనల్ని పాలిస్తున్న నాయకుల్ని మార్చాలి. నాది, నా వాళ్లు అనే అహాన్ని తీసేసిన రోజు మనం మారుతాం. ప్రభుత్వాలు, నాయకులు వారికి అనుగుణంగా చేసుకునే చట్టాలు కాకుండా దేశంలో ప్రజల అవసరాలకు తగ్గట్టు చట్టాలు చేస్తేనే నిర్మలమైన అవినీతి రహిత దేశాన్ని చూస్తాం.

సెల్ :9505596476

ఆర్థికాభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేయాలి



అన్మిగారి రూఫస్

మోడీ ప్రపంచ సదస్సుల్లో ధైర్యంగా, భాహాటంగా 'యంగ్ ఇండియా' అని చెపుతుండటం మనం గమనిస్తున్నాం. అంటే దేశ జనాభాలో యువతనే ఎక్కువగా వున్నారు. యువత కేవలం పెట్టుబడులను ఆకర్షించడానికే పనికి వస్తోంది, కానీ ఆ పెట్టుబడి, ఉత్పత్తిలో భాగస్వామ్యం కావడానికి అవసరం లేదు అన్నట్టుగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు యువతకు శక్తిని శంకించే విధంగా ఉన్నది. కొన్ని పార్టీలు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం నిరుద్యోగులను నిరంతర ఉత్పత్తిలో భాగస్వామ్యం చేసేది పోయి నిరుద్యోగ భృతితో సరి పెట్టడం సిగ్గు చేటు. నిరుద్యోగులు అంటే అత్యంత శక్తిమంతమైన చదువుకున్న యువత. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించపోగా నిరుద్యోగ భృతి అని మభ్యపెట్టడంతో దేశంలో, రాష్ట్రంలోని యువత నిరాశ, నిర్లిప్తతకు గురవుతున్నది.

యువత ఉత్పాదక శక్తులు, మానవ వనరులు అనే మాటకు అర్థం లేకుండా చేయడం అవమానకరమైన అంశాలుగా చూస్తున్నాం. దేశంలోని మానవ వనరులు, సహజ వనరులు మనకు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలి అని నిష్ణాతులైన వారిని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల్లో యువతను, వారి శక్తియుక్తులను, నైపుణ్యాలను దేశం ఏ విధంగా వినియోగించుకోవాలి? జాతీయోదయంలో యువతను కీలక భూమికగా ఏ విధంగా వాడుకోవాలి? అనే అంశాన్ని పక్కనబెట్టి ప్రభుత్వాలు వారి స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయి. ఐదేండ్ల ప్రభుత్వ కాలాన్ని ఎల్లదీసుకుంటూ పోతే, నేటి యువత శక్తియుక్తులు వృథాగా పోవడమే కాకుండా జాతీయ ఆదాయంలో వారి పాత్ర శూన్యం. యువత శక్తి యుక్తుల్ని వాడుకుని దేశం సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలనే ఉద్దేశం ఏ రాజకీయ పార్టీకి గానీ, రాజకీయ నాయకునికి గానీ లేదు. కేవలం యువతను ఓటు బ్యాంకుగానే చూస్తూ, అవసరమైతే వారి పార్టీ జెండాను మోసే వాడిగానే చూస్తున్నారు గానీ భవిష్యత్ తరాలకు ఉపయోగపడే వ్యక్తిగా చూడటం లేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో మానవ వనరులను ఆర్థిక వనరులుగా మార్చుకుని, ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్న తరుణంలో వాటికి మన దేశం భిన్నం. మన ఆలోచన విధానం భిన్నం. మన పాలకుల దృక్పథం భిన్నం. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాలకు ప్రజలను వనరులను వాడుకుంటున్నారు కానీ వాస్తవ రూపంలో దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కల్గిస్తూ, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా వాడుకోవడం లేదు. దేశంలో ప్రజాస్వామ్యం సమర్థవంతంగా అమలు కావాలంటే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పార్టీల మ్యానిఫెస్టోలకు చట్టబద్ధత కల్పిస్తే తప్ప.. రాజకీయ పార్టీలు ఇష్టం వచ్చినట్టు ప్రజలను మభ్యపెట్టడానికి తప్ప ప్రజల కోసం, ప్రజల ద్వారా, ప్రజలచేత గాని ఏర్పాటు కావు. దేశంలోని, ప్రజలు ఓటర్లు తక్కువ అక్షరాస్యతను, అవగాహన లోపం కల్గివున్నందున కపట రాజకీయ ప్రయోజనాలను అర్థం చేసుకోలేకపోతున్నారు. కాబట్టి ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పార్టీలు ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తూ, డబ్బు, మద్యం, విందులు, వినోదాలవైపు మళ్లిస్తూ, రాజ్యాంగం వారికి కల్పించిన అమూల్యమైన ఓటును దుర్వినియోగం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారు. దేశంలో ఎన్నికలు వస్తున్నాయంటే ప్రజల్లో ఆనందం వెల్లివిరియాలి. ఎందుకంటే గత ప్రభుత్వాలకంటే రాబోయే ప్రభుత్వం మెరుగ్గా, ప్రజలకు మరింత చేరువగా వుండి వేగంగా అభివృద్ధి చెందబోతున్నాం అనే ఆశ రావాలి. కానీ డబ్బుకో, మద్యానికో లేదా ఇతర ప్రలోభాలకో ఎన్నికలు ఉపయోగపడకూడదు. ఇప్పటికే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు పూర్తయినా ముందుముందు రాబోయేదంతా ఎన్నికల కాలం. ఇప్పుడు నిర్లక్ష్యం, ప్రలోభాలకు, లోనైతే వచ్చిన నాయకుడు ఎన్నికల్లో ఖర్చుచేసిన డబ్బంతా పదవిలో వున్న ఐదేండ్లలో తిరిగి సమకూర్చుకునే పనిలోనే వుంటాడు తప్ప ప్రజల ప్రయోజనాలు వారి శ్రేయస్సుపై దృష్టి సారించడు. అభివృద్ధి కుంటుపడుతుంది. కాబట్టి మనం ఎన్నుకునే నాయకుడు మన కష్టసుఖాలు చూసేవాడుగా, అందరికీ అందుబాటులో వుండాలి. ఎలాంటి స్వలాభాపేక్షలేని, వ్యాపారాలులేని వారిని మనం ఎన్నుకొని నవభారత నిర్మాతలమవుదాం. ఇందుకు ఓటు ప్రధాన ఆయుధం. మేధావులైన, విజ్ఞులైన మీరు ఆలోచించి ప్రజాస్వామ్యం ప్రాముఖ్యత, ఓటు హక్కు ప్రాముఖ్యత, ప్రభుత్వ ఏర్పాటుతో ప్రజలకు కలిగే మేలును వివరించాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేకపోతే ఎన్నేండ్లైనా భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా వుంటుంది గానీ అభివృద్ధి చెందిన దేశంగా కనిపించదు. ఓటు విలువను ప్రజలందరికి తెలిపే బాధ్యతను యువత ముందుండి తీసుకుపోవాలి. మన దేశాభివృద్ధిని, ప్రజల నైపుణ్యాలను నూతన ఆవిష్కరణలను ప్రపంచ దేశాల ముందు ఆవిష్కరించి జాతీయ జెండాను ప్రపంచం ముందు రెపరెపలాడించాలి. ప్రపంచంలో మనదేశం వేగంగా అభివృద్ధి చెందిన దేశంగా, అగ్రరాజ్యాల సరసన సమాన హోదా కల్గి ఉండాలని అలాంటి భారతావనిని తనివితీరా చూడాలి. మనుషుల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేని దేశంగా నిలవాలి.

సెల్ : 8555916122

తారలు - రాజకీయాలు



యం.రాంప్రదీప్

సుప్రసిద్ధ బాలీవుడ్ నటి రేఖ 2012లో రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు ఎంపిక కాబడ్డారు. ఆమె తన ఆరు సంవత్సరాల పదవీ కాలంలో 400 రోజులు సమావేశాలు జరిగితే కేవలం 18 రోజులు మాత్రమే హాజరయ్యారు. తన పదవీ కాలంలో ఆమె ఒక ప్రశ్న కూడా అడగలేదు. ఏ ఒక్క చర్చా కార్యక్రమంలో పాల్గొనలేదు. కానీ జీతం రూపంలో దాదాపు కోటి రూపాయిల వరకు ఆమె తీసుకున్నారు. క్రికెట్ దిగ్గజం సచిన్ కూడా కేవలం 29 రోజులు మాత్రమే సమావేశాలకు హాజరయ్యారు.

తారలు రాజకీయాల్లోకి రావడం కొత్తేమి కాదు. అమెరికాలో రోనాల్డ్ రీగన్, ఆర్నాల్డ్ ష్వాజ్‌నెగ్గర్, శ్రీలంకలో మహీంద్ర రాజపక్సేలు సినీ నేపథ్యం నుండి రాజకీయాల్లో చేరి రాణించారు. మన దేశంలో పలువురు తారలు రాజకీయాలని తమ ప్రవృత్తిగా చేపడుతున్నారు. 1967లోనే ప్రముఖ నటుడు కొంగర జగ్గయ్య ఒంగోలు నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. జగ్గయ్య విద్యార్థి దశనుండి పలు సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్నారు. తర్వాత దక్షిణాదిన యం.జి.రామచంద్రన్, ఎన్.టి.రామారావు, జయలలిత ముఖ్యమంత్రులు కాగలిగారు. వారు దేశ రాజకీయాల్లో కూడా కీలక పాత్ర పోషించారు. నటుడిగా మంచి పేరున్న అమితాబ్ బచ్చన్, చిరంజీవి, విజయ్‌కాంత్ వంటి వారు రాజకీయాల్లో పెద్దగా రాణించలేకపోయారు. ప్రస్తుతం అగ్రతారలు రజనీకాంత్, కమల్‌హాసన్, పవన్‌కళ్యాణ్‌లు క్రియాశీలక రాజకీయాల్లోకి రావడంతో వారు ఏ మేరకు రాజకీయాల్లో నిలబడగల్గుతారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. తారలకు అభిమానులే పెద్ద పెట్టుబడి. అయితే వారి అభిమానం ఓటు బ్యాంక్‌గా మారుతుందని ఖచ్చితంగా చెప్పలేం. ప్రస్తుతం ఎన్నికలు ఖరీదైన వ్యవహారమైంది. కాబట్టి యువత పెద్దగా రాజకీయాలపై ఆసక్తిని ప్రదర్శించడం లేదు. మేధావులు, విద్యార్థులలో చాలామంది కనీసం తమ ఓటుహక్కును కూడా వినియోగించుకోవడం లేదు. అయితే సినీ తారలు రాజకీయాల్లోకి రావడం వల్ల వచ్చే ఎన్నికల్లో బహుముఖ పోటీ ఉంటుంది. సినీ తారల పట్ల యువతరానికి అభిమానం ఎక్కువగా ఉండటం వల్ల యువ అభ్యర్థులు ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. అయితే సినీ ప్రముఖులు అన్నిచోట్ల అభ్యర్థులని నిలబెట్టేకంటే అక్షరాస్యత ఎక్కువగా వుండి, రాజకీయ చైతన్యం ఉన్న నియోజకవర్గాలలో మంచి అభ్యర్థులను నిలబెడితే వారు విజయం సాధించే అవకాశం ఉంటుంది. మంచి అభ్యర్థులకు సినీగ్లామర్ తోడయితే అసెంబ్లీలో వీరి బలం పెరుగుతుంది. అప్పుడు ఏ ఒక్క సాంప్రదాయ పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావలసిన సంఖ్యాబలం తగ్గినా పార్టీ ఖచ్చితంగా తృతీయపక్షంపై ఆధారపడవలసి వస్తుంది. తద్వారా చట్టసభలలో కొన్ని మంచి నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంటుంది. గతంలో 'ప్రజారాజ్యం' పార్టీ ఇటువంటి అవకాశాన్ని కోల్పోయింది. తెలుగు రాష్ట్రాలలో పీడీఎఫ్ అభ్యర్థులు గెలిచి శాసనమండలిలో వివిధ సమస్యలపై తమ గళాన్ని గట్టిగా విన్పిస్తున్నారు. ఈ తరహా అభ్యర్థులు శాసనసభలో కూడా అడుగుపెట్టాలి. తద్వారా రాజకీయాలు కొంతవరకు ప్రక్షాళన అవుతాయి. అప్పుడే తారలు రాజకీయాల్లో తారాజువ్వల్లా గాకుండా, ధృవతారల్లా ప్రకాశించే అవకాశం ఉంటుంది. నటులు స్వల్పకాలిక లక్ష్యాలతో కాకుండా, దీర్ఘకాలిక ప్రణాళికతో ముందడుగువేస్తే మంచి ఫలితాలుంటాయి.

సెల్ :9492712836

ప్రజాస్వామ్యానికి ఈవీఎంలు గొడ్డలిపెట్టు కారాదు



మేరుగు రాజయ్య

ఓటు ప్రజాస్వామ్యానికి పునాది కావాలి. ప్రజల ఓట్లతో ప్రభుత్వం ఏర్పడాలి. అప్పుడే ప్రజాస్వామ్యంపై విశ్వాసం పెంపొంది పరిఢవిల్లుతుంది. బ్యాలెట్ ఓటు స్థానంలో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) ఓటు వచ్చింది. ఈవీఎం ఓటు వలన శ్రమ తగ్గింది. సమయం ఆదా అయింది. ఖర్చు కూడా తగ్గింది. కానీ ఈవీఎంలలో ప్రజల ఓట్లను ట్యాంపరింగ్ చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ఏ యంత్రమైన మానవుడి చెప్పుచేతల్లోనే పని చేస్తుంది. అది శాస్త్ర సాంకేతిక రంగాలలో మానవుడు సాధించిన ప్రగతి. అయితే ఇప్పటివరకు యంత్రాల వినియోగాన్ని అభివృద్ధికి ఉపయోగిస్తున్నారు. అలాగే వినాశనానికీ ప్రయోగిరస్తున్నారు. కానీ ఇప్పుడు హక్కులను కాలరాయడానికి ఈవీఎంలాంటి యంత్రాలను ఉపయోగిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రంలో 2018 డిసెంబర్ 7న జరిగిన శాసనసభ ముందస్తు ఎన్నికల్లో ఈవీఎం ఓట్ల ట్యాంపరింగ్‌లతో అధికార పార్టీ లబ్ధి పొందిందని ఆరోపణలు వచ్చాయి. అదే క్రమంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఇతర రాష్ట్రాలలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఈవీఎం ఓట్లతో విపక్ష పార్టీలు విజయం సాధించాయని సమర్థనలు వచ్చాయి. అయితే ఈవీఎంల ట్యాంపరింగ్‌లపై పరస్పర విరుద్ధమైన అభిప్రాయలను సాధారణమైనవిగా పరిగణించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమవుతుంది. ఎల్బీనగర్ శాసనసభ నియోజకవర్గంలో "తెలంగాణ ప్రజల పార్టీ" అభ్యర్థిగా పోటీ చేసిన జస్టిస్ బి.చంద్రకుమార్ తను వేసిన ఓటు, తన కుటుంబ సభ్యులు వేసిన ఓట్లు తన గుర్తుపై పడలేదని ప్రకటించారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని అందోళన వ్యక్తం చేశారు.

అమెరికాలో 1890న ఆల్ ప్రెడ్ జెగిలెస్పీ, జాకబ్ మైయర్స్‌లు సంయుక్త కృషితో మెకానికల్ ఓటింగ్ మిషన్‌ను తయారుచేశారు. 1980లో ఎంబి.హనీఫా ఈవీఎంకు రూపకల్పన చేసి ప్రదర్శించారు. 1989లో "భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ (బీఈఎల్), ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లు ఈవీఎంను ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌గా ఉపయోగించుకునే అవకాశం ఉన్నదని తేల్చి చెప్పాయి. తరువాత ముంబాయి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లోని ఇండస్ట్రియల్ డిజైన్ సెంటర్ విభాగానికి చెందిన అధ్యాపకుల బందం ఈవీఎంలను ప్రయోగాత్మకంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్‌కు ఉపయోగించారు. 1982లో కేరళలోని నార్త్ పరావుర్ శాసనసభ నియోజకవర్గంలో మధ్యంతర ఎన్నికల్లో కొన్ని పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలను ఉపయోగించారు. తరువాత రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఢిల్లీలలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాలలో ఉపయోగించారు. 1999లో గోవాలో జరిగిన శాసనసభ ఎన్నికల్లోను, 2003లో దేశవ్యాప్తంగా జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ ఈవీఎంలను ఉపయోగించారు.

2010లో డాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి జనతాపార్టీ అధ్యక్షుడిగా ఈవీఎంల ట్యాంపరింగ్‌పైన 'సదస్సు' నిర్వహించారు. ట్యాంపరింగ్ జరుగకుండా సాంకేతికంగా తీసుకుంటున్న చర్యలపై భారత ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలని కోరారు. 2010 ఏప్రిల్‌లో హరికెప్రసాద్ బందం ఈవీఎంలతో ట్యాంపరింగ్‌కు పాల్పడే అవకాశాలను ప్రదర్శలతో విశదీకరించారు. రాజేంద్ర సత్యనారాయణ్ గిల్డా అనే వ్యక్తి ఈవీఎంలో ఓటర్ వేసిన ఓటును ధృవీకరించుకోవడానికి ప్రదర్శన ప్రింటర్ విధానాన్ని అనుసంధానంగా ఏర్పాటు చేయాలని "సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం (పిల్) వేశాడు. పిల్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు మూడు నెలలలోగా వివరణ ఇవ్వాలని తేది 25-7-2011న భారత ఎన్నికల కమిషన్‌కు సూచించింది. డాక్టర్ సుబ్రహ్మణ్య స్వామి ఈవీఎంలపై ఢిల్లీ హైకోర్టులో వేసిన కేసు విచారణ జరిపి తేది17-1-2012 తీర్పు చెప్పింది. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉన్నదని అభిప్రాయపడింది. అలాగే ఎలక్షన్ కమిషన్‌కు ఈవీఎంల వాడకంపై ఏవిధమైన మార్గదర్శకాలు ఇవ్వలేమని, అయితే అన్ని పక్షాలతో సంప్రదింపులు జరిపి ఈవీఎంలను ఉపయోగించుకోవాలని తీర్పు చెప్పింది. ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలుగా సుప్రీంకోర్టులో నమోదుచేశారు. అప్పుడు భారత ఎన్నికల కమిషన్ న్యాయవాది ఆశోక్ దేశాయ్ డివిజన్ బెంచ్‌ల జస్టిస్ పి.సదాశివం, జస్టిస్ రంజన్ గోగాయ్‌లకు వివరణ ఇచ్చారు. ఈవీఎంలకు అనుసంధాంగా వీవీపీఏటీ (ఓటర్ వెరిఫైడ్ పేపర్ అడిట్ ట్రైల్)లను ఏర్పాటు చేయబోతున్నామని, 2013 జనవరి వరకు నివేధించుతామని వివరణ ఇచ్చారు. మొదటగా మద్రాస్ ఐఐటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ పివి. ఇందర్ సేన్ అధ్వర్యంలో సాంకేతిక అధ్యాపక బందం ఈవీఎంలకు అనుసంధానంగా వీవీపీఏటీలను వినియోగించుకోవచ్చునని నివేధించింది. ఫీల్డ్ ట్రయల్స్‌గా వీవీపీఏటీలను తేది 26-7-2011లో జమ్ముకాశ్మీర్‌లోని లడాక్ అనే ప్రాంతంలోను, కేరళలోని తిరువనంతపూర్‌లో ప్రయోగాత్మకంగా వినియోగించారు. సుప్రీంకోర్టు కూడా విచారణ జరిపి ఈవీఎంలకు అనుసంధానంగా వీవీపీఏటీలను వినియోగించాలని తీర్పు తేది 8-10-2013న తీర్పు చెప్పింది. పోలింగ్‌స్టేషన్లలో ఈవీఎంలో తనకు నచ్చిన ఓటు గుర్తుపై బటన్ నొక్కిన తరువాత సదరు ఓటరు దవీకరించుకోవడానికి వీవీ పీఏటీలోని ఏడు సెకన్ల వ్యవధిలో ప్రదర్శించే గుర్తు ను పోల్చుకోవచ్చును. కాని ఎంతమంది ఓటర్లకు ఆ చైతన్యం ఉంటుందన్నదే వేయ్యిన్నొక ప్రశ్న? అ లాగే ఈవీఎం ట్యాంపరింగ్‌పైన జస్టిస్ బి.చంద్ర కుమార్ చేసిన ఆరోపణలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఆపద మొక్కుల చందంగా అన్ని రాజకీయ పార్టీలు ఈవీఎంల ఓటింగ్‌ను వ్యతిరేకిస్తున్నాయి. సాంకేతిక నిపుణులు కూడా ట్యాంపరింగ్ నిజమేనంటున్నారు. టీవీ చానెళ్ల ఫోన్ సంభాషణలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కూడా ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగే అవకాశం ఉన్నదని ఒప్పుకున్నాడు. మన భారత దేశంలో సార్వత్రిక ఎన్నికల విధానంలో ధన బలం, మంద బలం ఉన్నవారే అధికారంలోకి వస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆచరణలో కూడా కోట్ల రూపాయలను ఖర్చు పెట్టే స్థోమత ఉన్న అభ్యర్థులకే ప్రధాన రాజకీయ పార్టీలు 'బి' ఫారం ఇస్తు న్నాయి. దేశ సేవ, ప్రజా సేవ దృక్పథం గలవారు ధైర్యం చేసి ఎన్నికల్లో పోటీ చేస్తే వాళ్ల డిపాజిట్లే గల్లంతవుతున్నాయి.మణిపూర్ రాష్ట్రంలో సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టానికి (ఐఎఫ్ఎస్పీ)కి వ్యతిరేకంగా 16 ఏండ్లు అమరణ నిరాహారదీక్ష చేసిన ఇరోమ్ షర్మిల బాల్ నియోజక వర్గంలోఎమ్మెల్యేగా పోటీ చేస్తే కేవలం 90 ఓట్లు మాత్రమే వచ్చినవి. గుడ్డికంటే మెల్ల నయమన్న చందంగా అప్పుడప్పు డూ ప్రగతి సాధకులు, ప్రజాస్వామ్యవాదులు కూడా ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈవీఎంల ఓటిం గ్‌పై రాజకీయాలకు అతీతంగా చర్చించాలి. ఈవీఎంల ట్యాం పరింగ్ ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు కాకుండా చర్యలు తీసు కోవాలి. ప్రజాస్వామ్యానికి ఓటును పునాది చేయాలి. ఓటు ప్రజాస్వామ్య పరిరక్షణకు అంకుశంగా ఉపయోగపడేలా పూనుకోవాలి.

సెల్ : 9441440791

రచయితలకు సూచనలు

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. ప్రత్యేక సందర్భానికి సంబంధించిన వ్యాసమైతే దానిని గురించి కవరింగ్ లెటర్ రాయండి. వ్యాసం మొదటి పేజీ మీద పంపిస్తున్న తేదీ వేయండి.

వ్యాస రచయితలు తమ వ్యాసంతోపాటు పూర్తి పోస్టల్ చిరునామా కూడా పంపించాలని కోరుతున్నాం. ఇప్పటికే వ్యాసాలు పంపినవారు కూడా తమ అడ్రస్‌లు పోస్టల్ ద్వారా గానీ, మెయిల్ ద్వారా గానీ పంపించాలని మనవి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228

నవచిత్రం

అమ్మాయిలందరు నా కోసమే పుట్టలేదు


'మిస్టర్ మజ్ను'లో అఖిల్


'ప్రపంచంలో ఉన్న అమ్మాయిలందరు నా ఒక్కరి కోసమే పుట్టలేదు. వాళ్ళకి ఓ లైఫ్ ఉంటుంది. దాన్ని నేను గౌరవిస్తాను' అని అంటు న్నారు అఖిల్. వెంకీ అట్లూరి దర్శకత్వంలో అఖిల్ అక్కినేని, నిధి అగర్వాల్ జంటగా 'మిస్టర్ మజ్ను' చిత్రంలో నటిస్తు న్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్పీ పతాకంపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఈ చిత్ర టీజర్ని విడుదల చేశారు. ఇందులో 'లవ్ ఫెయిల్ అయినప్పుడు స్ట్రెస్ను కంట్రోల్ చేయడానికి చాక్లెట్లు తీనేదాన్ని' అని ఓ అమ్మాయి చెబితే, 'ఆ రోజుల్లో చాక్లెట్తో పని అయిపోయింది. కానీ ఈ రోజుల్లో ఉన్న స్ట్రెస్ లెవల్స్కి హ్యూమన్ టచ్ కావాలి' అని అఖిల్ చెప్పే డైలాగ్ ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'యూత్ఫుల్ ఎంటర్టైనర్గా సినిమా తెరకెక్కుతుంది. ఇటీవల విడుదలైన 'ఏమైనదో.. ఏమైనదో..పలుకు మరచినట్టు పెదవికేమైనదో..', 'మిస్టర్ మజ్ను..' పాటలకు శ్రోతల నుంచి విశేషమైన స్పందన లభించింది. తాజాగా న్యూ ఇయర్ గిఫ్ట్గా విడుదల చేసిన టీజర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో అఖిల్ వేసే స్టెప్పులు, యాక్షన్, ఆయన లుక్ అలరిస్తున్నాయి. అన్ని వర్గాలను అలరించే చిత్రమవుతుంది. ఈనెల 25న విడుదల చేస్తున్నాం' అని చెప్పింది. నాగబాబు, ప్రియదర్శి, హైపర్ ఆది ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: థమన్, కెమెరా: జార్జ్ సి. విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: అవినాష్ కొల్లా.

నయా చిత్రంలో ఫుట్బాల్ కోచ్


విజయ్

ఇటీవల మురుగదాస్ దర్శకత్వంలో 'సర్కార్'లో నటించి హ్యాట్రిక్ హిట్ని అందుకున్న విజయ్ ఇప్పుడు అట్లీ దర్శకత్వంలో రూపొందే సినిమాతో డబుల్ హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమవుతున్నాడు. అట్లీ దర్శకత్వంలో ఇప్పటికే 'థెరి', 'మెర్సల్' వంటి హిట్ చిత్రాల్లో నటించిన విషయం విదితమే. తాజాగా వీరి కాంబినేషన్లో స్పోర్ట్స్ నేపథ్యంలో నయా చిత్రం తెరకెక్కుతుంది. ఇందులో విజయ్ మహిళా ఫుట్బాల్ టీమ్కి కోచ్గా కనిపించనున్నారట. అంతేకాదు ఇందులో 18 మంది కథానాయికలు నటించే అవకాశం కనిపిస్తుంది. అందులో ఇద్దరు మెయిన్ హీరోయిన్లకు స్కోప్ ఉందని, ఫుట్ బాల్ టీమ్ కోసం 16మంది కథానాయికలను ఎంపిక చేసే అవకాశం ఉందట. అయితే వీరిలో ఎక్కువ భాగం కొత్తవారిని తీసుకునే ఆలోచనలో చిత్ర బృందం ఉందని టాక్. బ్యాక్ డ్రాప్లో విజయ్ ఫుట్బాల్ ఛాంపియన్గా కనిపించనున్నారట. ఎమోషనల్గా సాగే ఆ ఎపిసోడ్ సినిమాకే హైలైట్గా నిలువనున్నట్టు తెలుస్తుంది.

భావోద్వేగభరిత యాత్ర


'యాత్ర'లో మమ్ముట్టి

మాజీ సీఎం డా॥వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జీవితం ఆధారంగా 'యాత్ర' పేరుతో ఓ బయోపిక్ రూపొందుతుంది. వైఎస్.రాజశేఖర్రెడ్డి పాత్రలో మమ్ముట్టి నటిస్తున్నారు. మహి వి రాఘవ్ దర్శకత్వంలో 70ఎంఎం ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశిదేవి రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన 'రాజన్న నిన్నాపగలరా..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. దీనికి మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో నిర్మాతలు మాట్లాడుతూ, 'మడమతిప్పని నాయకుడు వైఎస్ రాజశేఖర్రెడ్డి పాత్రలో మమ్ముట్టి పరకాయ ప్రవేశం చేశారు. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్లుక్, టీజర్, ఫస్ట్ సింగిల్కి తెలుగు ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తుంది. 'భలే మంచి రోజు', 'ఆనందో(బ్రహ్మ' వంటి విజయాల తర్వాత ఈ సినిమా మా బ్యానర్లో హ్యాట్రిక్ హిట్ అవుతుంది. రాజీపడకుండా నిర్మిస్తున్నాం. సినిమాలో ఆద్యంతం ఎమోషన్తో కూడిన పాత్రలు, పాత్ర చిత్రణ కనిపిస్తుంది. తెలుగు ప్రజలందరూ తప్పకుండా చూడవలసిన చిత్రమిది. రాజశేఖర్రెడ్డి రాజకీయ ప్రయాణంలో ఆయన చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుంది. ఆయన పోరాట పటిమ ఎంతో మందికి ఆదర్శం. అలాంటి రాజకీయ ప్రజ్ఞాశాలి పాదయాత్రలో జరిగిన వాస్తవిక, భావోద్వేగ సంఘటనలతో ఈ చిత్రం సాగుతుంది. ఈ సందర్భంగా రెండవ సింగిల్ 'రాజన్న నిన్నాపగలరా..' విడుదల చేశాం. సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించిన ఈ పాటకి కె. సంగీతాన్ని అందించారు. దీనికి మంచి స్పందన లభిస్తుంది. చిత్ర ప్రమోషన్ని డిఫరెంట్గా ప్లాన్ చేస్తున్నాం. ప్రతి ఒక్క తెలుగువాడికి ఈ సినిమా రీచ్ కావాలన్నదే మా లక్ష్యం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి తెలుగు, తమిళం, మలయాళంలో ఏకకాలంలో ఫిబ్రవరి 8న సినిమాని గ్రాండ్గా రిలీజ్ చేస్తున్నాం' అని అన్నారు. రావురమేష్, జగపతిబాబు, సుహాసిని, అనసూయ, పోసాని, సచిన్ కద్కర్, వినోద్కుమార్, జీవా, పృథ్వీ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సత్యన్ సూర్యన్, ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్.




ఆ వార్త నిజమైతే బాగుండు...!

'ఆ బాలీవుడ్ చిత్రంలో నటించబోతున్నట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదు. నన్ను ఎవరూ సంప్రదించలేదు' అని అంటోంది కైరా అద్వానీ. మరి కైరా అద్వానీ ఏ బాలీవుడ్ చిత్రంలో నటించడం లేదు అనే ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది. ఆ వివరాలు చూస్తే.. ఇప్పటికే ఆమె బాలీవుడ్ చిత్రాలు 'కళంక్', 'కబీర్ సింగ్', 'గుడ్న్యూస్'లో నటిస్తూ బిజీగా గడుపుతోంది. తాజాగా దర్శకుడు ఇంతియాజ్ అలీ రూపొందించిన సూపర్ హిట్ చిత్రం 'లవ్ ఆజ్ కల్' సీక్వెల్లో కైరా అద్వానీ హీరోయిన్గా ఎంపికైందంటూ ఓ వార్త ఓ ఆంగ్ల పత్రికతోపాటు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. దీంతో తాజాగా దీనిపై స్పందించిన కైరా 'ఇంతియాజ్ అలీ తర్వాతి సినిమాకి నేను సంతకం చేసినట్టు ఓ వార్తా పత్రిక రాసింది. ఆ వార్తలు నిజం కావాలని నేనూ కోరుకుంటున్నా. కానీ ఈ ప్రచారం వాస్తవం కాదు. పాత్ర కోసం నన్ను ఎవరూ సంప్రదించలేదు' అని పేర్కొంది. ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో కార్తీక్ హీరోగా 'లవ్ ఆజ్ కల్ 2'ని తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో హీరోయిన్గా కైరాతోపాటు సారా అలీ ఖాన్ పేరు కూడా వినిపిస్తోంది. ఇదిలా ఉంటే కైరా అద్వానీ సముద్రంలో ఈత కొడుతున్నట్టు ఉన్న పలు ఫొటోలు ఇప్పుడు సామాజిక మధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఫొటోలను తన ఇన్స్టాగ్రామ్లో కైరా తన అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం కైరా తెలుగులో రామ్చరణ్ సరసన 'వినయ విధేయ రామ' చిత్రంలో నటిస్తుంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 11న విడుదల కానుంది.

కైరా అద్వానీ

కడుపుబ్బ నవ్వించే గోవిందు


సప్తగిరి

కమెడీయన్ సప్తగిరి హీరోగా మారి 'సప్తగిరి ఎక్స్ప్రెస్', 'సప్తగిరి ఎల్ఎల్బీ' చిత్రాల్లో నటించి ఆకట్టుకున్నారు. తాజాగా ఆయన హీరోగా 'వజ్ర కవచధర గోవింద' పేరుతో మరో సినిమా రూపొందుతుంది. వైభవీ జోషి కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాని అరుణ్ పవార్ దర్శకత్వంలో శివ శివమ్ ఫిల్మ్స్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు టైటిల్ని ఖరారు చేసిన సందర్భంగా దర్శకుడు అరుణ్ పవార్ మాట్లాడుతూ, 'ఈ చిత్ర కథకు యాప్ట్ టైటిల్ ఇది. ఇందులో సప్తగిరి పేరు గోవిందు. ఆయనొక ఫన్నీ దొంగ. కానీ తనకో లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్య సాధన కోసం అతనేం చేశాడన్నది సినిమా. కడుపుబ్బ నవ్వించే అంశాలతోపాటు, మంచి యాక్షన్, ఎమోషన్, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయి. అవన్నీ సినిమాలో బాగా కుదిరాయి. సప్తగిరి బాడీ లాంగ్వేజ్కి బాగా సూటయ్యే కథ ఇది' అని అన్నారు. "సప్తగిరి ఎక్స్ప్రెస్' వంటి సూపర్ హిట్ తర్వాత సప్తగిరి, అరుణ్ పవార్ కాంబినేషన్లో సినిమా చేసే అవకాశం మాకు రావడం ఆనందంగా ఉంది. ఇదొక హిలేరియస్ యాక్షన్ ఎంటర్టైనర్. ఇప్పటికే 60శాతం చిత్రీకరణ పూర్తయ్యింది. రాజీపడకుండా నిర్మిస్తున్నాం' అని నిర్మాతలు తెలిపారు.

యదార్థ సంఘటనలతో పలాస 1978


రక్షిత్, నక్షత్ర

రక్షిత్, నక్షత్ర జంటగా కరుణ కుమార్ దర్శకత్వంలో తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో బిగ్రమ్ కృష్ణ ఫిల్మ్స్ పతాకంపై అప్పారావు బెల్లన, అట్లూరి వరప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'పలాస 1978'. త్వరలో ఈ చిత్రం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు కరుణ కుమార్ మాట్లాడుతూ, 'యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఎన్నో చిత్రాలకు రచన, దర్శకత్వ విభాగంలో పనిచేసి ఈ సినిమాతో దర్శకుడిగా మారుతున్నాను. అందరిని ఆకట్టుకునేలా సినిమా ఉంటుంది' అని అన్నారు. 'ఫిబ్రవరి 9న చిత్రీకరణ ప్రారంభిస్తాం. పూర్తిగా ఆంధ్రప్రదేశ్లోనే చిత్రీకరణ, నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకోబోతున్న తొలి చిత్రమిది. బెస్ట్ టీమ్ సినిమాకు కుదిరింది. ప్రేక్షకులకు కొత్త ఫీలింగ్నిస్తుంది' అని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: విన్సెంట్ అరుల్, సంగీతం: రఘు కుంచె, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.

ఆ సినిమాల స్థాయిలో హిట్ ఖాయం


అశోక్ వల్లభనేని

'సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'బాషా', 'నరసింహ' చిత్రాల స్థాయిలో 'పేట' బ్లాక్ బస్టర్ ఖాయం' అని అంటున్నారు నిర్మాత అశోక్ వల్లభనేని. రజనీకాంత్, సిమ్రాన్, త్రిష హీరోహీరోయిన్లుగా విజయ్ సేతుపతి, నవాజుద్దీన్ సిద్ధిఖీ, మేఘా ఆకాష్ ప్రధాన పాత్రధారులుగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పేట'. నిర్మాత అశోక్ వల్లభనేని ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 10న సినిమా రిలీజ్ కానుంది. తాజాగా బుధవారం తెలుగు వెర్షన్ ట్రైలర్ విడుదలైంది. ఈ సందర్భంగా అశోక్వల్లభనేని మీడియాతో మాట్లాడుతూ, 'కండక్టర్ స్థాయి నుంచి సూపర్ స్టార్గా ఎదిగిన రజనీకాంత్కి నేను పెద్ద అభిమానిని. నాకు ఆయనే ఇన్స్పిరేషన్. ఆయన సినిమాను తెలుగులో విడుదల చేసే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఓ పేట నేపథ్యంలో సినిమా సాగుతుంది. యాక్షన్ ఎంటర్టైనర్గా దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు తెరకెక్కించారు. స్వయంగా దర్శకుడు రజనీకాంత్కి పెద్ద అభిమాని. దీంతో ఈ సినిమాలో ఆయన్ని విభిన్నంగా చూపించారు. దాదాపు 20ఏండ్లు వెనక్కి తీసుకెళ్ళారు. యువకుడిగా, వయసు మళ్ళీన వ్యక్తిగా రెండు భిన్న పార్శ్వాలున్న పాత్రలో రజనీకాంత్ అలరించడం ఖాయం. తాజాగా విడుదల చేసిన ట్రైలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతుంది. అనిరుథ్ సంగీతం అందించిన పాటలు అలరిస్తున్నాయి. ఈ నెల 6న చిత్ర ప్రీ రిలీజ్ వేడుకని గ్రాండ్గా నిర్వహించబోతున్నాం. ఇందులో రాజనీకాంత్తోపాటు చిత్ర బృందం పాల్గొంటుంది. ఈ వేడుక సందర్భంగా రజనీకాంత్ చేతుల మీదుగా అనాధశరణాలయాలకు ఆర్థిక సహాయం అందించబోతున్నాం. సినిమాకు యాభై శాతం బిజినెస్ పూర్తయ్యింది. ఎవరూ ముందుకు రాకపోతే స్వయంగా నేనే విడుదల చేయాలనుకుంటున్నా. 'సర్కార్', 'నవాబ్' చిత్రాల్ని విడుదల చేసిన తీరు నచ్చి సన్ పిక్చర్స్ వారు ఎంత మంది పోటీకి వచ్చినా దాదాపు కోటిన్నర తక్కువకే ఈ చిత్ర తెలుగు హక్కులను నాకు ఇచ్చారు. నాపై వారు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తాను. సంక్రాంతి రేసులో పెద్ద సినిమాలు పోటీపడుతున్నాయి. థియేటర్ల కొరత ఉంది. కానీ మొదట లిమిట్ థియేటర్స్లో విడుదల చేసి, టాక్ని బట్టి పెంచుతాం. నిర్మాతగా త్వరలోనే స్ట్రెయిట్ సినిమాను నిర్మించబోతున్నా. కుదిరితే స్టార్స్తో, లేకపోతే కొత్తవారితో ఆ ప్రాజెక్ట్ ఉంటుంది' అని అన్నారు.

ఏవీఎస్ లేని లోటు అలానే ఉంది

మహేష్, ప్రవీణ్, వెంకటేష్, సందీప్, ప్రణతి, అకిల, లావణ్య ప్రధాన పాత్రధారులుగా హాస్యనటుడు ఏవీఎస్ తనయుడు ఏ రాఘవేంద్ర ప్రదీప్ దర్శకత్వం వహించిన చిత్రం 'వైదేహి'. యాక్టివ్ స్టూడియోస్ పతాకంపై ఏ జనని ప్రదీప్ నిర్మిస్తున్నారు. ఏవీఎస్ జయంతిని పురస్కరించుకుని ఈ చిత్ర ట్రైలర్ని బుధవారం విడుదల చేశారు. అతిథిగా విచ్చేసిన ప్రముఖ దర్శకుడు ఎన్.శంకర్ ట్రైలర్ విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ, 'ఏవీఎస్ నాకు మంచి మిత్రుడు. అద్భుతమైన కమెడీయన్. జర్నలిస్ట్గా, కాలమిస్ట్గా కెరీర్ ప్రారంభించి బాపు, రమణల ప్రోత్సాహంతో నటుడిగా మారారు. సినిమాని, సాహిత్యాన్ని ఔపోసన పట్టారు. ఆయన లేని లోటు ఇప్పటికీ అలానే ఉంది. ఏవీఎస్ జయంతి రోజున ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. ట్రైలర్ బాగుంది. హర్రర్ జోనర్ విజయవంతమైనది. సక్సెస్ఫుల్ దర్శకుడిగా నిరూపించుకునేందుకు ప్రదీప్ ఈ జోనర్ని ఎంచుకున్నారు. ట్రైలర్ ముగింపు ఆసక్తికరంగా ఉంది. స్టార్ కాస్ట్లేని సినిమాకు కథ, కథనం ముఖ్యం. ఈ చిత్రంలో అవన్నీ ఉన్నాయి. సినిమా పెద్ద హిట్ కావాలి' అని అన్నారు. 'ఈ సినిమా చేయడానికి కారణమైన మా అమ్మకి థ్యాంక్స్. నాకు ధైర్యాన్నిచ్చి, నా వెనకాల ఉండి ప్రోత్సహిస్తున్న మా మాస్టర్కి ధన్యవాదాలు. నాన్నని గుర్తు చేసుకోవడానికి మంచి సందర్భం కోసం ఎదురుచూస్తున్నా. ఈ సినిమా ట్రైలర్ విడుదల చేయడానికి మంచి సందర్భం నాన్న జయంతి కావడం చాలా హ్యాపీగా ఉంది. సినిమాకు సపోర్ట్ చేసిన ఆర్టిస్టులు, టెక్నీషియన్లందరికీ థ్యాంక్స్. శంకర్ మా ఫ్యామిలీకి క్లోజ్. ఆయన ఈ ట్రైలర్ని విడుదల చేయడం, మా నాన్న వచ్చి రిలీజ్ చేసినట్టే ఉంది' అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రంలో నటించే అవకాశం రావడం పట్ల ఆర్టిస్టులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఏవీఎస్ జయంతి సందర్భంగా ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు కేక్ కట్ చేసి చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొంది.


చక్రవర్తి, పసుపులేటి రామారావు, ఎన్.శంకర్, ఏ రాఘవేంద్ర ప్రదీప్


హరికృష్ణలా కనిపిస్తే సక్సెస్ అయినట్టే


'ఉన్మాది' చిత్ర ఆడియో ఆవిష్కరణ దృశ్యం

ఎన్.ఆర్.రెడ్డి కీలక పాత్ర పోషిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఉన్మాది'. ప్రవీణ క్రియేషన్స్ ప్రై.లి పతాకంపై ఎన్.కరణ్రెడ్డి సమర్పణలో ఎస్. రామా రావు నిర్మిస్తున్నారు. శిరీష హీరోయిన్. డేవిడ్ సంగీతం అందించిన ఈ చిత్ర ఆడియో విడుదల కార్యక్రమం మంగళవారం జరిగింది. పాటలను ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి, ట్రైలర్ని ప్రముఖ దర్శకుడు ఎన్.శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ, 'ఇలాంటి స్టోరీకి, స్క్రీన్ప్లే, డైలాగ్స్ రాసుకుని దర్శకత్వం వహించడానికి చాలా ధైర్యం కావాలి. ఎన్.ఆర్.రెడ్డి ఆ డేర్ చేశాడు. కన్నడలో రాజ్కుమార్ కూడా ఇదే ఏజ్లో హీరోగా పరిచయం అయి పెద్ద స్థాయికి ఎదిగారు. ఇందులో శక్తివంతమైన పోలీస్ అధికారిగా ఆయన అద్భుతంగా నటించాడు' అని అన్నారు. 'నటుడిగా నాకు హరికృష్ణ స్ఫూర్తి. ఈ 'ఉన్మాది' సినిమాలో ఒక్కసారైనా ఆయనలా కనిపించాలని ప్రయత్నించాను. ఒక్క క్షణం అలా కనిపించినా నేను సక్సెస్ అయినట్టే. ఈ సినిమాకు రఘువ ఎంతో సపోర్ట్ చేశారు. నకిరెకల్ ఊర్లో కూడా అందరి సపోర్ట్ బాగుంది. డిఫరెంట్ కథాంశంతో తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఆడియెన్స్కి థ్రిల్నిస్తుంది. సినిమా మంచి విజయం సాధించాలని కోరుతున్నా' అని దర్శకుడు ఎన్.ఆర్.రెడ్డి తెలిపారు. రాజ్కందుకూరి చెబుతూ, 'కాన్సెప్ట్ తగ్గట్టుగా టైటిల్ కుదిరింది. హీరో, విలనిజం చూపించే పాత్రలో ఎన్.ఆర్.రెడ్డి చాలా బాగా నటించాడు. తను మంచి క్రియేటివ్ డైరెక్టర్. టీమ్కి ఆల్ ది బెస్ట్' అని చెప్పారు. 'నాకిది తొలి సినిమా. పాటలు బాగా వచ్చాయి' అని మ్యూజిక్ డైరెక్టర్ డేవిడ్ తెలిపారు. హీరోయిన్ శిరీష చెబుతూ, 'ఇందులో ఓ మంచి పాత్ర పోషిస్తున్నా. దర్శకుడు సినిమాను చాలా బాగా తెరకెక్కించారు. అలరించే చిత్రమవుతుంది' అని చెప్పింది

యాక్షన్ ఎంటర్టైనర్ భగవాన్

రాజీవ్, శృతి జంటగా చందు దర్శకత్వంలో కె.వై. శేఖర్బాబు, టి.నిరంజన్ గౌడ్ సమర్పణలో 9 స్టార్స్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై రాజు. జె, సంగం సందీప్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'భగవాన్'. ఇటీవల ఏర్పాటు చేసిన ప్రెస్మీట్లో అతిథిగా విచ్చేసిన నిర్మాత సాయివెంకట్ మాట్లాడుతూ, 'నిర్మాతలు సినిమా తీయడం మాత్రమేకాదు, విడుదల చేయడం కూడా గొప్ప విషయం. ఈ సినిమా చాలా బాగా వచ్చింది. పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు. 'ఇటీవల విడుదలైన ట్రైలర్కి విశేష స్పందన లభించింది. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్గా తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకుంటుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ నెల 4న సినిమాను విడుదల చేస్తున్నాం. ఆదరించాలని కోరుకుంటున్నాం' అని నిర్మాతలు తెలిపారు. హీరో రాజీవ్ చెబుతూ, 'ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన దర్శక, నిర్మాలకు థ్యాంక్స్' అని తెలిపారు.


'భగవాన్'లో రాజీవ్

నేనూ వాళ్ళ బాటలోనే..

అమీ జాక్సన్



కథానాయికలు ఒక్కొక్కరిగా పెళ్ళి చేసుకుని లైఫ్లో సెటిల్ అవుతున్నారు. గతేడాది సోనమ్ కపూర్, శ్రియా, దీపికా పదుకొనె, ప్రియాంక చోప్రా వరుసగా పెళ్ళిళ్ళు చేసుకున్నారు. వీరి జాబితాలో ఇప్పుడు అమీజాక్సన్ చేరబోతుంది. త్వరలోనే ఆమె బ్రిటన్కి చెందిన వ్యాపారవేత్త జార్జ్ పనాయొటోని పెళ్ళి చేసుకోబోతుంది. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం ఈ ఇద్దరు నిశ్చితార్థం చేసుకున్నారు. జాంబియాలో వీరి ఎంగేజ్మెంట్ జరిగింది. ఈ సందర్భంగా ఒకరికొకరు రింగ్లు మార్చుకున్నారు. ఈ విషయాన్ని స్వయంగా అమీ జాక్సన్ తెలియజేయడం విశేషం. 'జనవరి 1, 2019 మన జీవితాల్లో కొత్త ప్రయాణం. ఐ లవ్యూ. నన్ను ఎల్లప్పుడు సంతోషంగా ఉంచుతున్నందుకు ధన్యవాదాలు' అని తన ప్రియుడు జార్జ్తో కలిసి దిగిన ఓ ఫొటోని అభిమానులతో పంచుకుంది అమీ జాక్సన్. పెళ్ళికి సంబంధించిన సమాచారం వెల్లడించనప్పటికీ త్వరలోనే వీరు ఒక్కటి కాబోతున్నారని తెలుస్తుంది. తమిళ చిత్రం 'మద్రాసపట్టినమ్'తో కథానాయికగా మారిన అమీ జాక్సన్ 2014లో 'ఎవడు' చిత్రంతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. ఆమె నటించిన ఒకే ఒక తెలుగు చిత్రమిది. ఆ తర్వాత 'ఐ', 'సింగ్ ఈజ్ బ్లింక్', 'థెరి', 'దేవి', 'ది విలన్', '2.0' వంటి తమిళ,హిందీ చిత్రాల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం ఆమె చేతుల్లో ఒక్క సినిమా కూడా లేకపోవడం గమనార్హం.

రాఫెల్ మంటలు

(మొదటిపేజీ తరువాయి)

లేదని చెప్పారు. అందుకే ఆయన తన గదిలో ఉండిపోయారని రాహుల్ ఎద్దేవా చేశారు. "పార్లమెంటుకు వచ్చి రాఫెల్‌పై సమాధానం చెప్పేందుకు ప్రధానమంత్రికి ధైర్యం చాలడం లేదు. రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ కూడా సభలో అన్నాడీఎంకే ఎంపీల చాటున దాక్కున్నారు. రాఫెల్ ఒప్పందంలో చాలా లొసుగులున్నాయి. అంతకు ముందు ఈ అంశం లేవనెత్తినప్పుడు కూడా ప్రధాని ఐదు నిమిషాలే మాట్లాడారు. కీలకమైన విషయాలపై తమ ప్రశ్నలకు స్పందన రాలేదు." అని వ్యాఖ్యానించారు. రాఫెల్ జెట్ ఒప్పందానికి సంబంధించిన పత్రాలు అప్పటి రక్షణ మంత్రి, ప్రస్తుత గోవా సీఎం మనోహర్ పారికర్ బెడ్‌రూంలో ఉన్నాయన్న గోవా మంత్రి వ్యాఖ్యలకు సంబంధించిన ఆడియో టేపులను సభలో వినిపించాలని రాహుల్ పట్టుబట్టారు. స్పీకర్ మహాజన్ అందుకు నిరాకరించారు.

దీంతో ప్రతిపక్ష సభ్యులు బిగ్గరగా నినాదాలు చేశారు. అందుకు ప్రతిగా అధికార పక్ష సభ్యులు కూడా గట్టిగా అరిచారు. దాంతో సభ నిర్వహణలో స్పీకర్‌కు కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. వెంటనే స్పీకర్ సభను మధ్యాహ్నం 2.30 గంటలకు వాయిదా వేశారు. అనంతరం సభ పున్ణప్రారంభమయ్యాక రాఫెల్ అంశంపై ప్రతిపక్షాలు, జేపీసీ వేయాలని డిమాండ్ చేశాయి. సుప్రీంకోర్టు కూడా రాఫెల్ విచారణ వ్యవహారం తమ పరిధిలోకి రాదని చెప్పిందని... జేపీసీ ఏర్పాటు చేయకూడదని ఎక్కడా అనలేదని రాహుల్ గుర్తు చేశారు. ఒప్పందంలో రాఫెల్ విమానాల ధరను పెంచడాన్ని రక్షణ శాఖ ఉన్నతాధికారులు సైతం అభ్యంతరం తెలిపారని గుర్తు చేశారు. కేవలం తన "ప్రియ స్నేహితుడు" అయిన అనిల్ అంబానీకి లబ్ది చేకూర్చేందుకే మోడీ ఒప్పందంలో మార్పులు చేశారని ఆరోపించారు. రాహుల్, అనిల్ అంబానీ పేరు ప్రస్తావించడంతో... సభలో అధికార పార్టీ ఎంపీలు ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు సభలో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో సభ 3.30 గంటలకు వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలో రాహుల్ మాట్లాడుతూ "ప్రపంచంలోనే అత్యంత విలువైన ఒప్పందాన్ని అనుభవం లేని అనిల్ అంబానీకి ఎందుకు ఇచ్చారు. దేశ సంపదను కొల్లగొట్టి అనిల్ అంబానీ జేబులో వేశారు" అని దుయ్యబట్టారు. అయితే అనిల్ అంబానీ పేరు వాడటంపై స్పీకర్ అభ్యంతరం తెలిపారు. దీనికి రాహుల్ స్పందిస్తూ "అనిల్ అంబానీ పేరు చెప్పకూడదా? ఇదేమైనా కొత్త నిబంధనా? కనీసం "ఏఏ" అని కూడా అనకూడదా? అయితే "డబుల్ ఏ" అని చెప్పొచ్చా? అని ఆయన స్పీకర్‌ను ఎదురు ప్రశ్నించారు. ఆ తర్వాత "డబుల్ ఏ" అని సంబోధిస్తూ తన ప్రసంగాన్ని కొనసాగించారు. రాఫెల్ ఒప్పందానికి సంబంధించి రూ.1600 కోట్ల నూతన ధరపై కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు సైతం అభ్యంతరం వ్యక్తం చేసింది నిజం కాదా అని నిలదీశారు. ఐఏఎఫ్ అధికారులు 126 విమానాలు కావాలని డిమాండ్ చేయగా వాటి సంఖ్యను 36కు ఎందుకు కుదించాల్సి వచ్చిందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

కాంగ్రెస్‌కు దేశ భద్రత పట్టదు: అరుణ్ జైట్లీ

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, రాఫెల్ ఒప్పందంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, వారికి దేశ భద్రత పట్టదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విమర్శించారు. కొందరు సహజంగా నిజాలను ఇష్టపడరని రాహుల్‌ని ఉద్దేశించి అన్నారు. గతంలో జరిగిన రక్షణ కుంభకోణాల్లోని కుట్రదారులే... ప్రస్తుతం మోడీ ప్రభుత్వంపై వేలెత్తి చూపిస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును కూడా రాహుల్ ఏ విధంగా సవాలు చేస్తారని ప్రశ్నించారు. కనీసం యుద్ధ విమానం అంటే ఏంటో తెలియని వ్యక్తి కూడా కాంగ్రెస్‌కు అధ్యక్షత వహిస్తున్నారంటూ విమర్శలు చేశారు. గోవా మంత్రి ఆడియో టేప్‌లో ఏమాత్రం నిజం లేదని అన్నారు. అదొక కల్పిత టేప్ అని పారికర్ ఇప్పటికే ఖండించిన విషయాన్ని సభకు గుర్తు చేశారు. అయినా రాహుల్ అసత్య ఆరోపణలు చేస్తూనే ఉన్నారని జైట్లీ వివరించారు. శివసేన ఎంపీ అరవింద్ ఘన్‌పట్ సావంత్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం పారదర్శకతతో కూడినదని మోడీ గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. రాఫెల్‌పై సర్కార్ జేపీసీ వేస్తే వాస్తవాలు బహిర్గతమవుతాయన్నారు. దాంతోపాటు, జేపీసీ వేయకపోవడమేనా పారదర్శకత? అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు జాయింట్ పార్లమెంట్ కమిటీ వేయొద్దని ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు. అనంతరం టీఎంసీ ఎంపీ సౌగత్‌రాయ్ మాట్లాడుతూ ఒప్పందాన్ని హెచ్‌ఏఎల్ నుంచి రిలయన్స్‌కు ఎందుకు మార్చారని ప్రశ్నించారు. బీజేడీ ఎంపీ కాలికేష్ నారాయణసింగ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ విశ్వసనీయత ప్రశ్నార్థకమయిందన్నారు. ప్రధాని మోడీ తెల్లారితే డిజిటల్ ఇండియా అంటారని, అయితే గత ఒప్పందంలోని సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, ప్రస్తుత ఒప్పంద నుంచి ఎందుకు తప్పించారని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ సభ్యుడు గల్లా జయదేవ్ మాట్లాడుతూ మోడీ సర్కార్ సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించిందని, పార్లమెంట్ మీద కూడా మోడీ సర్కార్‌కు గౌరవం లేదని అన్నారు.

26 మంది అన్నాడీఎంకే ఎంపీలపై కొరడా

సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతున్న సమయంలో అన్నాడీఎంకే సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. కావేరి జలాల కేటాయింపుల్లో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

అనంతరం స్పీకర్ పోడియం ముందు ఎంపీలు కాగితాలు చింపి విసిరారు. దీంతో సభలో పరిస్థితి అదుపు తప్పుతుందని స్పీకర్ ఆ పార్టీ సభ్యులను హెచ్చరించారు. గందరగోళం నెలకొనడంతో సభను పది నిమిషాలు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో స్పీకర్ సుమిత్రా మహాజన్ ఆందోళన చేస్తున్న 26 మంది ఎంపీలను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. దాంతోపాటు సభను వాయిదా వేయడంతో, రాఫెల్ ఒప్పందపై చర్చ అర్థాంతరంగా ముగిసి సభ గురువారం నాటికి వాయిదా పడింది.

అంబానీల కోసమే.. : సీపీఐ(ఎం) లోక్‌సభ పక్ష ఉపనేత ఎండీ సలీం

అంబానీలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకే రాఫెల్ డీల్‌ను మోడీ సర్కారు ఆ కంపెనీలకు కేటాయించినట్టు సీపీఐ(ఎం) లోక్‌సభ పక్ష ఉపనేత ఎండీ సలీం చెప్పారు. దేశాన్ని రక్షణ రంగంలో స్వయం ఉత్పాదకత భారత్‌గా తయారు చేయాల్సిన ప్రభుత్వం... రాఫెల్ ఒప్పందాన్ని ప్రయివేటు కంపెనీకి ఇవ్వడం ఏంటని ఆయన సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశాన్ని సెల్ఫ్ రిలయన్స్‌గా మార్చాల్సిన కేంద్రం... రిలయన్స్ సెల్ఫ్‌కు ప్రయత్నిస్తుందని గుర్తు చేశారు. రాఫెల్ డీల్‌పై ప్రభుత్వ తీరుతెన్నులు తొలి నుంచి అనుమానాస్పదంగానే ఉన్నాయని సభకు వివరించారు. పార్లమెంట్‌కు ఎటువంటి నివేదిక ఇవ్వక ముందే, ఇచ్చామని సుప్రీంకోర్టుకు చెప్పారని అన్నారు. భారత సర్వోన్నత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించారని తెలిపారు. అందువల్లే రాఫెల్ డీల్‌పై సుప్రీంకోర్టు స్వతంత్ర విచారణ చేపట్టలేమని చెప్పినట్టు గుర్తు చేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ మర్యాదలను బీజేపీ మంటగలిపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాఫెల్ డీల్‌కు సంబంధించిన అంశాలు ముందుగా అడిగినప్పుడు దేశ అంతర్గత భద్రత పేరిట వెల్లడించలేమని రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పినట్టు స్పష్టం చేశారు. రాఫెల్ వివరాలు వెల్లడించడం సురక్షితం కాదని తప్పించుకున్నారని గుర్తు చేశారు. యుద్ధ విమానాల ధరల నిర్ధారణ విషయంలో కూడా పక్షపాతంగా వ్యవహరించినట్టు అనుమానాలున్నాయని సభలో చెప్పారు. ధరల నిర్ధారణ ఏ కమిటీ సూచన మేరకు పెంచారో చెప్పాల్సిందిగా సలీం డిమాండ్ చేశారు. రాఫెల్ డీల్‌ను జాయింట్ పార్లమెంట్ కమిటీతో విచారణ జరపాలని కోరారు. అప్పుడే అన్ని విషయాలు బయటపడుతాయని వెల్లడించారు.

భూమి కబ్జా చేశారని..

(మొదటిపేజీ తరువాయి)

కోర్టును ఆశ్రయించగా, లక్ష్మయ్యకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయినా కబ్జాదారులు రూ.15లక్షలు చెల్లించాలని బాధితున్ని బెదిరించారు. ఈ విషయమై కలెక్టర్‌కు విన్నవించేందుకు భార్యాభర్తలు కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే, సరోజన వినతి పత్రాలను జిరాక్స్ తీసుకొచ్చేందుకు వెళ్లగా, లక్ష్మయ్య వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి, ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు అడ్డుకుని 108లో ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఆర్ఓ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేసిన న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

ఎంఆర్ఎఫ్ ఎన్నికల్లో సీఐటీయూ-కేపీఎస్ ఘన విజయం

(మొదటిపేజీ తరువాయి)

సీఐటీయూ-కేపీఎస్‌కు 821ఓట్లు, బీఎంఎస్‌కు 500ఓట్లు, టీఎంఎస్‌కు 451ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థిపై సీఐటీయూ కూటమి 321ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడుతూ.. ఇది కార్మిక విజయం అన్నారు. సీఐటీయూ, కేపీఎస్ కార్మిక సంఘాలు నిత్యం కార్మికుల కోసం పోరాడుతున్నాయనీ, దీన్ని గుర్తించి ఈ ఎన్నికల్లో కార్మికులు తమకు గుర్తింపు యూనియన్‌గా బాధ్యత అప్పగించారనీ తెలిపారు. తాము గతంలో ఈ పరిశ్రమలో ఎన్నో ఉద్యమాలు చేసి కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు కల్పించామ న్నారు. కొత్త సంవత్సరంలో తాము విజయంతో పోరాటాన్ని ఆరంభించా మని సంతోషం వ్యక్తం చేశారు. కేపీఎస్ నాయకుడు కొత్తగొల్ల శేఖర్ మాటా ్లడుతూ.. కార్మికులు పెట్టిన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వారిసమస్యలపై యాజమాన్యంతో పోరాడుతామన్నారు. ఎప్పటికప్పుడూ కార్మికులు-యజమాన్యం సంయుక్తంగా పరిశ్రమ అభివృద్ధిలో ముందుకు వెళ్లేలా కృషిచేస్తామన్నారు. కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తురాలిపై.. అయోధ్య పూజారి లైంగికదాడి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఓ ఆలయ ప్రధాన పురోహితుడు.. ఆధ్యాత్మిక బోధన చేస్తానని నమ్మించి భక్తురాలిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆలయ ప్రాంగణంలోనే ఆమెను బంధించి పలుసార్లు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. వారణాసి నుంచి 30ఏండ్ల మహిళ గతనెల 24న ఆధ్యాత్మిక బోధనల కోసం అయోధ్యలోని ఓ ఆలయానికి వెళ్లింది. కాగా, ఆ ఆలయ మహంత్ కృష్ణకాంతాచార్య ఆమెను ఆలయంలోనే బస చేయాల్సిందిగా ఆదేశించాడు. కాగా, అక్కడే ఆమెను బంధించి పలుసార్లు లైంగికదాడికి పాల్పడ్డాడని పోలీసు అధికారి ఎకె సావ్ తెలిపారు. ఎలాగోలా బాధితురాలు ఈ విషయాన్ని తెలియజేయడంతో ఆమెను రక్షించినట్టు వివరించారు. కాగా, అయోధ్యలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. గతేడాది జనవరిలో జమ్మూకాశ్మీర్‌లోని కతువాలో ఎనిమిదేండ్ల చిన్నారిని కొందరు దుండగులు ఆలయ ప్రాంగణంలోనే సామూహిక లైంగికదాడికి పాల్పడిన సంగతి తెలిసిందే.

ఓట్ల గల్లంతుతో తగ్గిన మెజార్టీ

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా ఇటీవల జరిగిన ఎన్నికల తీరు, బూత్ స్థాయిలో ఓట్ల నమోదు, భవిష్యత్‌లో చేపట్టబోయే అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న పనులపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. గల్లంతైన ఓట్లను తిరిగి ఓటరు లిస్టులో నమోదు చేసే బాధ్యత బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే బాల్క సుమన్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, గ్రంథాలయాల సంస్థ చైర్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పిడికిలి బిగించి..

(మొదటిపేజీ తరువాయి)

(పీఎస్‌యూ) ప్రయివేటు పరం చేయకుండా ఆపడం, కార్మిక చట్టాలను విధిగా అమలు చేయడం వంటి అంశాలతో వారు సమ్మెకు దిగుతున్నారు.

కార్మిక సంఘాల మద్దతు

రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెకు ఆరెస్సెస్ అనుబంధ సంస్థగా ఉన్న భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) మినహా దేశంలో ఉన్న కార్మిక సంఘాలన్నీ మద్దతు ప్రకటించాయి. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ), ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ), ఆలిండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఏఐసీసీటీయూ), ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్‌తో పాటు వ్యవసాయ, అనుబంధ సంఘాలు కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపాయి.

నయా ఉదారవాద విధానాలపై అలుపెరగని పోరాటాలు

కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత నయా ఉదారవాద విధానాలను ప్రోత్సహిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తోంది. తాము అధికారంలోకి వస్తే రైతుల అదాయం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన మోడీ సర్కారు.. తదనంతరం ఆ హామీని గాలికొదిలేసింది. రైతులకు తాయిళాలు ప్రకటిస్తూ వారిని శాంతింపజేసే ప్రయత్నం చేస్తోంది. కానీ, దేశంలో వరుసగా ఏర్పడిన కరువు పరిస్థితులు, బ్యాంకు రుణాల కారణంగా అప్పుల ఊబిలో చిక్కుకుపోయిన రైతులు.. కొంతకాలంగా సాగును వదిలేసి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతు ఆత్మహత్యలను నిరోధించి వారిని ఆదుకోవాల్సిన సర్కారు మాత్రం.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. దీనిని నిరసిస్తూ కర్షక లోకం కొంతకాలంగా దేశవ్యాప్త రైతాంగ పోరాటాలకు శ్రీకారం చుట్టారు.

రైతులతో పాటు వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు సైతం మోడీ సర్కారుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. 2015 నుంచి వరుసగా మోడీ సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై వాళ్లు అలుపెరగని పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఇదిలాఉంటే, మోడీ తీసుకొచ్చిన పెద్దనోట్ల రద్దు, జీఎస్టీతో లక్షలాది మంది కష్టజీవులు రోడ్డున పడ్డారు. దీని ప్రభావంతో దేశ ఆర్థిక రంగం కుదేలయ్యింది. ధరల పెరుగుదల కారణంగా వేతన జీవులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్రవ్యోల్బనం విపరీతంగా పెరిగిపోయింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో దీని ప్రభావం వీరిపై పడింది. అంతేగాక, విద్య వైద్య రంగాలలో ధరలు పెరుగుదల కారణంగా కార్మికులు పొందుతున్న కొద్ది మొత్తం కూడా వాటికే వినియోగిస్తున్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ఈ రంగాలను ప్రయివేటు పరం చేయడం కారణంగా కార్మికులు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ కార్మికులు కొంతకాలంగా ఆందోళన బాట పట్టారు. 2015, తరువాతి ఏడాదిలోనూ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల కార్మికులు దేశరాజధానిలో ఒక్కరోజు సమ్మె చేశారు. 2017లో మూడు రోజుల పాటు చేసిన 'మహా పడావ్' నిర్వహించి తమ ఐక్యతను చాటారు. కార్మికులు. ఈ ఆందోళనలో దాదాపు 2 లక్షల మంది కార్మికులు పాల్గొన్నారు. ఇక గతేడాది ఆగస్టులో కార్మికులతో పాటు రైతులు నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమం కనివినీ రీతిలో సాగింది. దీనికి 5 లక్షలకు పైగా కష్టజీవులు హాజరయ్యారు.

సమ్మెలో పాల్గొనబోయే కార్మికులు

త్వరలో జరగబోయే సమ్మెలో స్కీం వర్కర్లు (ఐసీడీఎస్, ఎన్‌హెచ్ఎం, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు), బొగ్గు, స్టీల్, రవాణా, టెలికాం, విద్యుత్తు, రక్షణ, ప్లాంటేషన్, ఆటో మొబైల్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, మెడికల్ రిప్రజెంటేటివ్స్ రంగాలలో ఉన్న కార్మికులతో పాటు ఉద్యోగులు సైతం పాల్గొనబోతున్నారు. 2018లో పైన పేర్కొన్న రంగాల కార్మికులందరూ బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా పలు రూపాలలో ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా స్కీం వర్కర్లు.. కనీస వేతనాలు అందించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా, పంజాబ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలలోని వర్కర్లందరూ ఆందోళనలలో పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ రంగ ఆధీనంలో ఉన్న సంస్థలను ప్రయివేటు పరం చేయాలని చూస్తున్న మోడీ సర్కారుకు వ్యతిరేకంగా ఆయా రంగాలలో ఉన్న కార్మికులు, ఉద్యోగులు నిరసనల బాట పట్టారు. వీరిలో బొగ్గు, స్టీల్, రవాణా, టెలికాం, రక్షణ, బ్యాంకింగ్ రంగాలలోని ఉద్యోగులు చేసిన ఆందోళనలకు బీజేపీ సర్కారు దిగొచ్చి ఈ ప్రయత్నాలను విరమించుకుంది. మోడీ హయాంలో ఉద్యోగులు, కార్మికులు, రైతులు అనే తేడా లేకుండా అన్ని రంగాలలో ఉన్న ప్రజలు అవస్థలు పడుతున్నారు. దేశంలో తొలిసారిగా వీరందరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నారు. వీరందరి పోరాటం త్వరలో జరగబోయే సమ్మెకు స్ఫూర్తినిస్తున్నది.

ఏం చేయబోతున్నారు?

(మొదటిపేజీ తరువాయి)

చెందిన ప్రీతీ అగర్వాల్ సహా 26 మంది దాఖలు చేసిన వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించింది. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, అభ్యంతరాలు కూడా తెలుసుకోకుండా ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా నుంచి ఎంతో మంది పేర్లు తొలగించేశారని, ఈసీ తీసుకున్న నిర్ణయం వల్ల పిటిషనర్ల ఓట్లు కూడా లేకుండాపోయాయని వారి తరపు న్యాయవాది వాదించారు. తమ ఓట్లు యథాతథంగా జాబితాలో ఉంచాలని కోరేందుకు ప్రత్యేక దరఖాస్తు విధానం ఉండేలా ఈసీకి ఆదేశాలివ్వాలని కోరారు. ఈసీకి నోటీసు ఇచ్చిన హైకోర్టు తదుపరి విచారణను 22కి వాయిదా వేసింది.

పూర్తి వివరాలు అందజేయండి

సినీ హీరో ప్రభాస్‌కు చెందిన భూమిని క్రమబద్ధీకరణ చేయాలన్న దరఖాస్తును అధికారులు తిరస్కరించినప్పుడు ఆ విషయానిన ఆయనకు లిఖితపూర్వకంగా ఎందుకు తెలియజేయలేదని తెలంగాణ సర్కారును హైకోర్టు ప్రశ్నించింది. దీనికి చెందిన పూర్తి వివరాలన్నీ తమకు అందజేయాలని, ఈ వ్యాజ్యాన్ని గురువారం విచారిస్తామని న్యాయమూర్తులు జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ కేశవరావులతో కూడిన డివిజన్ బెంచ్ అధికారులను ఆదేశించింది. రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం రాయ్‌దుర్గం పన్మక్తలోని భూమి ప్రభుత్వానిదని చెప్పి తాను నిర్మించుకున్న నిర్మాణాన్ని సీజ్ చేయడం అన్యాయమని పేర్కొంటూ హీరో ప్రభాస్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని బెంచ్ బుధవారం విచారించింది. ప్రభాస్ చేసుకున్న క్రమబద్ధీకరణ దరఖాస్తును తిరస్కరించినట్లు ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. దీనిపై ప్రభాస్ తరపు న్యాయవాది స్పందిస్తూ.. ఆ సమాచారం తమకు తెలియదన్నారు. దాంతో హైకోర్టు పైవిధంగా అధికారులను ఆదేశించిన విచారణను గురువారానికి వాయిదా వేసింది.

పరిహారం ఎందుకు చెల్లించలేదు?

సింగరేణి బొగ్గు గనుల నిమిత్తం భూములు సేకరించినా రైతులకు పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించినా రైతులకు ఎందుకు ఇవ్వలేదని హైకోర్టు ప్రశ్నించింది. ఈ నెల 31 తేదీలోగా రైతులకు పరిహారం చెల్లించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాక ష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ ఖమ్మం జిల్లా జడ్జిని ఆదేశించింది. పరిహారం చెల్లించాలని లోక్ అదాలత్ ఆదేశించిందని, ప్రభుత్వం డిపాజిట్ చేసినా పరిహారం ఇవ్వకపోడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ నెలాఖరులోగా పరిహారం చెల్లించి నివేదికను తమకు అందజేయాలని జిల్లా జడ్జిని డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. పరిహారం చెల్లించకపోవడాన్ని తప్పుపడుతూ సత్తుపల్లి మండల వాసి సీహెచ్ విఠలయ్య దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ వచ్చే నెల 2వ తేదీకి వాయిదా పడింది.

పనులు వేగవంతం చేయండి

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం

- పంపుహౌజ్‌లు, కాల్వల పరిశీలన

నవతెలంగాణ-పెద్దపల్లి ప్రతినిధి/జగిత్యాల/ఇబ్రహీంపట్నం/ రామగుండం/ మహదేవ్‌పూర్

కాళేశ్వరంలో భాగంగా నిర్మిస్తున్న బ్యారేజి, పంపుహౌజ్‌లను మార్చి 31 నాటికి పూర్తి చేయాలనీ, అందుకోసం పనుల వేగం పెంచాలనీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని సుందిళ్ల బ్యారేజీ, రామగుండం మండలంలోని గోలివాడ, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్‌లను బుధవారం సీఎం పరిశీలించారు. రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటిసారి జిల్లాకు వచ్చిన కేసీఆర్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. సుందిళ్ల బ్యారేజీ యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేసీఆర్ పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుందిళ్ల బ్యారేజ్ 74 గేట్ల అమరిక పూర్తయిందనీ, 15 కిలోమీటర్ల మేర ఫ్లడ్ బ్యాంకు పనులు వేగంగా సాగుతున్నాయనీ అధికారులు తెలిపారు. 89.64 శాతం ఎక్సవేషన్, 76.39 శాతం మట్టి పనులు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన పనులూ ఈ నెల చివరి వరకు పూర్తవుతాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఫ్లడ్ బ్యాంకు పరిధిలోని రివిట్‌మెంట్ పనులు 46 శాతమే పూర్తవ్వడం పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజూ మూడు షిఫ్టుల్లో పనులు జరగాలనీ, నిధులకు కొరత లేదనీ చెప్పారు. అనంతరం ఇబ్రహీపట్నంలోని రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్ పనులను పరిశీలించారు. ప్రతి రోజూ 2 టీఎంసీల నీటిని ఎత్తిపోసే దిశగా పనులు వేగవంతం చేయాలన్నారు.

కన్నెపల్లి గ్రావిట్ కాల్వ, అన్నారం బ్యారేజీ పనులను మార్చి 31 లోగా పూర్తి చేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. జయశంకర్ జిల్లా మహదేవ్‌పూర్ మండలం కన్నెపల్లి నుంచి అన్నారం వరకు నిర్మిస్తున్న 13.2 కిలోమీటర్ల గ్రావిట్ కాల్వ వెంట వాహనం ద్వారా ప్రయాణించి పనులను పరిశీలించారు. కార్మికులను పెంచి గ్రావిట్ పనులు వేగవంతం చేయాలని అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. అఫ్ఖాన్ సంస్థ గుత్తేదారులు పనులను 98 శాతం పూర్తి చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ అభినందించారు. మిగతా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

రాంపూర్ పర్యటన రద్దు

రాజేశ్వర్‌రావుపేట పంపుహౌజ్ పరిశీలన అనంతరం మాల్యాల మండలంలోని రాంపూర్ పంపుహౌజ్‌ను సీఎం సందర్శిస్తారని అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ, సాయంత్రం కావడంతో హెలికాప్టర్‌కు వాతావరణం అనుకూలించదని రాంపూర్ పర్యటన రద్దు చేశారు. అయితే ఆ ప్రాజెక్టు మీదుగా ఏరియల్ సర్వే చేస్తూ సీఎం రాత్రి బేగంపేటకు చేరుకున్నారు.

ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, సీఎం ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్, డీజీపీ మహేందర్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు వివేక్, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, పెద్దపల్లి, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు శ్రీదేవసేన, డాక్టర్ శరత్,వాసం వెంకటేశ్వర్లు, పెద్దపల్లి జేసీ వనజాదేవి, జలవనరుల సంఘం చైర్మన్ వీరమల్ల ప్రకాష్, ఐజీ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఏందిరా మీ కులం?

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబాలను గ్రామాభివృద్ధి పేరిట పెత్తందార్లు నానా అవస్థలు పెడుతున్నారు. క్రిస్మస్‌కు కనీసం కొత్త బట్టలు కూడా కుట్టించుకోనివ్వకుండా అడ్డుకున్నారు. వారి వ్యవసాయ భూముల్లో దున్నడానికి ట్రాక్టర్లూ వెళ్లనివ్వలేదు. దీంతో బాధితులు నిజామాబాద్ జిల్లా అధికారులను ఆశ్రయిం చారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ నందిపేట్ మండలం మారంపల్లి గ్రామంలో మాల సామాజిక తర గతి వారు గ్రామశివారులోని చెరువు కట్ట కింద ఇటీవల అంబేద్కర్ భవనం నిర్మించేందుకు పునాదులు వేశారు. దీన్ని గ్రామాభివృద్ధి సభ్యులు అడ్డుకున్నారు. అంబేద్కర్ భవన్ నిర్మాణం ఆపకపోతే బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఆ గ్రామంలో పలు అగ్రకులాలకు ప్రత్యేక సంఘ భవనాలు నిర్మించుకున్నారు. దీంతో తమకూ ఓ భవనం కావాలని మాలలు భవన నిర్మాణం కొనసాగించారు. దీన్ని సహించలేని కొందరు పెత్తందార్లు.. 80 మందిని గత నెల 24వ తేదీన సాంఘిక బహిష్కరణ చేశారు. రూ.50వేలు కడితే బహిష్కరణ ఎత్తేస్తామని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు చెప్పారు. భయపడిన బాధితులు వారు అడిగిన మొత్తాన్ని చెల్లించారు. అయినా బహిష్కరణ కొనసాగిస్తున్నారు.

24వ తేదీ నుంచి గ్రామంలో బహిష్కరణ అమలు చేశారు. పెత్తందార్ల దగ్గర పశువుల కాపరిగా ఉన్న వ్యక్తులను పనుల నుంచి తొలగించారు. వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, మందుల అమ్మకం నిలిపేశారు. పాల కేంద్రంలో మాల సామాజిక తరగతికి చెందిన వ్యక్తులు తీసుకొచ్చిన పాలను తీసుకోవడం లేదు. 25వ తేదీన క్రిస్మస్ పండుగ కోసం ఇచ్చిన కొత్త బట్టలు కుట్టనివ్వలేదు. ఇక రబీసాగులో భాగంగా వరి నాట్లకు కూడా బాధితులను పిలవకుండా పొట్టకొట్టారు.

ఎస్ఐ, సీఐ మాట్లాడినా..

ఈ విషయమై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకి, సీఐకి ఫిర్యాదు చేశారు. సదరు ఎస్ఐ వచ్చి గ్రామంలో విచారించారు. కానీ పెత్తందార్లు వెనక్కి తగ్గలేదు. పైగా 'మీకు దిక్కున్నచోట చెప్పుకోండని' బాధితులతో హేళనగా మాట్లాడారు. దీంతో బాధితులు బుధవారం ఆర్మూర్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ డీఆర్‌వోకు సైతం ఫిర్యాదు చేశారు.

తొలిసారి ఇద్దరు మహిళలు

(మొదటిపేజీ తరువాయి)

మమ్మల్ని ఎవరూ ప్రశ్నించలేదు' అని మహిళలు తెలిపారు. కాగా, వారు ఆలయంలోకి వెళ్తున్న వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది. కాగా, ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధ్రువీకరించారు. 'ఆ మహిళలిద్దరూ ఆలయంలోకి వెళ్ళడం నిజమే' అని తెలిపారు.

మహిళల నివాసాల వద్ద పోలీసుల భద్రత

మహిళల ప్రవేశం నేపథ్యంలో హిందూత్వశక్తులు నిరసనలకు పిలుపునివ్వగా.. ముందుజాగ్రత్త చర్యగా వారి నివాసాల వద్ద పోలీసు భద్రతను కేరళ సర్కార్ ఏర్పాటు చేసింది. అలాగే ఆ ఇద్దరు మహిళలు బిందు, కనకదుర్గ ప్రస్తుతం పోలీసురక్షణలో ఉన్నారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు తర్వాత పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం సుప్రీం తీర్పును అమలుచేయాలని నిర్ణయించింది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్, బీజేపీ, ఇతర హిందూత్వ సంస్థలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. 'సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించే వారు ఆలయంలోకి వెళ్ళారు. ఆలయాన్ని మూసివేయడం కోర్టు తీర్పును ఉల్లంఘించడమే' అని సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ అన్నారు. ఆలయశుద్ధి కార్యక్రమంపై ఆ రాష్ట్ర మంత్రి జయరాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అంటరానితనంతో సమానమనీ, అస్పృశ్యత చట్టానికి వ్యతిరేకమని అన్నారు.

మూసివేత.. ఆలయశుద్ధి.. తెరుచుకున్న తలుపులు

మహిళల ప్రవేశంతో ఆలయాన్ని దాదాపు గంటపాటు మూసివేసి సంప్రోక్షణ చేపట్టారు. ప్రధాన అర్చకుడి ఆదేశాలతో బుధవారం ఉదయం దాదాపు గంట పాటు ఆలయ ద్వారాలను మూసివేసి శుద్ధి చేశారు. అనంతరం మళ్లీ ఆలయాన్ని తెరిచి భక్తుల దర్శనానికి వీలు కల్పించారు.

సమానత్వ విజయం : తృప్తిదేశాయి

ఆలయంలోకి ప్రవేశించిన మహిళలకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇది సమానత్వ విజయం అని భూమాతా బ్రిగేడ్ వ్యవస్థాపకురాలు, సామాజిక కార్యకర్త తృప్తిదేశాయి వ్యాఖ్యానించారు. నవంబరులో ఆలయంలోకి ప్రవేశించేందుకు కొచ్చి చేరుకున్న ఆమెను హిందూత్వశక్తులు విమానాశ్రయంలోనే అడ్డుకున్న విషయం తెలిసిందే. 'మా పోరాటానికి ఇది ఒకపెద్ద విజయం. కొత్త ఏడాదిలో మహిళలకు మంచిప్రారంభం' అని పూణేలో విలేకరులతో చెప్పారు.

సీపీఐ(ఎం) అభినందనలు

కొత్త సంవత్సరం ఆరంభం రోజున కేరళలో 176 సామాజిక, ప్రజాసంఘాలతో కలిసి మహిళలతో నిర్మించిన 'మహిళా కుడ్యం' కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళాలోకాన్ని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో అభినందించింది. రాష్ట్ర వ్యాప్తంగా కుల, మత వర్గాలకు అతీతంగా దాదాపు 55 లక్షల మందికి పైగా మహిళలతో నిర్మించిన ఈ మహిళా కుడ్యం మహిళల హక్కులు, సామాజిక సంస్కరణల కోసం కేరళలో జరిగిన ఉద్యమాలను ఐక్యంగా ముందుకుతీసుకుపోతామన్న సందేశాన్ని ఇచ్చిందని ప్రశంసించింది. ఆరెస్సెస్ నేతృత్వంలోని మితవాద శక్తులు దేశమంతటిపైనా తిరోగమన 'మనువాది' సిద్ధాంతాలను రుద్దేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఈ విధమైన కృషికి విస్తృత ప్రాధాన్యత ఉన్నదని, ఈ మహిళాకుడ్యం ఇటువంటి ప్రతిఘటనలు పెద్ద సంఖ్యలో జరిగేందుకు ప్రోత్సహిస్తుందని పేర్కొంది.

మహిళల ప్రవేశాన్ని సమర్థిస్తా: బీజేపీ ఎంపీ

శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై బీజేపీ ఎంపీ ఉదిత్ రాజ్.. పార్టీకి జలక్ ఇచ్చారు. 'అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని వ్యక్తిగతంగా, పరిసంఘ్ చైర్మెన్‌గా సమర్థిస్తున్నాను. పురుషుడు.. మహిళ నుంచే జన్మించినప్పుడు, మహిళ ఎలా అపవిత్రురాలవుతుంది? దైవం సర్వవ్యాపితం. ఆయన గుడి బయట కూడా ఉంటాడు. రాజ్యాంగం దృష్ట్యా పురుషులు, మహిళలు సమానమే'నని వాయవ్య ఢిల్లీ నుంచి బీజేపీ టికెట్‌పై గెలిచిన ఉదిత్ రాజ్ ట్వీట్ చేశారు.


హిందూత్వశక్తుల ఆందోళనలు

మహిళల ప్రవేశంపై హిందూత్వ శక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో పలుచోట్ల ఆందోళనలకు దిగాయి. కేరళ సచివాలయం వద్ద హిందూత్వశక్తులు నిరసనకు దిగాయి. అల్లర్లను సృష్టించేందుకు ప్రయత్నించాయి. అక్కడకు చేరుకున్న లెఫ్ట్ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డాయి. కాగా పోలీసుల జోక్యంతో ఆందోళనలు సద్దుమణిగాయి. మరోవైపు గురువారం రాష్ట్రవ్యాప్తంగా హర్తాళ్‌కు పిలుపు నిచ్చారు.

హర్తాళ్‌ను బహిష్కరిస్తున్నాం : వ్యాపారులు, పర్యాటక సంస్థలు

ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘాలు గురువారం హర్తాళ్‌కు పిలుపునివ్వగా.. వ్యాపారాలు, పర్యాటక సంస్థలు దానిని వ్యతిరేకించాయి. అయిపోయిందేదో అయిపోయింది. పదేపదే బంద్‌లకు పిలుపునిచ్చి మా పొట్టలుకొట్టవద్దు.. అని కేరళ టూరిజం టాస్క్ ఫోర్స్ కన్వీనర్ అబ్రహం జార్జి, కేరళ ట్రావెల్ మార్ట్ సొసైటీ అధ్యక్షులు బేబీ మాథ్యు, కేరళ టూరిజం ఇండస్ట్రీ అధ్యక్షులు ఈఎం నజీబ్ అన్నారు. తాము హర్తాళ్‌ను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు.

కల నిజమైంది : దర్శనం చేసుకున్న మహిళలు



కేరళలోని శబరిమల ఆలయంలో అన్ని వయసుల స్త్రీలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన మూడు నెలల తర్వాత.. ఆందోళన చేస్తున్న హిందూత్వ శక్తుల కళ్లు కప్పి అయ్యప్పస్వామిని దర్శించుకొని చరిత్ర సృష్టించారు. కోజికోడ్ జిల్లాకు చెందిన బిందు అమ్మిని (42) న్యాయవాదిగా పనిచేసిన ఆమె ప్రస్తుతం కన్నూరు వర్సిటీ పరిధిలోని తల్లసేరి పలయాడ్ స్కూల్ ఆఫ్ లీగల్ స్టడీస్‌లో గెస్ట్ లెక్చరర్‌గా ఉన్నారు. కనకదుర్గ (44) సివిల్ సప్లయిస్ ఉద్యోగి. మల్లప్పురంలోని అగడిపురంలో నివాసముంటున్నారు. వీరిద్దరు డిసెంబరు 24న ఆలయంలోకి వెళ్ళేందుకు ప్రయత్నించారు. ఆలయానికి 500 మీటర్ల వరకూ వచ్చిన వారు నిరసనల నేపథ్యంలో వెనక్కి వెళ్ళారు. తాము భక్తులమనీ, తమ కలను సాకారం చేసుకున్నామని వారు చెప్పారు. పోలీసు రక్షణలో వున్న ఆ ఇద్దరు మహిళలు ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు...

మీ ప్రయాణానికి ఎలా ప్లాన్ చేసుకున్నారు?

మేం దాదాపు ఒక నెల రోజులుగా ఉపవాసం, దీక్షను పాటించాం. డిసెంబరు 24న ఆలయంలోకి వెళ్ళేందుకు ప్రయత్నించాం. నిరసనలు మా ఆశలపై నీళ్ల చల్లాయి. కొట్టాయం ఎస్పీతో మాట్లాడి మరోసారి ప్రయత్నంచేశాం. విజయం సాధించాం. మంగళవారం అర్ధరాత్రి పంబ బేస్ క్యాంప్ చేరుకున్నాం. ఆలయానికి నడుచుకుంటూ వెళ్ళడం ప్రారంభించాం. దాదాపు రెండు 25 మంది పోలీసులు మఫ్టీలో మాతో ఉన్నారు. మేం 3.45కు ఆలయంలోకి వెళ్ళాం. లోపల కొద్ది నిమిషాలు గడిపాం. స్వామి దర్శనం అనంతరం తిరిగివచ్చాం. మా కల నెరవేరింది.

మీరు పురుష వస్త్రధారణతో వెళ్ళినట్టు వార్తలు వచ్చాయి కదా?

అది నిజం కాదు. వాస్తవానికి, మేం సాంప్రదాయ వస్త్రాలను ధరించే లోపలికి వెళ్ళాం. పోలీసుల సలహామేరకు మా ముఖాలను పాక్షికంగా కవర్ చేసుకున్నాం. కొంతమంది భక్తులు మమ్మల్ని గుర్తించారు.. కానీ ఎలాంటి ఇబ్బందులకూ గురిచేయలేదు. వాస్తవానికి నిజమైన భక్తులు మహిళల ప్రవేశానికి అడ్డుచెప్పడంలేదు. మహిళలను అడ్డుకుని హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నవారి వెనుక కొన్ని సంస్థలు ఉన్నాయి.

ప్రతిఘటన ఎదురవుతుందని ఊహించారా?

చూడండి, మేము చట్టవిరుద్ధమైన పని ఏదీ చేయలేదు. మాకు పోలీసుల మద్దతు ఉంది. కొద్ది రోజుల తర్వాత పరిస్థితులు చక్కబడతాయని మేం ఆశిస్తున్నాం. మావోయిస్టులుగా మాపై ముద్రవేస్తున్నారు.. అది నిజంకాదు. మేం కేవలం భక్తులం.. వచ్చి ప్రార్థనలు చేశాం. ఇక ఇప్పుడు ఫ్లడ్ గేట్‌లు తెరుచుకున్నాయి కనుక అత్యధికమంది స్త్రీలు ఆలయంలోకి వచ్చి ప్రార్థనలు చేస్తారని మేం భావిస్తున్నాం. ఇది మహిళల హక్కు. దీనికి అత్యున్నత న్యాయస్థానం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మేము ఇప్పుడు పోలీసు రక్షణలో ఉన్నాం. పోలీసుల సలహా మేరకు మేం ఎక్కడ ఉన్నదీ ఇప్పుడు చెప్పలేం. అంతా సద్దుమణిగిన తర్వాత పూర్తి వివరాలు బయటపెడతాం.

సెన్సెక్స్ ▼ 363 35,892 | నిఫ్టీ ▼117 10,792 | డాలరుకు రూపాయి విలువ 70.16



బంగారం(10గ్రా) రూ. 31,635



వెండి (కేజీ) రూ. 38,817



కోడిగుడ్లు (వందకి)

హైదరాబాద్	439	విజయవాడ	445
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	453
వరంగల్	441	ముంబయి	494



దివాలా బాటలో జెట్ ఎయిర్‌వేస్!

● రుణాలు, వడ్డీ చెల్లింపుల్లో సంస్థ విఫలం



న్యూఢిల్లీ: తాజాగా బ్యాంకులకు అప్పులు, వడ్డీలు చెల్లించడంలో విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ విఫలమైంది. వరుసగా విమాన ఇంధన ధరలు పెరగడంతో పాటు పలు ప్రతికూల పరిస్థితుల కారణంగా ఈ విమానయాన సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఎస్‌బీఐ నేతృత్వంలోని రుణదాత బ్యాంకుల బృందానికి కట్టాల్సిన రుణాలు, వడ్డీ చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని జెట్ ఎయిర్‌వేస్ అంగీకరించింది. 2018 డిసెంబర్ 31 గడువు నాటికి చేయాల్సిన చెల్లింపులను ఆలస్యం అవుతున్నాయని తెలిపింది. తాత్కాలికంగా నగదు నిల్వల్లో వచ్చిన తేడాలతో ఈ సమస్య ఏర్పడినట్లు పేర్కొంది. ఈ అంశంపై తాము బ్యాంకుల కన్సార్టియంతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. 25ఏళ్ల నుంచి విమాన సేవల్లో ఉన్న జెట్ ఎయిర్‌వేస్ గత కొన్ని నెలలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. అప్పుల్లో కూరుకుపోవడంతో పైలట్లు, ఇతర సిబ్బందికి జీతాలు కూడా సరిగ్గా ఇవ్వలేని దుస్థితి నెలకొంది. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న జెట్ ఎయిర్‌వేస్‌ను కొనుగోలు చేయడానికి లేదా అందులో పెట్టుబడులు పెట్టడానికి ఒక దశలో టాటా గ్రూపు చర్చలు జరిపింది. అదే విధంగా అబుదాబికి చెందిన జెట్ ఎయిర్‌వేస్‌కు ఇప్పటికే ఈ సంస్థలో 24 శాతం వాటా ఉంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో జెట్‌లో పెట్టుబడులు పెంచడానికి ఎతిహాద్ కూడా చర్చలు జరుపుతోంది. ముడిచమురు ధరల పెరుగుదల, బలహీన రూపాయి, చౌక చార్జీలు, తీవ్రమైన పోటీ తదితర అంశాలతో నరేశ్ గోయల్ సారథ్యంలోని జెట్ ఎయిర్‌వేస్ తీవ్ర ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటోంది.

దేశీయ మార్కెట్లకు అమ్మకాల సెగ



ముంబయి: కొత్త సంవత్సరాదిలో స్టాక్ మార్కెట్లు తొలిసారిగా బుధవారం నష్టాలను నమోదు చేశాయి. ఆటో, బ్యాంకింగ్ తదితర స్టాక్స్ అమ్మకాల సెగతో మార్కెట్లు భారీ నష్టాలు చవి చూశాయి. దీంతో ఐదు వరుస సెషన్ల లాభాలకు గండి పడినట్టయింది. అంతర్జాతీయ మార్కెట్లు నేల చూపులు చూడటంతో పాటు.. దేశీయంగా రూపాయి విలువ పడిపోవడం మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. యూరోపియన్ స్టాక్స్ భారీ నష్టాలు చవి చూశాయి. ప్రపంచ వృద్ధి రేటుపై అనుమానాలు, వాణిజ్య యుద్ధ భయాలు, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు, రాజకీయ అనిశ్చితి ప్రపంచ మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. ఈ నేపథ్యంలో బుధవారం బీఎస్ఈ సెన్సెక్స్ 363 పాయింట్లు కుంగి 35,891 పాయింట్లకు దిగజారింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 117 పాయింట్లు క్షీణించి 10,792 పాయింట్లకు పడిపోయింది. ఆటో సూచీ 3.05 శాతం పడిపోయింది. ముఖ్యంగా ఐషర్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ స్టాక్స్ అమ్మకాలకు ఒత్తిడికి లోను కావడంతో ఈ రంగం సూచీ నష్టపోయింది. దీంతో మార్కెట్లకు నష్టాలు ముదిరాయి.

దిగ్గజ బ్యాంక్‌గా బీవోబీ

• కనుమరుగవనున్న విజయ, దేనా బ్యాంకులు • మూడు బ్యాంకుల విలీనానికి క్యాబినెట్ సమ్మతి
• 9.5 వేల శాఖలతో రెండో దిగ్గజంగా అవతరణ • 1000 దేనా షేర్లకు 110 బీవోబీ వాటాలు
• వెయ్యి విజయ బ్యాంక్ వాటాలకు 402 షేర్లు... • బ్యాంకింగ్ ఉద్యోగుల ఆందోళనలు బేఖాతరు..!

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశంలో మరో భారీ బ్యాంకుల విలీనానికి మోడీ సర్కారు సమ్మతి తెలిపింది. బ్యాంకింగ్ అధికారులు, ఉద్యోగుల నుంచి ఆర్థిక విశ్లేషకులు బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకస్తూ సమ్మెలు చేస్తున్నప్పటికీ మోడీ సర్కారు వాటిని పట్టించుకోకుండా.. తాజాగా కేంద్ర క్యాబినెట్ బుధవారం విజయ బ్యాంక్, దేనా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) విలీనానికి ఆమోదం తెలిపింది. క్యాబినెట్ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ మూడు బ్యాంకుల విలీనానికి మంత్రివర్గం అమోదం విషయాన్ని వెల్లడించారు. విలీనంతరం ఆవిర్భవించే బ్యాంకు దేశంలోనే మూడో అతి పెద్ద ప్రభుత్వ బ్యాంకుగా అవతరించనుంది. ఇండియన్ బ్యాంకింగ్ వ్యవస్థలో మూడు బ్యాంకుల విలీనం అనేది ఇదే ప్రథమం. విలీనం అనంతరం విజయ బ్యాంక్, దేనా బ్యాంక్ ఉద్యోగులు అందరూ బ్యాంక్ ఆఫ్ బరోడాకు బదిలీ అవుతారని పేర్కొన్నారు. ఈ మూడింటి విలీనం వల్ల ఏర్పడే కొత్త బ్యాంకు ఎస్‌బీఐ, ఐసీఐసీఐ తర్వాత దేశంలోనే మూడో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనుంది. బ్యాంకుల విలీన ప్రక్రియలో ఉద్యోగుల తొలగింపు ఉండదని స్పష్టం చేశారు. విలీనం వల్ల సదరు బ్యాంకు ఉద్యోగుల సర్వీసుపై ఎటువంటి ప్రభావం చూపబోదని ఆయన తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఐదు అనుబంధ బ్యాంకులు విలీనం తర్వాత మరో విలీనానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన వివరించారు. ఈ విలీనం వల్ల బ్యాంకు సిబ్బందితో పాటు ఖాతాదారులకు లాభాలు చేకూరతాయని ప్రభుత్వం చెబుతోంది. విలీన ప్రక్రియ ముగిశాక ఏర్పడే కొత్త బ్యాంకులో సుమారు 85వేల మందికి పైగా ఉద్యోగులుంటారు. దేశ, విదేశాల్లో కలిపి దానికి 9,485 శాఖలు ఏర్పడతాయి. ఏప్రిల్1, 2019 నుంచి ఈ విలీనం అమల్లోకి వస్తుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా, దేనా బ్యాంక్ బోర్డులు తాజాగా విలీనానికి సంబంధించి పలు కీలక అంశాలకు సమ్మతి తెలిపాయి. షేర్ల స్వాప్ రేషియో ప్రతిపాదనకు ఆమోదం తెలిపాయి. దీని ప్రకారం.. దేనా బ్యాంక్



వాటాదారులు 1,000 షేర్లకు గానూ రూ.2 ముఖ విలువ కలిగిన 110 బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు పొందనున్నారు. ఇక విజయ బ్యాంక్ వాటాదారులకు ప్రతి 1,000 షేర్లకు గానూ 402 బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు లభించనున్నాయి. కాగా కేంద్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్లో విజయా బ్యాంక్, దేనా బ్యాంకులను బ్యాంక్ ఆఫ్ బరోడాతో విలీనం చేయాలని ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

ఉద్యోగుల ఆందోళనలు పట్టవా..!

అంతర్జాతీయ స్థాయిలో పటిష్టమైన బ్యాంక్ ఏర్పాటు దిశగా ఈ మూడు బ్యాంకులను విలీనం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సారథ్యంలోని మంత్రుల బృందం గతంలో నిర్ణయించింది. అయితే దీనిని బ్యాంక్ అధికారుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. ఇదే అంశంపై గత డిసెంబరు మాసాంతంలో బ్యాంక్ ఉద్యోగులు సమ్మె బాట కూడా పట్టారు. అయినా మోడీ సర్కారు వీటిని పట్టించుకోకుండా ముందుకు సాగడం విశేషం.

మేటిగా బ్యాంక్ ఆఫ్ బ(రో)డా..!

● బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయ బ్యాంక్, దేనా బ్యాంకుల విలీనం తరువాత ఆ బ్యాంక్ దేశంలోనే డిపాజిట్ల పరంగా రెండో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనుంది. 27.1 లక్షల కోట్ల డిపాజిట్లతో ఎస్‌బీఐ అగ్రస్థానంలో ఉండగా.. ఇప్పుడు విలీనం తరువాత 8.6 లక్షల కోట్ల డిపాజిట్లతో బీవోబీ రెండో అతిపెద్ద బ్యాంకింగ్ సంస్థగా మారనుంది.

● విలీనం తరువాత అత్యధికంగా రుణాలను జారీ చేసిన బ్యాంకుల జాబితాలలో బీవోబీ మూడో స్థానంలో నిలవనుంది. 20.5 లక్షల కోట్లతో ఎస్‌బీఐ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా.. 6.6 లక్షల కోట్ల హెచ్‌డీఎఫ్‌సీ రెండో స్థానంలోను.. బీవోబీ 6.1 లక్షల కోట్లతో మూడో స్థానంలోను నిలవనుంది.

● విజయ, దేనా బ్యాంకుల విలీనం తరువాత బీవోబీ మొత్తం 9,477 శాఖలతో రెండో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనుంది. 22,414 శాఖలతో ఎస్‌బీఐ అగ్రస్థానంలో నిలవనుంది.

హెటిరో చేతికి స్పెయిన్ ఫార్మా కంపెనీ



హైదరాబాద్: ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ హెటిరో గ్రూపునకు చెందిన యూరోపియన్ సబ్సీడరీ అమరాక్స్ లిమిటెట్ స్పెయిన్ కేంద్రంగా పని చేస్తున్న టర్బిస్ ఫార్మాను కొనుగోలు చేసింది. అయితే ఎంత మొత్తానికి ఈ కొనుగోలు జరిపిందన్న వివరాలను వెల్లడించలేదు. టర్బిస్ ఫార్మా స్పెయిన్‌లో పలు ఉత్పత్తులతో పాటు రిటైల్ వ్యాపారంలో మంచి మార్కెటింగ్ నెట్‌వర్క్ కలిగి ఉన్నట్లు హెటిరో పేర్కొంది. ఈ స్వాధీనం తమ సంస్థ మరింత పటిష్టానికి దోహదం చేయనుందని తెలిపింది. అమరాక్స్ వేదిక ద్వారా యూరోపియన్ యూనియన్‌లో మరింత మంది వినియోగదారులను చేరడంతో పాటు తమ ఉత్పత్తుల విక్రయాలను పెంచుకోవడానికి దోహదం చేయనుందని హెటిరో లాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎవి నరస రెడ్డి పేర్కొన్నారు. తాజా కొనుగోలుతో సంస్థ ఐరోపా మార్కెట్లో అనుబంధ బ్రాండ్‌తో పాగా వేయడంతో పాటు మార్కెట్‌ను మరింతగా విస్తరించేందుకు వీలుపడుతుందని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి.

టీఐసీసీకి తెలంగాణ అధ్యక్షుడిగా శోభన్ బాబు

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: 'ట్రైబల్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ'కి (టీఐసీసీఐ) కొత్త కార్యవరంగ ఎంపికైంది. షెడ్యులు తెగలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తగిన తోడ్పాడుటును, చేయూతను అందించడంతో పాటు వారికి అనువుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధాన రూపకల్పన జరిగేలా చూసేందుకు టీఐసీసీఐ ప్రధానంగా కృషి చేస్తూ వస్తోంది. దీనికి తోడు ఇప్పటికే వ్యాపారాలు ప్రారంభించిన వారికి సదరు వ్యాపారాలు సజావుగా సాగేందుకు కూడా టీఐసీసీఐ ఎంతగానో సాకారం అందిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంతోనే సంస్థ 2015 నుంచి ఔత్సాహికులకు తోడ్పడుతూ ముందుకు సాగుతోంది. టీఐసీసీఐ దక్షిణ విభాగం అధ్యక్షుడిగా బి. బావ్ సింగ్ ఎంపికయ్యారు.



టీఐసీసీఐ తెలంగాణ రాష్ట్ర చాప్టర్ అధ్యక్షుడిగా బి. శోభన్ బాబు, తెలంగాణ చాప్టర్ ప్రధాన కార్యదర్శిగా కె. అరుణ్ కుమార్, కోశాధికారిగా కె. జగన్ కుమార్, డిజిటల్ కోఆర్డినేటర్‌గా భాను చందర్‌లు ఎంపికయ్యారని టీఐసీసీఐ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గంగావత్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

రాజీపడ్డారు

రాఫెల్‌పై రక్షణ శాఖ చేసిన శ్రమ వృధా

● ఫ్రాన్స్‌తో పక్కాగా రక్షణశాఖ కమిటీ చర్చలు
● పీఎంవో జోక్యంతో అంతా తారుమారు



న్యూఢిల్లీ : దేశ రాజకీయాల్ని 'రాఫెల్ యుద్ధ విమానాల' ఒప్పందం తీవ్రంగా కుదిపేస్తోంది. కేంద్ర ప్రభుత్వ వర్గాల నుంచి అనేక విషయాలు మీడియాకు నిరంతరం లీక్ అవుతున్నాయి. తాజాగా బయట కొచ్చిన మరో విషయం, రాఫెల్ విమానాల కొనుగోలుపై భారత్-ఫ్రాన్స్ మధ్య చర్చలు కీలక దశకు చేరు కున్న తరుణంలో ప్రధాని మోడీ తరపున ప్రధానమంత్రి కార్యాలయం కలుగజేసుకుంది. ఒప్పందానికి సంబంధించి చాలా సున్నితమైన అంశాల పట్ల ప్రధాని కార్యాలయం రాజీపడింది...అని కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతస్థాయి వ్యక్తులే చెబుతున్నారు. దీనికి సంబంధించి కీలక ఫైళ్లు ప్రధాని కార్యాలయంలో ఉన్నాయని మీడియాకు తెలియజేశారు. డిసెంబరు, 2015 సమయంలో ఇదంతా జరిగినట్టు వారు చెప్పారు. భారత రక్షణ శాఖ సంప్రదింపుల కమిటీ మొదట, యుద్ధ విమానాలను ఎంతలో కొనవచ్చు? అన్నదానిపై ఒక అంచనా నివేదికను తయారుచేసింది. స్వతంత్ర కమిటీ తయారుచేసిన ఈ నివేదికను కేంద్ర మంత్రివర్గ సంఘానికి పంపారు. 2015 డిసెంబరులో రక్షణ మంత్రిగా ఓవైపు మనోహర్ పారికర్ నేతృత్వంలోని ఈ బృందం ఒప్పందంపై కీలక చర్చలు జరుపుతోంది. అవి కీలకదశకు చేరుకున్నాయి కూడా! కానీ హఠాత్తుగా మోడీ ఫ్రాన్స్‌కు వెళ్లి ఏకపక్షంగా కొత్త ఒప్పందం చేసుకొని వచ్చారు.

యుద్ధ విమానాల కొరత ఉందని..

సైన్యానికి యుద్ధ విమానాల కొరత తీవ్రంగా ఉన్నందున ప్రధాని చేసుకొని వచ్చిన కొత్త ఒప్పందం కాగితాలపై మనోహర్ పారికర్ సంతకాలు చేయాల్సి వచ్చింది! దీనివల్ల భారత్ నష్టపోయిందని ఆ తర్వా త బయటపడింది. రాఫెల్ యుద్ధ విమానాల కాంట్రాక్ట్ రెండు దేశాల ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం. కాబట్టి దీనికి ఫ్రాన్స్ నుంచి సార్వభౌమాధికారంతో కూడిన ఒక హామీ ఉండాల్సిందే. కానీ అలా లేదు. మన ప్రధానమంత్రి కార్యాలయం ఈ విషయంలో రాజీ పడింది. ఒప్పందంలో చోటుచేసుకున్న మరో మార్పు, యుద్ధ విమానాల కొనుగోలు విలువ 8.2 బిలియన్ యూరోలకు పెరగటం, యుద్ధ విమనాల సంఖ్య 36కు తగ్గటం. ఈ అంశాల జోలికి వెళ్లకుండానే రక్షణ శాఖ సంప్రదింపుల కమిటీ 2016 జనవరిలో తుది ఆమోదం తెలిపింది. ఆగస్టు, 2016లో కేంద్ర క్యాబినెట్ ఈ ఒప్పందాన్ని ఆమోదించింది. దీనిపై రక్షణ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులంతా అభ్యంతరం వ్యక్తం చేశా రు. రక్షణశాఖ మంత్రిగా పారికర్ సైతం సంతకం చేయలేదని తెలిసింది.

కోర్టును తప్పుదారి పట్టించారు..

● రాఫెల్ తీర్పుపై సుప్రీంలో రివ్యూ పిటిషన్

న్యూఢిల్లీ : రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై సుప్రీంకోర్టును కేంద్రం తప్పుదారి పట్టించిందని, తీర్పును పున:సమీక్ష చేయాలని కోరుతూ పిటీషన్ దాఖలైంది. డిసెంబర్ 14 నాటి తీర్పును సమీక్షించాలని కోరుతూ మాజీ కేంద్ర మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి, న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లు బుధవారం సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం సంతకం చేయకుండా సీల్డ్ కవర్‌లో ఇచ్చిన నోట్‌లో పేర్కొన్న అవాస్తవ అంశాల ఆధారంగా తీర్పు వెలువరించారని వారు ఆరోపించారు. బహిరంగ కోర్టులో తమ పిటిషన్‌ను విచారించాలని వారు విజ్ఞప్తి చేశారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో భారీ అవకతవకలు జరిగినట్టు తమకు కనిపించడం లేదని గత ఏడాది డిసెంబర్‌లో సుప్రీంకోర్టు కేంద్రానికి అనుకూలంగా తీర్పును వెల్లడించిన సంగతి తెలిసిందే. రక్షణ ఉత్పత్తుల సేకరణ విధానాల (డీపీపీ) ప్రకారమే మోడీ ప్రభుత్వం ముందుకు వెళ్లిందని కోర్టు పేర్కొంది.

బతుకమ్మ చీరల బకాయిలు రూ.90 కోట్లు

పరిశ్రమ యజమానుల నెత్తిన అప్పుల భారం

● నాలుగు నెలలుగా ఎదురుచూపులు



నవతెలంగాణ-సిరిసిల్ల

లక్ష్యానికి తగ్గట్టు సకాలంలో ఉత్పత్తులను అందించిన వస్త్ర పరిశ్రమకు బకాయిలు భారీగా పేరుకుపోయాయి. దీంతో నెలల తరబడి కష్టపడి సరుకును అందించిన యజమానులు నాలుగు నెలలుగా ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి రూ.90 కోట్లు బకాయిలు విడుదల కాక పోవడంతో పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీ భారం పెరిగిపోతున్నదని ఆవేదన వ్యక్తమవుతున్నది.

రెండేండ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు శాశ్వత ఉపాధి కల్పించడంలో భాగంగా 'బతుకమ్మ' చీరెల పథకాన్ని తీసుకొచ్చింది. కార్మికులకు, ఆసాములకు ఆసరా కల్పించేందుకు 2017లో ఈ పథకానికి అంకురార్పణ జరిగినా పండగ నాటికి చీరెలు ఆర్డర్ ఇవ్వడంలో ఆలస్యమైంది. దీంతో లక్ష్యంలో కొద్దిశాతమే సిరిసిల్లలో ఉత్పత్తికాగా మిగతా చీరెలన్నీ సూరత్‌లాంటి ప్రాంతాల నుంచి ప్రభుత్వం దిగుమతి చేసుకుంది. ఈ అపవాదును తుడిచిపెడుతూ 2018లో ఆర్డర్ ఇచ్చేందుకు ముందుగానే వచ్చింది. రూ.220కోట్ల వ్యయంతో 90లక్షల చీరెల ఉత్పత్తి ఆర్డర్‌ను సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇచ్చింది. ఇక్కడి పరిశ్రమ 8 రంగుల్లో నాణ్యమైన చీరెలను సకాలంలో ఉత్పత్తి చేసి అందించింది. ఈ క్రమంలో ప్రభుత్వం 'ముందస్తు' ఎన్నికలకు పోవడంతో పండగకు ముందునేగా 'కోడ్' కూయగా బతుకమ్మ చీరెల పంపిణీ నిలిచిపోయింది. తిరిగి అదే ప్రభుత్వం డిసెంబర్ మళ్లీ అధికారంలోకి రాగానే గోదాముల్లోని బతుకమ్మ చీరెలను అదే నెలలో పంపిణీ చేసింది.

రూ.90కోట్ల బకాయిలు..

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని 110 మ్యాక్ సొసైటీలు, 50 ఎన్ఎస్ఐ సొసైటీలు సకాలంలో బతుకమ్మ చీరెలను అందించాయి. చీరెల ఉత్పత్తికి కావాల్సిన ముడిసరుకుకు పరిశ్రమ యజమానులు అప్పులు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టారు. ఈ క్రమంలో వారికి చెల్లించాల్సిన రూ.90కోట్ల బకాయిలకు సర్కారు ముందస్తు ఎన్నికలతో 'కోడ్' అడ్డువచ్చింది. చీరెలందించిన నాలుగు నెలల తరువాత ఎన్నికలు ముగిసి, అదే ప్రభుత్వం గతనెలలో మళ్లీ అధికారంలోకి వచ్చింది. చీరెల ఉత్పత్తికి కావాల్సిన ముడిసరుకుకు అప్పులు చేస్తే వచ్చే లాభాలు వడ్డీలకే సరిపోయే ప్రమాదముందని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆర్వీఎం ఇచ్చిన ఆర్డర్‌లో పూర్తయిన ఉత్పత్తుల్లో ఇంకా 5 శాతం బిల్లులు రావాల్సి ఉందని చెబుతున్నారు.

లాభం వడ్డీలకే పోతున్నది



ప్రభుత్వ ఆర్డర్ ప్రకారం బతుకమ్మ చీరెలు ఉత్పత్తి చేసి సకాలంలో అందించాం. చీరెల ఉత్పత్తి కోసం ముడి సరుకు కొనేందుకు అప్పులు చేశాం. ప్రభుత్వం బిల్లులు చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో తమకు వచ్చే లాభం వడ్డీలకే సరిపోతోంది. ఇంకా జాప్యం చేస్తే తాము నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుంది.

- వేముల దామోదర్, యాజమాని

బకాయిలు వెంటనే చెల్లించాలి



వస్త్ర పరిశ్రమకు బకాయి ఉన్న బతుకమ్మ చీరల డబ్బులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. చీరెల ఉత్పత్తి కోసం చిన్న యాజమానులు అప్పులు చేసి మరీ చీరెలు ఉత్పత్తి చేశారు. నాలుగు నెలలుగా బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేయడంతో వారిపై వడ్డీ భారం పడుతోంది. ప్రభుత్వం చిన్న యాజమానులను దృష్టిలో ఉంచుకుని బకాయిలు వెంటనే చెల్లించాలి.

- పంతంగం రవి, సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి

మరో 30 రోజులు ఆ ఇద్దరే

● కోడ్ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ వద్దు ● అసెంబ్లీ సమావేశాలకు అనుమతి తప్పనిసరి
● రైతుబంధు, బతుకమ్మ చీరల పంపిణీకి బ్రేక్ ● మధ్యవేలుకు ఇంకు
● ప్రభుత్వానికి ఎస్ఈసీ ఆదేశాలు ? ● సాధారణ పరిశీలకుల నియామకం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



మరో 30 రోజులు రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి హోంమంత్రి పాలనే కొనసాగనుంది. మంగళవారం పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కావడం, వెంటనే ఎన్నికల "కోడ్" అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ చేపట్టరాదని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వాన్ని ఆదేశించినట్టు సమాచారం. అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలంటే తమ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని స్పష్టం చేసింది. దీంతో మరో 30 రోజుల వరకు కొత్త మంత్రివర్గం కొలువు తీరే అవకాశం లేదు. శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడి 20 రోజులు దాటినా టీఆర్ఎస్ మంత్రివర్గ విస్తరణ చేపట్టలేదు. గత ఏడాది 13న రాష్ట్ర ముఖ్యమంత్రిగా కె చంద్రశేఖర్‌రావు, హోంమంత్రిగా మహమూద్ అలీ మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. తొందరలోనే మంత్రివర్గ విస్తరణ చేపడుతామని ప్రమాణస్వీకారం తర్వాత సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. కానీ సంక్రాంతి మాసమంతా మంచి రోజులు కావన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి మంత్రివర్గ విస్తరణ చేపట్టలేదు. సంక్రాంతి అనంతరం విస్తరణ చేపట్టేందుకు కసరత్తు చేశారు. ఈ లోపే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఫిబ్రవరి ఒకటి వరకు కొత్త మంత్రివర్గం, అదేవిధంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారలను బదిలీ చేయరాదని ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది.

రైతుబంధు, బతుకమ్మ చీరలకు బ్రేక్

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నియమావళి నేపథ్యంలో రైతుబంధు చెక్కులు, బతుకమ్మ చీరల పంపిణీ వెంటనే నిలిపివేయాలని ఎన్నికల సంఘం ప్రభుత్వాన్ని ఆదేశించింది. పాలనకు అడ్డంకులు ఏర్పడకుండా ఉండేందుకు గాను పాలకమండళ్లు ఉన్న చోట, జిల్లా, మండల మున్సిపల్ సర్వసభ్య సమావేశాలు నిర్వహించుకోవచ్చని తెలిపింది. కానీ ఈ సమావేశాల్లో ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవద్దని సూచించింది.

నగదు రవాణాపై నజర్

పంచాయతీ ఎన్నికల సందర్భంగా నగదు రవాణాపై ఎస్ఈసీ దృష్టి పెట్టింది. రోజుకు రూ.50వేలు మాత్రమే వెంట తీసుకువెళ్లాలని ఎస్ఈసీ అనుమతించింది. నగదు, మద్యం రవాణాను అరికట్టడానికి రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఎన్నికల ఫిర్యాదుల కోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపింది.

ఎడమ చేతి వేలుకు ఇంకు

పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ఓటరు ఎడమ చేతి మధ్య వేలుకు ఇంకు పెట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఇటీవలనే శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటరుకు ఎడమ చేతి చూపుడు వేలుకు ఇంకు పెట్టిన విషయం తెలిసిందే. ఇంకా ఆ వేలుకు ఇంకు తొలగకపోవడంతో ఎస్ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది.

కోడ్ అమలుకు ఐఏఎస్‌లు

పంచాయతీ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం 26 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను పరిశీలకులుగా నియమించింది. వీరికి తోడు మరో 39 మందిని వ్యయ పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి నాగిరెడ్డి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు 26 మంది సాధారణ పరిశీలకులు ఎన్నికల సంఘం వద్ద డిప్యూటేషన్‌పై పని చేస్తున్నట్టుగా భావించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరికి టీఏ, డీఏ, ఇతరత్ర ఖర్చులు వారి ప్రస్తుతం పని చేసే ప్రభుత్వ శాఖ బడ్జెట్ పద్దు నుంచి ఖర్చు చేయాలని సూచించారు. త్వరలోనే ఎన్నికల సంఘం పరిశీలకులతో సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు.

సాధారణ పరిశీలకులు వీరే

రాష్ట్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకులుగా నియమించిన వారిలో పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెన్హర్ మహేశ్‌దత్ ఎక్కా, ఉన్నతవిద్య కార్యదర్శి నవీన్ మిట్టల్, భూ రికార్డుల కమిషనర్ ఎల్ శశిధర్, చేతివృత్తుల కార్పొరేషన్ ఎండీ శైలజా రామయ్యర్, పరిశ్రమల శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ అనితా రాజేంద్ర, వ్యవసాయ శాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా, క్రీడా సాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎ దినకర్‌బాబు, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినా చౌఘ్తూ, సాధారణ పరిపాలన శాఖ కమిషనర్ జి కిషన్, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ టి చిరంజీవులు, పాఠశాల విద్య డైరెక్టర్ టి విజయకుమార్, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్య కార్యదర్శి పి సత్యనారాయణరెడ్డి, ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ డైరెక్టర్ ప్రీతిమీనా, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ అలగు వర్షిణి, సీసీఎల్ఏ డైరెక్టర్ వాకాటి కరుణ, అయిల్‌ఫెడ్ ఎండీ కె నిర్మల, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ సంయుక్త కార్యదర్శి బి భారతి లక్పతినాయక్ మహిళా శిశుసంక్షేమ శాఖ డైరెక్టర్ విజయేంద్ర ఉపాధి -శిక్షణ శాఖ విభాగం డైరెక్టర్ వై నాయక్, సెర్ప్ సీఈఓ బోసు, ప్రోటోకాల్ సంయుక్త కార్యదర్శి ఎస్ అర్వీందర్ సింగ్‌లను నియమించింది.



నిత్యాదాయ ఆలుగడ్డ

బంగాళదుంప స్వల్పకాలంలో పండించే శీతాకాలపు పంట. మన రాష్ట్రంలో సుమారు 4847హెక్టార్లలో 96930 టన్నులు ఉత్పత్తి చేయబడుతుంది. రాష్ట్రంలో ముఖ్యంగా మెదక్, సిద్ధిపేట, జగిత్యాల, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, శంషాబాద్ జిల్లాలో సాగవుతుంది.

వాతావరణం: చల్లని వాతావరణం అవసరం. పగటి ఉష్ణోగ్రత 32 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రత15నుంచి 20 డిగ్రీల సెల్సియస్ మధ్య చాలా అనుకూలం. అధిక ఉష్ణోగ్రతలో గడ్డల పెరుగుదల ఉండదు.

నేలలు: నీటి పారుదల, మురుగు నీటి వసతిగల ఇసుక లేక ఎర్రగరప నేలలు అనుకూలం. పిహెచ్ 5.2-7 ఉండాలి. ఆమ్ల లక్షణాలు గల నేలలు, బరువైన నేలలు గడ్డలు(దుంపలు) పెరుగుదలకు అనుకూలం కాదు.

పంట కాలం: రబీ కాలంలో సాగుకు అనుకూలం.

రకాలు

కుఫ్రీ లాలిమ్: మొక్కలు మధ్యస్థ పొడువుతో ఆకుపచ్చ ఆకులు కలిగి ఉంటాయి. గడ్డలు మధ్యస్థంగా గుండ్రంగా లేత ఎరుపు రంగులో ఉంటాయి. 90నుంచి 140 రోజుల్లో కోతకు వచ్చి ఎకరానికి 11నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుంది.

కుఫ్రీ బాద్‌షా: మొక్కలు మధ్యస్థ పొడువుగా ఉండి పాకే లక్షణాలు కలిగి ఉంటాయి. ఆకులు లేద ఆకుపచ్చ రంగులో ఉంటాయి. గడ్డలు మధ్యస్థంగా ఉండి గుండ్రంగా ఉండి తెల్లగా ఉంటాయి. 90నుంచి 140 రోజుల్లో కోతకొచ్చి ఎకరానికి 10నుంచి 11టన్నుల దిగుబడివస్తుంది.

కుఫ్రీ చంద్రముఖి: మొక్క కొంత వరకు పాకే లక్షణాన్ని కలిగి ఉంటుంది. ఆకులు వెడల్పుగా ఉండి గడ్డ పెద్దదిగా గుండ్రంగా ఉంటుంది. గడ్డ పైపొర గోదుమ రంగులో ఉంటుంది.కండ లేత పసుపు రంగులోఉంటుంది. 90నుంచి 100 రోజుల్లో ఎకరానికి 10టన్నుల దిగుబడి వస్తుంది.

కుఫ్రీ సింధూర్: మొక్కలు నిలువుగా ఆకులు చిన్నవిగా ఉంటాయి. గడ్డలు మధ్యస్థంగా గుండ్రంగా కండ లేత పసుపు రంగులో ఉండి కళ్ళుపైపైన ఉంటాయి. 110 రోజుల్లో కోతకొచ్చి ఎకరానికి 9నుంచి 10 టన్నుల దిగుబడినిస్తుంది. లేట్‌బ్లైట్ తెగులను తట్టుకుంటుంది. మన రాష్ట్రంలో పండించడానికి, నిల్వ చేయడానికి అనుకూలమైన రకం. పై రకాలే కాకుండా కుఫ్రీజ్యోతి, కుఫ్రీలవకర్, కుఫ్రీబహార్, సదాబహార్, చిప్‌సోనా 1,2,3, రకాలు, కుఫ్రీఆనంద్, కుఫ్రీ సూర్య, 116,117,166,107, ఎస్-1, ఎస్-2 స్పెషల్ సెలక్షన్స్ రకాలు కూడా మన రాష్ట్రంలో సాగులో ఉన్నాయి.

నేల తయారి: నేలను నాలుగు నుంచి 5సార్లు దున్నాలి. ఎకరానికి 10నుంచి 12 టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్ని, చదును చేయాలి. 50 సె.మీ ఎడంతో బోదెలు, కాల్వలు చేయాలి. తొందరగా మొలకెత్తడానికి (నిద్రావస్థను తొలగించడానికి): శీతల గిడ్డంగుల నిల్వ నుండి తీసిన ఆలుగడ్డ విత్తన దుంపలను తొందరగా మొలకెత్తించడానికి, వాటిని 30 సెం.మీ మందం కన్నా మించకుండా నీడలో పరిచి కనీసం 7నుంచి 10 రోజుల పాటు ఆరనీయాలి. గాలి చొరబడడానికి రెండు మూడు సార్లు విత్తన దుంపలను తిరగతిప్పాలి. పెద్ద సైజు దుంపలను శుభ్రంగా నీటిలో కడిగి 30 నుంచి 40 గ్రా. ఉండేలా దుంపలను ముక్కలుగా కోయాలి. 100గ్రా.థయోయూరియా, 10 మి.గ్రా జిబ్బరిల్లిక్ ఆసిడ్ 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణంలో విత్తనం దుంపలను ముంచి తీసి బాగా ఆరబెట్టి, ఆ తర్వాత కుప్పగా చేసి 24నుంచి 48 గంటలుంచిన తర్వాత విత్తుకుంటే మొలక శాతం బాగా ఉంటుంది. ఈ ద్రావణంలో 500కిలోల వరకు విత్తనాన్ని శుద్ధి చేయవచ్చు.

విత్తడం: తెగులు సోకని, ఆరోగ్యమైన దుంపలను ఎన్నిక చేసుకోవాలి. దాదాపు 30నుంచి 40గ్రా. బరువుతో రెండు లేక మూడు కళ్లు ఉండి, అప్పుడే మొలకెత్తడం ప్రారంభించిన వాటిని విత్తడానికి ఎంపిక చేసుకోవాలి. ముక్కలు చేసి విత్తన గడ్డలు ఎకరానికి 6నుంచి 8క్వింటాళ్ల అవసరం ఉంటుంది. విత్తనాల ద్వారా వ్యాప్తి చెందే శిలీంద్రాల నివారణకు విత్తనశుద్ధి తప్పని సరిగా చేయాలి. 25నుంచి 50 గ్రా.బగలాల్ (మిథైల్ ఇథాక్సీ మెర్క్యూరిక్ క్లోరైడ్) 10.లీ. నీటిలో కలిపిన ద్రావణంలో 2నుంచి 5 నిమిషాలపాటు ఉంచాలి. ఒకసారి తయారు చేసిన మందు ద్రావణాన్ని మూడు సార్లు మాత్రమే విత్తనశుద్ధికి ఉపయోగించాలి. బోదెలకు ఒక పక్కగా కళ్లు పైభాగంవైపు ఉండే విధంగా విత్తన దుంపలపు నాటుకోవాలి. మొక్కల మధ్య 20సె.మీ వరుసల మధ్య 50 సెం.మీ ఎడం ఉండాలి. లీటరు నీటికి 3గ్రా. మాంకోజెట్ చొప్పున తయారు చేసిన ద్రావణంలో కూడా ఈ దుంపలను సుమారు అరగంట ఉంచిన తర్వాత విత్తశుద్ధి చేసుకోవాలి.

నీటి యాజమాన్యం: నేలను, వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని నీరు పెట్టాలి. చెలక నేలల్లో మొలకెత్తడానికి ముందు 7నుంచి 8 రోజుల వ్యవధితోనూ దుంప ఏర్పడేటప్పుడు 4నుంచి 5 రోజుల వ్యవధితోనూ నీరు పెట్టాలి.

కలుపు నివారణ-అంతరకృషి: అభివృద్ధి చెందుతున్న దుంపలపై సూర్యరశ్మి పడితే దుంప ఆకుపచ్చరంగుకు మారుతుంది. కనుక విత్తన నెల రోజుల తర్వాత సుమారు మూడుసార్లు మట్టిని ఎగదోయాలి. విత్తిన రెండు మూడు రోజుల్లో ఎకరానికి ఒక లీటరు అలాక్లోర్ పిచికారి చేయాలి. అదే విధంగా 300గ్రా. మెట్రిబుజిన్ కూడా పిచికారీ చేసి కలుపు నివారించుకోవచ్చు.

ఎరువుల యాజమన్యాం: చివరి దుక్కిలో ఎకరానికి 10 నుంచి 12టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. దుక్కిలో ఎకరానికి 40 కిలోల యూరియా, 150కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 30 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత 40కిలోల యూరియా, 50 రోజులకు మరోసారి 20కిలోల యూరియా, 30కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.

సస్యరక్షణ పురుగులు

దుంప తొలిచే పురుగులు (ట్యూబర్‌మాత్): ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పుడు దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మన



రాష్ట్రంలో ఈ పురగు ఉధృతి చాలా తక్కువగా ఉంది. ఈ పురుగు ప్రభావం పొలంలో పంటపైన మొదట ప్రారంభమైన తర్వాత గోదాముల్లో నిల్వ చేసినప్పుడు అధికమవుతుంది. పురుగు తొలచిన దుంపలు గుల్లబారి, పుచ్చిపోతాయి. 30శాతం వరకు దుగుబడులు కానీ నిల్వలోగానీ నష్టం వాటిల్లుతుంది.

నివారణ పద్దతులు

దుంపలు బయటపడకుండా ఎప్పటికప్పుడు బోదెల పైకి మట్టిని ఎగదోయాలి. పురుగు ఆశించిన దుంపలను గుర్తించి ఏరి నాశనం చేయాలి. దుంపలను 3 సెం.మీ మందం ఇసుక పేర్చి వాటిపై ఉంచాలి.పొలంలో ఈ పురుగుని అరికట్టడానికి లీటరు నీటికి 3గ్రా. కార్బరిల్ పడి మందు ఎకరానికి 600గ్రా. 200లీటర్ల నీటికి కలిపిన ద్రావణం పిచికారి చేయాలి.నిల్వ చేసేటప్పుడు కూడా గోదాములో సంచులపై మలాథియాన్ 3 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.గోదాములో కార్బన్‌డైసల్ఫేడ్ లేదా మిథైల్‌బ్రోమైడ్ లేదా కార్బన్‌టెట్రా క్లోరైడ్‌తో ఫ్యూమిగేషన్ చేయాలి.

రసం పీల్చే పురుగులు (పేనుబంక, తెల్లనల్లి,దీపపు పురుగులు):

ఆకుల నుండి రసాన్ని పీల్చినాశనం చేస్తాయి. ఆకులు ముడతలు పడి పసుపు రంగుకు మారిపోతాయి. నివారణకు మిథైల్‌డెమెటాన్ లేదా డైమిథోయేట్ 2మి.లీ లేదా డైక్లోర్‌వాస్ 2మి.లీ లేద ఎసిసేట్ 1గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పేనుబంక వల్ల ఆకుముడత తెగులు వ్యాపిస్తుంది.

తెల్లనల్లి: ఇది కుల కంది భాగంలో గుంపులుగా ఉండి రసంపీల్చి వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేస్తుంది. ఆకులు కురచబారి ముడుచుకుంటాయి. దీని నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ ట్రైజోఫాస్ కలిపి పిచికారి చేయాలి.

పొగాకు లద్దె పురగు: పిల్లపుగులు ఆకుల్లోని ఆకుపచ్చని పదార్థాన్ని దుంపలను తొలచి పంటకు నష్టం కలుగచేస్తాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో ఆశిస్తాయి. నివారణకు ఎండా కాలంలో లోతుగా దుక్కి దున్నాలి.ఆముదపు పంటను ఎర పంటగా వేయాలి. గుడ్ల సముదాయాన్ని ఏరి నాశనం చేయాలి. లింగాకర్షక బుట్టలను ఎకరానికి 4 చొప్పున ఉంచాలి. ఎన్‌పివి ద్రావణాన్ని 250 ఎల్‌యి చొప్పున పిచికారి చేయాలి. పురుగులు



చిన్నవిగా ఉన్నప్పుడు 5శాతం వేపగింజల కషాయాన్ని పిచికారి చేయాలి.పెద్ద పురుగులను నివారించడానికి విషపు ఎరను పెట్టాలి. 10కిలోల తవుడులో 1లీటరు కార్బరిల్‌ను కలిపి కిలో బెల్లం తగినన్ని నీళ్లతో పాకం చేయాలి. ఈ ద్రావణాన్ని రెండు రోజుల పులియబెట్టి తవుడు కలపాలి. తర్వాత ఈ ఎరలను సాయంత్రం వేళల్లో పొలంలో దుంపల కుప్పల చుట్టు ఉంచాలి. ఇదిలా ఉంటే ఆకుతినే పురుగులు, తెగుళ్లు, మొజాయిక్ వైరస్, ఎర్లీబ్లైట్(ఆకుమాడు తెగులు) బ్యాక్టీరియాకుళ్లుతెగులు, లేట్‌బ్లైట్, రింగ్ తెగులు బారిన పడకుండా చూసుకోవాలి.

బంగాళదుంపలో సమగ్ర సస్యరక్షణ

ఎండాకాలంలో లోతుగాదున్ని పురుగులకు సంబంధించిన వివిధ దశలను బయటపెట్టాలి.దుంపలను బోదెలు, కాలువలు చేసి నాటాలి. పంట మార్పిడిని పాటించాలి. నిల్వకు ముందు మాంకోజెట్ 2గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపిన ద్రావణంలో 20నిమిషాలు ఉంచాలి. పొలంలో కలుపు లేకుండా చూసుకోవాలి. చిన్న పురుగులు, ప్యూపాదశలు, వేరుపురుగులు, ఆకుమాడు తెగులు సోకిన ఆకులను దెబ్బతిన్న దుంపలను తీసేయాలి. వేరుపురుగు ఆశించకుండా దుంపలను పెట్టిన తర్వాత 30 రోజులకు మట్టి ఎగదోసేటప్పుడు ఫోరేట్ గుళికలు ఎకరానికి 6కిలోల చొప్పున వేయాలి.

కోత: నేల పైభాగంలో మొక్క వాలిపోయి పసుపు రంగు నుండి గోధుమ రంగుకు మారుతుంది. సాధారణంగా నాటిన 90 నుంచి 100 రోజుల్లో కోతకు సిద్దమవుతుంది. దుంపలకు తగలకుండా జాగ్రత్తగా గడ్డపారతో తవ్వి నీడలో ఆరబెట్టిన తర్వాత నిల్వ చేయాలి.

విత్తనానికి ముందు విత్తన శుద్ధి



వేరుశనగ: రబీ వేరుశనగలో తిక్కా ఆకుమచ్చ తెగులు ఆశించినట్టు గుర్తించారు. విత్తనాన్ని విత్తే ముందు విత్తన శుద్ధి చేయకుండా విత్తిన పరిస్థితుల్లో ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది.

తిక్కా ఆకుమచ్చ తెగులు: ఈ తెగులు పైరు 30 రోజుల్లోపు ఆశిస్తుంది. ఈ ఆకుమచ్చ తెగులు ఆశించినప్పుడు మచ్చలు ఆకుల పైభాగాన ఏర్పడి ముదురు గోధుమ వర్ణంలో ఉంటాయి. ఈ మచ్చలు కనిపించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. ఈ తెగులు నివారణకు క్లోరోథలోనిల్ 400గ్రా. లేదా టెబ్యుకొనజోల్ 200 మి.లీ ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

మామిడిలో నీటి యాజమాన్యం: పూత, పిందె దశలో ఉన్న మామిడి మొక్కలకు నీటిని సరైన సమయంలో ఇచ్చినట్టయితే నాణ్యమైన దిగుబడులను పొందవచ్చు. పది సంవత్సరాల వయస్సు పైబడిన పెద్ద చెట్లకు రోజుకు 50 నుంచి 80 లీటర్ల నీటిని వాతావరణానికి అనుగుణంగా ఇవ్వాలి. మామిడి తోటల్లో పూత బాగా రావాలంటే 3 నెలలు అంటే అక్టోబరు నుంచి డిసెంబరు వరకు బెట్ట అవసరం. పిందె ఏర్పడిన తర్వాత కాయలు బఠాణి గింజ లేదా గచ్చకాయ సైజులో ఉన్నప్పుడు ప్రతి 20 నుంచి 25 రోజులకొకసారి వీరు పెట్టాలి. కాయ కోతకు 20 నుంచి 25 రోజులకు ముందు నీరు పెట్టడం ఆపివేయాలి. కాయలు పూర్తిగా కోసిన తర్వాత ఒకసారి నీరు పెట్టవచ్చు. దీని వల్ల కొత్త చిగుర్లు వస్తాయి.

మిరప: మిరప పంటను బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఆశించి నష్టపరుస్తున్నట్టు గమనించాము. వాతావరణం మబ్బుగా ఉండి, ముసురు వర్షాలు పడినప్పుడు ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులు ఆశించిన ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడి, క్రమేపి అవి పెద్దవై జిగురు వంటి పదార్థం స్రవించబడి నల్లటి గ్రీజువంటి పొద ఏర్పడుతుంది. దీని వల్ల ఆకులు పండుబారి రాలిపోతాయి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్30 గ్రా. 1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటికి కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

శనగ: రైజోక్టోనియా ఎండు తెగులు (డ్రైరూట్ రాట్ ఈ తెగులు భూమి ద్వారా వ్యాప్తి చెందును. సాధారణంగా ఉష్ణోగ్రతలు పెరిగి 25 నుంచి 30 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టయితే ఈ తెగులు ఉధృతి ఎక్కువగా కనబడుతుంది. భూమిలో తేమ బాగా తగ్గినప్పుడు లేదా బెట్ట పరిస్థితుల్లో కూడా తెగులు ఉధృతి పెరుగుతుంది. ఈ తెగులు సాధారణంగా పూత, కాయ సమయంలో కనబడదు. ఈ తెగులు ఆశించినప్పుడు అక్కడక్కడ ఆకులు పాలిపోయి, మొక్క పైభాగం తలలు వాల్చడం, లేదా మొక్క మొత్తంగా ఎండిపోతుంది. మొక్క తీసి చూసినట్టయితే వేరు నల్లగా మారి, కుళ్లిపోయినట్టు కనిపిస్తుంది. ప్రధాన వేరు మాత్రమే కనబడుతుంది. పిల్ల వేర్లు కనిపించకుండా పోతాయి. దీని నివారణకు తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రైకోడెర్మా మిశ్రమం 10 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తుకోవాలి.

విస్తరణ సంచాలకులు
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర,వ్యవసాయ విశ్వవిద్యాలయం

పంటలు- పాటించాల్సిన పద్ధతులు

వ్యవసాయం-వాతావరణం

గడిచిన మూడు రోజులలో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు 27 నుంచి 32 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 05నుంచి 21 డిగ్రీల సెల్సీయస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతారణం పొడిగా ఉండవచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 27 నుంచి 33 డిగ్రీల సెల్సీయస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 10 నుంచి 21డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు.

వరి: తెలంగాణలో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదైనట్టయితే వరి నారుమడిలో చలి ప్రభావం తగ్గించి నారు ఎదుగుదలకు పాలిథీన్ షీట్లతో నారుమడిని రాత్రిపూట కప్పి ఉదయం వేళల్లో తీసేయాలి. ప్రతి రోజు సాయంత్రం నారుమడికి నీరు పెట్టాలి. ఉదయం నీటిని తీసేయాలి. ఎకరం పొలానికి సరిపడే నారుమడికి 2 కిలోల యూరియా పైపాటుగా నారు విత్తిన 10 నుంచి 15 రోజుల్లో చల్లాలి. వరిలో నారుమడులలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను 200 చ.మీ నారు మడికి (5సెంట్లకు) ఒక కిలో చొప్పున నారు పీకడానికి వారం రోజుల ముందు చల్లుకోవాలి.

మొక్కజొన్న: రబీ మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించినట్టు గమనించ డమైంది. నివారణకు విషపు ఎర తయారు చేసుకోవడానికి గాను 10 కిలోల వరి తవుడులో 2 కిలోల బెల్లంను కలిపి 2నుంచి 3 లీ. నీటిని చేర్చి సుమారు 12 గంటల పాటు పులియనిచ్చి మరుసటి రోజు 100గ్రా. థైడికార్బ్‌ను కలుపుకొని ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న ఉండలుగా చేసి మొక్క సుడులలో వేసుకోవాలి. ఎమమేక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా థైమేమిథాక్సాన్ 9.5 శాతం, లానుసైహలోత్రిన్ 12 శాతం 0.5 మి.లీ లేదా క్లోరాన్‌ట్రినిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. పైరు మొలిచిన 10 నుండి 15 రోజుల మధ్య మొవ్వు పురుగు ఆశించే అవకాశాలున్నాయి. నివారణకు క్లోరోపైరిఫాస్ 2.0 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైరు 25 నుంచి30 రోజుల దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరానికి 3నుంచి 4 కిలోల చొప్పున మొవ్వులో వేయాలి.



ద్రాక్ష: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ద్రాక్షలో పక్షికన్ను తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 3 గ్రా. ప్రొఫినెట్ మందును లీటరు నీటిలోకలిపి కత్తిరింపుల తరువాత 20 రోజుల లోపు పిచికారి చేయాలి. ద్రాక్షలో పెంకు పురుగు గమనించడమైంది. నివారణకు 2.5 మి.లీ క్లోరిపైరాపాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితులు ద్రాక్షలో తామర పురుగులు ఆశించుటకు అనుకూలం. ఉధృతి గమనించి 2 మి.లీ ఫిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

నిమ్మ జాతి పంటలు: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు నిమ్మజాతి పంట లో నల్లి ఆశించుటకు అనుకూలం. నివారణకు 3.0మి.లీ ప్రోపర్‌జైట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

జామ: జామ పండులో ఈగ ఉధృతి గమనించడమైంది. నివారణకు ఎకరానికి 4నుంచి 5 లింగాకర్షక బుట్టలను తోటలో అమర్చాలి.

కూరగాయలు: ప్రస్తుత పొడి వాతావరణ పరస్థితులలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు ఫిప్రోనిల్ 2మి.లీ లేదా థయోమిథాక్సిమ్ 0.3 గ్రా. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు టమాటలో ఆకుమాడు తెగులు సోకుటకు అనుకూలం. తెగులు నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1మి.లీ ప్రోఫికొనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. ఆలస్యంగా నాటిన టమాట పైరులో శనగ పచ్చ పురుగు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.25 మి.లీ నోవాల్యూరాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. టమాటలో తామర పురుగులు కూడా ఆశించేందుకు అనుకూలం. నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పశుపోషణ: కోళ్లలో కొక్కెర తెగులు, గొర్రెలలో చిటుకు, మశూచి వ్యాధి, ఆవులు, బర్రెలకు గొంతువాపు వ్యాధి, ఆవులు, ఆంబోతులలో జబ్బవాపు వ్యాధి సోకుటకు అనుకూలం. వీటి నివారణకు టీకాలు వేయించాలి.

-సేకరణ : మోత్కూరు యాదయ్య

కూరగాయల సాగులో సమగ్ర సస్యరక్షణ

నారుమడి: నారును ఎత్తైన నారుమడిలో వరుస క్రమంలో విత్తితే గాలి, వెలుతురు సోకి ఒకే రకంగా మొక్కలు దృఢంగా ఉంటాయి. విత్తన శుద్ధి చేసిన విత్తనాన్నే విత్తాలి. కిలో విత్తనానికి 5గ్రా. ఇమిడాక్లోప్రిడ్ 5గ్రా. కాప్టాన్ 8గ్రా, ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేస్తే రసం పీల్చే పురుగులు, ఆకు మచ్చ తెగుళ్లను నివారించవచ్చు. నారుమళ్ల తెగుళ్ల నివారణకు 3గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మెటలాక్సిల్ 2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి ద్రావణంతో మళ్లను తడపాలి. నారు మొలకెత్తిన 15 నుంచి 20 రోజులకు ఎకరానికి సరిపడే నారుమడికి 80 నుంచి 100 గ్రా. కార్బోఫ్యూరాన్, ఫిప్రోనిల్ గుళికలను ఇసుకతో కలిపి చల్లి నారుమడిని తడపాలి.

ప్రధాన పొలం

వేసవిలో దుక్కిదున్నుట వల్ల నేలలోని నిద్రావస్థ దశలోని పురుగులు, నులిపురుగులు, మొండి జాతి కలుపు మొక్కల ఉధృతి తగ్గుతుంది. ఆఖరి దుక్కిలో ఎకరానికి 200 కిలోల వేప పిండి వేయాలి. ప్రారంభదశలో ఆశించే చీడపీడల నివారణకు నారును నాటే ముందు 20 మి.లీ డైమిథోయేట్, 100 గ్రా. కార్బండజిమ్ 10 లీటర్ల నీటికి కలిపిన ద్రావణంలో 20 నుంచి 30 నిమిషాలు ముంచి నాటుకోవాలి. టమాట, వంగ, మిరప పంటలకు ప్రతి 16 వరుసలకు ఒక వరుస బంతి, క్యాబేజీ, కాలిఫ్లవర్ పంటలకు ప్రతి 25 వరుసలకు రెండు వరుసల ఆవాలు 15 రోజుల వ్యవధిలో ఎర



పంటలుగా నాటాలి. 5శాతం వేప గింజల కషాయాన్ని 10 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. పసుపు రంగు అట్టలకు గ్రీజుకానీ ఆముదం కానీ పూసి పొలంలో అక్కడక్కడ పెట్టి తెల్లదోమ ఉనికి గమనించాలి. రసం పీల్చే పురుగుల నివారణకు అవసరాన్ని బట్టి 10 రోజుల వ్యవధిలో అంతర్వాహిక క్రిమిసంహారక మందులను పిచికారి చేయాలి. క్యాబేజి, కాలిఫ్లవర్‌లో డైమండ్ రెక్కల పురుగు ఉధృతిని బట్టి నోవాల్యురాన్ 1 మి.లీ లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ చొప్పున నీటికి కలిపి పిచికారి చేయాలి. రసం పీల్చు పురుగుల వ్యాప్తిని అరికట్టడానికి పొలం చుట్టూ ఎత్తుగా పెరిగే జొన్న లేదా మొక్కజొన్న పంటలను 4 నుంచి5 వరుసల్లో రక్షల పంటలుగా వేయాలి.

లద్దె పురుగుల యాజమాన్యం

పొలంలో అక్కడక్కడ ఆముదం మొక్కలు పెట్టాలి. గుడ్ల సముదాయాలను, జల్లెడాకులను గమనించి ఏరి నాశనం చేయాలి. పురుగుల ఉనికిని గమనించడానికి ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలు పెట్టాలి. ట్రైకో గ్రామ గుడ్లు పరాన్ని జీవులను ఎకరానికి 20వేల చొప్పున 10 రోజుల వ్యవధిలో 4నుంచి 5సార్లు వదలాలి. వారానికి ఒకసారి చొపున నాలుగు సార్లు ఎన్‌వివి వైరస్ ద్రావణం 250 ఎల్ఇ 200 లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలి. ఎకరానికి 2 చొప్పున పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలి. నాటిన 30 నుంచి 45 రోజులకు బిటి సంబంధిత మందులను 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. లద్దె పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు క్లోరాన్ట్రానిలిప్రోల్ 0.3 మి.లీ లేదా ఇండాక్సికార్బ్0.5 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లీ. చొప్పున కలిపి పైరుపై పిచికారి చేయాలి.

విషపు ఎరలను పొలంలో అక్కడక్కడ ఉంచాలి. లద్దె పురుగుల నివారణకు 10 కి. తవుడు, 1 కి. బెల్లం పాకం, 1కి. కార్బరిల్ 1 లీటరు క్లోరిపైరిపాస్ తగినంత నీటిలో కలిపి చిన్నచిన్న ఉండలు చేసి 24 గంటల తర్వాత పొలంలో అక్కడక్కడ సాయంత్రం సమయంలో పెట్టాలి. తీగజాతి కూరగాయలలో పండు ఈగ నివారణకు మలాథియాన్100 మి.లీ, 100 గ్రా చక్కెర,10 లీటర్ల నీటిలో కలిపి మట్టి మూకుళ్లలో పోసి ఎకరానికి 10 నుంచి 12 చొప్పున అక్కడక్కడ పెట్టాలి. ఎకరానికి మూడు చొప్పున క్యూల్యూర్ బుట్టలను పెట్టడం వల్ల తల్లి పురుగులు ఆకర్షింపబడతాయి.

ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపిన ద్రావణంతో మొక్క మొదలు చుట్టూ తడపాలి. ఆఖరు దుక్కిలో ట్రైకోడెర్మాతో వృద్ధి పర్చబడిన పశువుల ఎరువు వేయాలి. పంట మార్పిడి చేయాలి.

బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం3.0గ్రా.లీ లేదా ట్రైడిమార్ఫ్ లేదా డైనోక్యాప్ 1.0 మి.లీ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారి చేయాలి.


తుప్పు తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లీ. లేదా కార్బండజిమ్, మ్యాంకోజెబ్ 23గ్రా. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

తెగులు సోకిన మొక్కలను, కాయలను ఏరి నాశనం చేసి పరిశుభ్రతను పాటించాలి. చీడపీడలకు ఆశ్రయం కల్పించే వివిధ కలుపు మొక్కలను సకాలంలో నివారించాలి.

అడగండి.. చెబుతాం!

రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.

మా చిరునామా
'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020.
ఫోన్: 8332995392,
kisan@navatelangana.com



చరిత్రను ఛేదిస్తారా?

ఏడు దశాబ్దాల నిరీక్షణ. ఎంతో మంది దిగ్గజాల స్వప్నం. భారత క్రికెట్‌లో ఏండ్లుగా మిగిలిపోయిన ఓ వెలితి!. ఇప్పుడు చరిత్రను ఛేదిస్తూ, చారిత్రక విజయం వేటలో కోహ్లిసేన ఒక్క అడుగు వేస్తే సరిపోతుంది. 2-1 ఆధిక్యంలో నిలిచిన బారత్, సిడ్నీ టెస్టులో నెగ్గితే ఆస్ట్రేలియా గడ్డపై ఆస్ట్రేలియాపై టెస్టు సిరీస్ విజయం సాధించిన రికార్డు భారత్ సొంతమవనున్నది. 2018లో విదేశీ ఓటములతో విమర్శలు ఎదుర్కొన్న కోహ్లిసేన, 2019ను చారిత్రక విజయంతో మొదలెట్టాలని తపిస్తోంది. అందుకు ఆస్ట్రేలియా అంతు సులువుగా తలొగ్గుతుందా? చరిత్ర వేటలో టీమ్ ఇండియాను అడ్డుకోగలదా? నేటి నుంచి భారత్, ఆసీస్ ఆఖరి టెస్టు ఆరంభం.

- చారిత్రక విజయంపై కోహ్లిసేన కన్ను
- అడ్డుకోవాలని ఆసీస్ పోరాటం
- నేటి నుంచి సిడ్నీ టెస్టు సమరం

ఉదయం 5 నుంచి సోనీసిక్స్‌లో..

సిడ్నీ (ఆస్ట్రేలియా)

కొత్త ఏడాదిలో కోహ్లిసేన చరిత్రను వేటాడుతోంది. కంగారూ గడ్డపై టెస్టు సిరీస్ విజయం సాధించిన తొలి భారత కెప్టెన్‌గా నిలిచే అరుదైన ఘనత దక్కించుకునేందుకు విరాట్ అడుగు దూరంలోనే ఉన్నాడు. నేడు సిడ్నీలో ఆరంభమయ్యే చివరి టెస్టులో విజయంతో 3-1తో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ముద్దాడేందుకు టీమ్ ఇండియా కృత నిశ్చయంతో కనిపిస్తోంది. మరోవైపు స్టార్స్ అండ లేని వేళ చతికిల పడిన కంగారూ శిబిరం కొత్త ఏడాదిలో కోహ్లిసేన చరిత్ర వేటలో అడ్డు నిలువాలని ప్రయత్నిస్తోంది. మానసికంగా భారత్ చేతిలో ఓడిన ఆస్ట్రేలియా, మైదానంలో ఏ మేరకు పోటీనిస్తుందనే విషయం ఆసక్తికరంగా మారింది.

కోహ్లిసేనకు ఎదురుందా? : పెర్త్ ఓటమి తర్వాత భారత్ గొప్పగా పుంజుకున్నది. నం.1 జట్టుకు ఉండాల్సిన ప్రాథమిక లక్షణాన్ని బాక్సింగ్ డే విజయంతో నిరూపించింది. రోహిత్ శర్మ లేని వేళ కెఎల్ రాహుల్‌కు సిడ్నీలో మరో అవకాశం లభించనున్నది. మయాంక్‌తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు. పుజారా, కోహ్లి, రహానెలు మంచి ఫామ్‌లో ఉన్నారు. స్పిన్ ఫ్రెండ్లీ సిడ్నీలో వీరి జోరు కొనసాగితే పర్యాటక జట్టుకు ఎదురుండదు. హనుమ విహారి ఆరో స్థానంలో సత్తా చాటాలని ఎదురుచూస్తున్నాడు. బంతితో భారత్ పటిష్టంగా ఉంది. ఇషాంత్ శర్మ సిడ్నీ టెస్టులో లేకపోవటం ఆశ్చర్యం కలిగించినా.. బుమ్రా, ఉమేశ్, మహ్మద్ షమిలతో కూడిన పేస్ త్రయం భీకర ఫామ్‌లో ఉంది. రవీంద్ర జడేజాతో కలిసి విహారి స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నాడు. తొలి మూడు టెస్టుల్లో నం.1 ప్రదర్శన చూపిన కోహ్లిసేన, సిడ్నీలోనూ అదరగొట్టి చరిత్రను పట్టేయాలనే సంకల్పంతో బరిలోకి దిగబోతున్నది.

20 యార్కర్ల హీరో బుమ్రా దిగ్గజ కపిల్ రికార్డును బద్దలు కొట్టేందుకు సిద్ధమవుతున్నాడు. ఆస్ట్రేలియాలో ఓ టెస్టు సిరీస్‌లో అత్యధిక వికెట్ల ఘనత (25 వికెట్లు) కపిల్ దేవ్ పేరిట ఉంది. తొలి మూడు టెస్టుల్లో 20 వికెట్లు కూల్చిన బుమ్రా, సిడ్నీలో సిక్సర్ కొడితే రికార్డు అతడి సొంతమవుతుంది.

1 సిడ్నీ టెస్టు నెగ్గితే కోహ్లిసేన కొత్త చరిత్ర సృష్టించనున్నది. ఏడు దశాబ్దాల ద్వైపాక్షిక క్రికెట్‌లో కంగారూ నేలపై భారత్ ఎన్నడూ టెస్టు సిరీస్ విజయం సాధించలేదు. భారత్ ప్రస్తుతం ఆ చారిత్రక విజయం ముంగిట నిలిచింది.

ఆసీస్ పుంజుకునేనా? : ఆతిథ్య ఆస్ట్రేలియాకు చారిత్రక ఓటమి భయం పట్టుకున్నది. ఆసీస్ శిబిరంలో ట్రావిశ్ హెడ్ అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు. టాప్ ఆర్డర్‌లో ఎవ్వరూ రాణించని ఫలితమే ఇది. హెడ్ సైతం అన్ని ఇన్నింగ్స్‌ల్లో ఆకట్టుకోలేదు. తాజా సిరీస్‌లో ఆసీస్‌కు నిలకడగా ఆడిన ఆటగాడే లేడు. అరోన్ ఫించ్ పూర్తిగా నిరాశపరిచాడు. పైన్ పోరాడినా, లక్ష్యం లేని ఇన్నింగ్స్‌లతో ఎటువంటి ప్రయోజనం ఒరుగలేదు. ఖవాజాపై ఆశలు పెట్టుకున్నా అతడూ విఫలమయ్యాడు. కొత్త ఓపెనర్ హారిస్ సంగతీ అదే. బెంచ్‌కు పరిమితమైన హ్యాండ్స్‌కాంబ్ సిడ్నీలో తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. భారత పేస్‌ను ఎదుర్కొనే సత్తా లేని ఆసీస్ బ్యాటింగ్ లైనప్, తొలుత ఆ బలహీనతను సరి చేసుకోవాలి. బంతితో కమిన్స్, స్టార్క్‌లు అంచనాలను అందుకున్నారు. కానీ హెజిల్‌వుడ్ రాణించాల్సి ఉంది. స్పిన్నర్ నాథన్ లైయాన్ మెల్‌బోర్న్‌లో తేలిపోయాడు. కానీ టర్న్ లభించే పిచ్‌పై మార్నస్‌తో కలిసి లైయాన్ ప్రభావం చూపించే అవకాశం లేకపోలేదు.



పిచ్ రిపోర్టు : ఆతిథ్య జట్టుకు అనుకూల పిచ్‌లు ఇవ్వటం లేదని కంగారూ కెప్టెన్ పైన్ విమర్శ చేసిన నేపథ్యంలో సిడ్నీపై ఆసక్తి పెరిగింది. కానీ తొలి రోజు మినహా సీమ్, బౌన్స్‌కు అనుకూల పరిస్థితులు ఉండబోవని తెలుస్తోంది. బ్యాట్స్‌మన్, పేసర్లు, స్పిన్నర్లకు సమాన అవకాశాలు లభిస్తాయని క్యూరేటర్ జస్టిన్ గ్రోవ్స్ అన్నాడు. ఎండ కాస్తోన్న వేళ రెండో రోజు నుంచే బంతి తిరిగే అవకాశం ఉంది. చివరి రెండు రోజులు వర్ష సూచన ఉన్నా, మ్యాచ్‌కు ఆటంకం కలిగించే ప్రమాదం లేదు!.

భారత్ : మయాంక్ అగర్వాల్, కెఎల్ రాహుల్, చతేశ్వర్ పుజార, విరాట్ కోహ్లి, అజింక్య రహానె, హనుమ విహారి, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్, జశ్‌ప్రీత్ బుమ్రా.

ఆస్ట్రేలియా : మార్కస్ హారిస్, ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్, పీటర్ హ్యాండ్స్‌కాంబ్/అరోన్ ఫించ్, ట్రావిశ్ హెడ్, మార్నస్, టిమ్ పైన్, పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, నాథన్ లైయాన్, జోశ్ హెజిల్‌వుడ్.

నిజాయితీగా చెబుతున్నా. జరిగిపోయినది నా చేతుల్లో లేదు. రేపు జరుగబోయే దాని గురించి ఆలోచిస్తూ కూర్చోను. వర్తమానంలో ఉండి, ఆడటమే మాకు తెలుసు'

- ఆసీస్‌లో తొలి సిరీస్ విజయం రికార్డుపై కోహ్లి.

ఫిట్‌నెస్ డైలామా!

కోహ్లి-శాస్త్రి శకంలో తుది ఎంపిక డ్రామా కొనసాగుతోంది. ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై రోజుకో మాట, తలో అభిప్రాయం వెల్లడిస్తూ గందరగోళ పరిస్థితి సృష్టించారు. అశ్విన్ ఫిట్‌గా లేడని జట్టు మీడియా మేనేజర్ ప్రకటించిన రెండు గంటల్లోనే, సిడ్నీ టెస్టు తుది 13 మంది జట్టులో అశ్విన్‌కు చోటు కల్పించాడు కోహ్లి. అశ్విన్ ఫిట్‌నెస్‌పై నేడు ఉదయం టెస్టు ఆరంభానికి ముందు నిర్ణయం తీసుకుంటామని సెలవిచ్చాడు. మరో స్పిన్నర్ జడేజా ఫిట్‌నెస్ విషయంలో చీఫ్ సెలక్టర్, కోచ్, కెప్టెన్‌లు భిన్న వాదనలు వినిపించిన ఘటన మరువక ముందే.. అశ్విన్ విషయంలో ఫిట్‌నెస్ డైలామా విమర్శలకు తావిస్తోంది.



మరో అవకాశం ఇవ్వండి



సిడ్నీ : బాల్ టాంపరింగ్ వివాదంలో ఏడాది నిషేధం ఎదుర్కొంటున్న ఆస్ట్రేలియా మాజీ నాయకత్వం స్టీవ్ స్మిత్, డెవిడ్ వార్నర్ సహా కామెరూన్ బాన్‌క్రాఫ్ట్‌లకు మరో అవకాశం ఇవ్వాలని కంగారూ కెప్టెన్ టిమ్ పైన్ పిలుపునిచ్చాడు. స్మిత్, వార్నర్‌లు లేని ఆస్ట్రేలియా వరుస ఓటములతో సతమతం అవుతోంది. ఏడాదికి ఓటములతో

స్మిత్, వార్నర్‌లపై అభిమానులకు పైన్ పిలుపు

సహజీవనం చేస్తోన్న ఆస్ట్రేలియాకు ఇప్పుడు స్మిత్, వార్నర్ సేవలు అత్యంత అవసరం. ' స్మిత్, వార్నర్‌లకు పున స్వాగతం లభిస్తోందని ఆశిస్తున్నాను. ఈ విషయంలో ఒక్కొక్కరిని ఒక్కో అభిప్రాయం ఉండవచ్చు. కానీ నిషేధం ముగిసిన తర్వాత, ఆస్ట్రేలియా జట్టులోని వారికి సాధారణ స్వాగతం ఉంటుందని భావిస్తున్నాను. అనగా, వారిని కుట్రదారులుగా చూడకుండా, సాధారణ క్రికెటర్లుగా అభిమానులు చూస్తారని అనుకుంటున్నాను. ఈ విషయంలో అభిమానులు స్మిత్, వార్నర్‌లకు సరైన అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని పైన్ పేర్కొన్నాడు. బాన్‌క్రాఫ్ట్ తొమ్మిది నెలల నిషేధం డిసెంబర్‌తో ముగియగా.. స్మిత్, వార్నర్‌లు మార్చిలో అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి రానున్నారు.

ఏదైనా సాధ్యమే..!

- వర్కింగ్ పేరేంట్స్‌కు సెరెనా సందేశం

పెర్త్ : కొత్త ఏడాదిలో వర్కింగ్ పేరేంట్స్‌కు టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ స్ఫూర్తిదాయక సందేశం అందించింది. 2017లో 8 వారాల గర్భంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచిన సెరెనా.. మళ్లీ ఈ ఏడాది మెల్‌బోర్న్‌లో గ్రాండ్‌స్లామ్ వేట పున ప్రారంభించనున్నది. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ప్రాణాంతక సమస్యలను జయించి, మళ్లీ రాకెట్ పట్టిన సెరెనా విలియమ్స్ ఇప్పటికే అమ్మల ప్రతినిధి అయిపోయింది!. ' కొత్త ఏడాదిలో అడుగుపెట్టడం, వర్కింగ్ అమ్మ, నాన్నలు ఏం చేయాలి? ఏం చేయకూడదనే దానికి సంబంధించినది కాదు. ఏదైనా సాధ్యపడుతుంది. ఈ ఏడాదిలో తొలి మ్యాచ్‌కు సిద్ధమవుతున్నాను. నా గారాల పట్టి ఒలింపియాకు అలిసిపోయింది, ఇప్పుడు తనకు అమ్మ ప్రేమ అవసరం' అని సెరెనా తన సోషల్ మీడియా ఖాతాల్లో రాసుకొచ్చింది. ఓ చేతిలో చిన్నారిని ఎత్తుకుని వర్క్ అవుట్లు చేస్తోన్న ఫోటోను సైతం పోస్ట్ చేసిన సెరెనా.. ఎంతో మంది వర్కింగ్ అమ్మలు, నాన్నలు ఇంట్లో వారిని చూసుకుంటూ చేసే పనులే నన్ను ప్రేరేపితం చేశాయి. వర్కింగ్ అమ్మలు గాథలు విన్న తర్వాత నేను చేయగలను అనిపించింది అని సెరెనా రాసుకొచ్చింది.



ఫైనల్స్‌కు చేరేదెవరో?

- గుజరాత్, యూపీ యోధ ఢీ నేడు
- ప్రొ కబడ్డీ లీగ్ 6

ముంబయి : ప్రొ కబడ్డీ లీగ్ ఆరో సీజన్‌లో గ్రూప్ దశలో తిరుగులేని ప్రదర్శన జట్టు గుజరాత్ ఫార్చ్యూన్‌గెయింట్స్. డిఫెండింగ్ చాంపియన్ పట్నా పైరేట్స్‌ను కాదని ఆఖర్లో ప్లే ఆఫ్స్‌లో చోటు సాధించిన జట్టు యూపీ యోధ. ఇప్పుడీ ఈ రెండు జట్లు రెండో ఫైనల్స్ బెర్త్ కోసం పోటీపడుతున్నాయి. తొలి క్వాలిఫయర్‌లో బెంగళూర్ చేతిలో ఓడిన గుజరాత్, నేడు అమీతుమీ తేల్చుకోవాల్సిందే. గుజరాత్ రైడర్లు రాణించినా.. సునీల్ కుమార్, పర్వేశ్‌లు బెంగళూర్‌పై ఆరు టాకిల్స్ మాత్రమే చేశారు. రైడర్ సచిన్ మరోసారి 10 పాయింట్ల ప్రదర్శన చేసినా, డిఫెన్స్ చేతులెత్తేసింది. కానీ నేటి మ్యాచ్‌లో రైడర్లతో పాటు డిఫెండర్లు రాణిస్తేనే గుజరాత్ టైటిల్ పోరుకు చేరగలదు. మరోవైపు వరుసగా 8 మ్యాచుల్లో అజేయ రికార్డు కొనసాగిస్తున్న యూపీ యోధ తొమ్మిదో విజయంపై కన్నేసింది. లీగ్ దశలో వరుస ఓటములతో తీవ్ర విమర్శలెదుర్కొన్న యోధ.. అన్ని విభాగాల్లో ఎంతో పరిణితి చెందింది. రైడర్ ప్రశాంత్ కుమార్ భీకర ఫామ్‌లో కనిపిస్తున్నాడు. డిఫెండర్ సచిన్ కుమార్‌ను కాచుకోవటం గుజరాత్‌కు కీలకం కానున్నది. నేటి క్వాలిఫయర్-2 విజేత జనవరి 5న జరిగే ఫైనల్లో బెంగళూర్ బుల్స్‌తో టైటిల్ పోరులో తలపడనున్నది.



ఆ మూడింటికి కావాల్సింది...

రూ.17 వేల కోట్లు

- పెన్షన్ల పెంపు, రైతుబంధు, నిరుద్యోగ భృతికి నిధుల ఆవశ్యకత
- పీఆర్సీ కోసం మరో 7 వేల కోట్లు
- సమీకరణ కోసం సర్కారు కసరత్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్ఎస్ సర్కారు రెండోసారి అధికారంలోకి రావటంలో ప్రజాకర్షక, సంక్షేమ కార్యక్రమాలు కీలక పాత్ర పోషించాయి. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి కేసీఆర్.. వీటికి సంబంధించి పలు వాగ్దానాలను గుప్పించారు. అందులో ఆసరా పెన్షన్ల రెట్టింపు, రైతుబంధు కింద ఇచ్చే నగదును రూ.4 వేల నుంచి రూ.5 వేలకు పెంచటం, అర్హులైన నిరుద్యోగలకు నెలకు రూ.3,016 భృతి ఇవ్వటమనేవి అత్యంత ప్రధానమైనవి. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి వీటిని అమలు చేస్తామంటూ కేసీఆర్ ప్రకటించారు. ఈ క్రమంలో అర్హుల గుర్తింపు, అందుకోసం నియమ నిబంధనలు, మార్గదర్శకాల రూపకల్పన చేపట్టాలంటూ ఇప్పటికే ఆయన సీఎస్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులను ఆదేశించారు.

ప్రతిష్టాత్మకమైన పెన్షన్లు, రైతుబంధు, నిరుద్యోగ భృతి అమలుకు అవసరమైన నిధుల వేటను ఇప్పటికే ఉన్నతాధికారులు మొదలు పెట్టారు. ఆసరా పెన్షన్ల కోసం సర్కారు ప్రస్తుతం నెలకు రూ.500 కోట్లను కేటాయిస్తున్నది. వీటిని రెట్టింపు చేస్తామంటూ సీఎం ప్రకటించిన నేపథ్యంలో.. వచ్చే బడ్జెట్ తర్వాతి నుంచి దీనికి రూ.1000 కోట్లను కేటాయించాల్సి ఉంటుంది. రైతుబంధు కింద ఇప్పుడు ఎకరానికి రూ.4 వేలను ఇస్తున్నారు. కాగా ఎన్నికల హామీ నేపథ్యంలో అదనంగా మరో వెయ్యి రూపాయలు ఇవ్వాల్సి ఉంటుంది. నిరుద్యోగుల లెక్క తేలిన తర్వాత వారికి కూడా రూ.3.016 ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వీటన్నింటికీ కలిపి రూ.17 వేల కోట్లు ఖర్చవుతాయంటూ ఆర్థికశాఖ ప్రాథమిక అంచనాకు వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఇస్తామంటూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ప్రకటించారు. కానీ ఆ హామీని అమలు చేయలేదు. ఇప్పుడు పీఆర్సీని ప్రకటిస్తే.. సాలీనా రూ.7 వేల కోట్లను కేటాయించాలంటూ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతిష్టాత్మక పథకాలు, కార్యక్రమాల అమలు కోసం ఇప్పటి నుంచే నిధులు సమీకరణకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.



కటకట తప్పదా..?

అయితే గతంతో పోలిస్తే ఈసారి సర్కారుకు నిధుల పరంగా కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ఆర్థిక శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాష్ట్ర ఆదాయంలో వార్షిక వద్ధి రూ.14 వేల కోట్ల నుంచి రూ.16 వేల కోట్లు మాత్రమే. ప్రజలపై పన్నుల విధింపులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. వాటి వసూలు రేటులో కూడా మనమే నెంబర్‌వన్‌గా ఉన్నాం. అందువల్ల కొత్తగా పన్నులు వేసేందుకు సర్కారు ధైర్యం చేయకపోవచ్చని ఆయా వర్గాలు చెబుతున్నాయి. గత ప్రభుత్వాల హయాంలోనే సర్కారు భూములను దాదాపుగా అమ్మేశారు కాబట్టి.. ఇప్పుడు కొత్తగా భూముల అమ్మకాల ద్వారా వచ్చేందేం లేదు. రాష్ట్రంలో ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా బార్లకు పర్మిషన్లను ఇచ్చి.. మద్యం అమ్మకాలను విపరీతంగా ప్రోత్సహించారు. ఇంతకు మించి ఎక్సైజ్ ఆదాయం కూడా పెద్దగా పెరిగే ఛాన్స్ లేదు. పెట్రోలు, డీజిలుపై పన్ను మన రాష్ట్రంలోనే గరిష్ఠంగా (35.2 శాతం) ఉంది కనుక.. దాన్నింకా పెంచే పరిస్థితి లేకపోవచ్చని సమాచారం.

మరోవైపు అప్పులు కూడా గరిష్ఠ స్థాయికి చేరి కొత్తగా పుట్టని పరిస్థితి నెలకొంది. స్థూల రాష్ట్రీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 3.5 శాతం వరకు ఏటా అప్పు తెచ్చుకోవచ్చు. 2018-19లో తెలంగాణ జీఎస్‌డీపీ అంచనా 8.43 లక్షల కోట్లు. ఇందులో 3.5 శాతం అంటే... దాదాపు 30 వేల కోట్ల అప్పు తెచ్చుకునే అర్హత ఉంది. ఆ పరిమితిని మన రాష్ట్రం ఎప్పుడో చేరుకుంది. ఇప్పటికే చేసిన బాకీలకు భారీగా వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగా ప్రభుత్వం పదేళ్ల కాలానికి అప్పులు తీసుకుని.. పదో ఏట నుంచి చెల్లింపు మొదలుపెడుతుంది. కానీ ఖజానా నిండుకోవడంతో 15, 20, 25 ఏండ్ల కాలానికి అప్పులు తీసుకుంటున్న పరిస్థితి నెలకొందని ఓ అధికారి వ్యాఖ్యానించారు. రుణ వ్యవధి పెరిగితే వడ్డీ భారం కూడా పెరుగుతుందని ఆయన తెలిపారు. ఇక మిగిలింది రిజర్వ్‌బ్యాంకు నుంచి ఓవర్‌డ్రాఫ్ట్ ఒక్కటే. కానీ ఓ.డీకి వెళ్లి.. వారం రోజుల్లో సర్దుబాటు చేయకుంటే... ప్రభుత్వానికి సంబంధించిన అన్ని చెల్లింపులనూ ఆపేయాల్సిందిగా బ్యాంకులను ఆర్బీఐ ఆదేశిస్తుంది. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ సర్కారు వీటన్నింటినీ ఎలా అధిగమిస్తుందో చూడాలి.

వైఎస్ జమానాలో...

గతంలో వైఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఓ అధికారి ఈ సందర్భంగా ప్రస్తావించారు. మొదటిసారి ప్రవేశపెట్టిన పథకాల ప్రభావంతో వైఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత కొద్ది నెలలకే ఆయన మరణించారు.

ఆ వెంటనే తెలంగాణ ఉద్యమం ఊపందుకోవటంతో అప్పటి ఆర్థిక పరిస్థితులు, సర్కారు వైఫల్యాల గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా మొదటిసారి కంటే రెండోసారి ఆర్థిక పరిస్థితులను సమన్వయం చేయటం కష్టంగా మారుతుందని సదరు అధికారి అభిప్రాయపడటం గమనార్హం.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.